మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM


## 44 శాతం సర్వే పూర్తి

ఇంటింటి కుటుంబ సర్వే దేశానికి ఆదర్శంగా ఉండాలి : సిఎం రేవంత్‌రెడ్డి

07




సంపుటి 07, సంచిక: 345 | శనివారం | 16-11-2024 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12 | వెల రూ. 5.00




# వామపక్ష కూటమి విజయఢంకా

శ్రీలంకలో బలాధిక్యత నిరూపించుకున్న అధ్యక్షుడు దిస్సనాయకే

జాఫ్నాజిల్లాలో చరిత్ర సృష్టించిన ఎన్‌పిపి

పార్లమెంటులో రెండువంతుల మెజారిటీ

వచ్చేవారంలో కొత్త కొలువు



**కొలంబో :** శ్రీలంక పార్లమెంటు ఎన్నికల్లో అధికార వామపక్ష కూటమి విజయఢంకా మోగించింది. ఆకస్మికంగా పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో 'నేషనల్ పీపుల్స్ పవర్' అధికార కూటమి (ఎన్‌పిపి) మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించింది. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో, దిస్సనాయకే సారథ్యానగల ఎన్‌పిపి వామపక్ష కూటమి "దిక్సూచి" ఎన్నికలచిహ్నంపై పోటీ చేసింది. పార్లమెంటులో ఉన్న మొత్తం 225 స్థానాలకుగాను 159 స్థానాలను గెలుచుకుంది. మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించింది. "ప్రజలను భిన్న వర్గాలుగా విభజించి ఒకరిపై మరొకరిని ఎగదోసే యుగానికి కాలం చెల్లింది, ఇప్పుడు ప్రజలు ఎన్‌పిపికి పట్టంకట్టారు" అని దేశాధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దేశంలో అవినీతి నిర్మూలించి, రాజకీయ స్థిరత్వం సాధిస్తానని అధ్యక్ష ఎన్నికల్లో, పార్లమెంటు ఎన్నికలలో దిస్సనాయకే ప్రజలకు వాగ్దానం చేశారు. పార్లమెంటులో 225 స్థానాలకుగాను 196 మంది ప్రజాప్రతినిధులను ప్రత్యక్షంగా ప్రజలు ఎన్నుకుంటారు. మిగిలినవారిని తరువాయి 2లో



# 'గాడిద పాల ఉత్పత్తి'తో.. ఘరానా మోసం

'డాంకీ ప్యాలెస్' పేరిట రూ.100 కోట్లు వసూలు

న్యాయం చేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల బాధితుల వేడుకోలు

ప్రజాపక్షం/హైదరాబాద్

గాడిద పాల ఉత్పత్తి పేరిట తమిళనాడులోని చెన్నైకి చెందిన డాంకీ ప్యాలెస్ సంస్థ రూ.100 కోట్ల మోసానికి పాల్పడింది. ఆ సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల రైతులను మోసం చేసిందని బాధితులు వాపోయారు. డాంకీ ప్యాలెస్ బాధిత రైతులు శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తమ గోడు వెలిబుచ్చారు. చెన్నైకి చెందిన డాంకీ ప్యాలెస్ ఫ్రాంచైజీ గ్రూపు సభ్యులు తమను నమ్మించి తరువాయి 2లో

## బులియన్ మార్కెట్



**బంగారం**

18 క్యారెట్లు గ్రాము ధర రూ. 5,682
22 క్యారెట్లు గ్రాము ధర రూ. 6,945
24 క్యారెట్లు గ్రాము ధర రూ. 7,576
వెండి కిలో 79,000

**స్టాక్ మార్కెట్**



సెన్సెక్స్ 77,580.31 పాయింట్లు (– 0.149 శాతం)
నిఫ్టీ 23,532.70 పాయింట్లు (– 0.11 శాతం)
**పెట్రోలు లీటరు రూ. 107.46**
**డీజిల్ లీటరు రూ. 95.70**

# రైతులను బలిపశువు చేయొద్దు

రాజకీయ లక్ష్యసాధనకు వేరేమార్గాలుంటాయి

అధికారం పోతే అల్లకల్లోలమవుతారా? ఆతృత చెందుతారా?

బిజెపి, బిఆర్‌ఎస్‌పై మంత్రులు తుమ్మల, దుద్దిళ్ల విమర్శలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాజకీయ పార్టీలు రైతును బలిపశువు చేసే విధానాలకు పాల్పడవద్దని, రాజకీయ లక్ష్యాలు ఛేదించాలంటే వేరే మార్గాలు ఉంటాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు బిజెపి, బిఆర్‌ఎస్‌లకు సూచించారు. అధికారం పోయినంత మాత్రాన అంత అల్లకల్లోలం, ఆతృత పడాల్సిన అవసరం లేదని, ఆ పార్టీ (బిఆర్‌ఎస్)లో వైరుద్యాలు, ఆధిపత్య పోరు ఉండొచ్చని, లేదా రాష్ట్రంలో కాంగ్రెస్ తర్వాతి స్థానాన్ని ఎవరు ఆక్రమించాలనే కోరిక ఆ రెండు రాజకీయ పార్టీలలో(బిజెపి,బిఆర్‌ఎస్) ఉండొచ్చని, కానీ ఆధిపత్య పోరులో రైతాంగాన్ని బలి పెట్టాలని, వారిని ఆందోళనకు గురి చేయాలనే రాజకీయ ప్రయత్నం తప్పుడు విధానమని దుయ్యబట్టారు. కోటీ 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని, ఇది చరిత్రలోమొదటి సారి అని అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరిశ్రమలు, ఐటి శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి (బిజెపి) రైతులపైన మక్కువ, అభిమానం, ఉంటే, వారు నిజంగానే రైతాంగం కోసం మాట్లాడితే తేమ శాతంలో ఉన్న మార్గదర్శకాలను మార్చాలని సూచించారు. ఆ ప్రయత్నం చేయకుండా అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ పండించిన తెలంగాణ రైతాంగాన్ని ఆగం చేయాలని ముందుకొస్తే అది 'మీ వినాశనానికి' దారి తీస్తుందని హెచ్చరించారు. గత ప్రభుత్వంలో వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం 1కోటీ 46 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దేశంలోనే రెండవస్థానంలో నిలిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కోటీ 53 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు. గత ప్రభుత్వంలో 25 లక్షల ఎకరాల్లో సన్న రకాలను ఉత్పత్తి చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 40 లక్షల ఎకరాల్లో సన్నధాన్యం పండిందని, సన్నధాన్యానికి రూ.500ల బోనస్ ఇవ్వడమే ఇందుకు కారణమని మంత్రి వివరించారు. సంక్రాంతి పండగ నుంచి రేషన్ కార్డులపైన పేదలకు సన్నం బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, గురకులాలు, అన్ని సంక్షేమ హాస్టల్స్‌లో పిల్లలకు సన్నం బియ్యం ఇవ్వాలన్నదనే ప్రభుత్వ ఆకాంక్ష అని వివరించారు. గత ప్రభుత్వం 4555 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 7411 కేంద్రాలను కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని వివరించారు. రైతులు పండిచిన ప్రతి గింజనుకొంటామని, సమయానికి సొమ్మును ఇస్తామని తుమ్మల రైతులకు భరోసానిచ్చారు.

**హరీశ్, కెటిఆర్ మొసలి కన్నీరు : మంత్రి శ్రీధర్‌బాబు**

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హరీశ్, కెటిఆర్‌లు పదేళ్ల పాటు రైతులకు అన్యాయం చేసి, రైతులకు మేలు చేయకుండా, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన ప్రతి మాటలను నిలుపుకునేందుకు తాము ప్రయత్నిస్తున్నామన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ఇష్టారాజ్యంగా, అడ్డగోలుగా అస్తవ్యస్తం చేసిందని మండిపడ్డారు. వికారాబాద్‌ఘటనలో కలెక్టర్‌ను, గ్రూప్ 1 అధికారిపైన హత్యాయత్నం జరిగిందని, ఇలా ఎప్పుడైనా జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు. అభిప్రాయ సేకరణలో భాగంగా కలెక్టర్ అక్కడికి వెళ్లారని వివరించారు. ప్రజాస్వామిక పద్ధతిలో రైతులతో, భూములు కోల్పోయే వారితో మాట్లాడేందుకు,వారి అభిప్రాయాలను తీసుకుని, బాధితులను ఒప్పించి ముందు కెళ్తామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా, భయానక వాతావరణాన్ని సృష్టించాలని, అధికార యంత్రాంగాన్ని భయపెట్టించాలని చేయడం మంచిది కాదని స్పష్టం చేవారు. విచారణలో అన్ని విషయాలూ బయటికి వస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.



## 20 నుంచి మళ్లీ కాళేశ్వరంపై కమిషన్ విచారణ !


కెసిఆర్, హరీశ్‌రావులను పిలిచే అవకాశం

ప్రజాపక్షం / హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ విచారణ ఈ నెల 20 నుంచి తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. విచారణలో భాగంగా జస్టిస్ పిసి ఘోష్ రెండు వారాల పాటు హైదరాబాద్ లోనే ఉంటారు. ఇప్పటి వరకు పలువురు అధికారులను విచారించిన కమిషన్ ఈ నెల 20 నుంచి ఐఎఎస్‌లు, మాజీ ఐఎఎస్‌లకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు విచారణ జరుగుతున్న క్రమంలో కమిషన్ విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించేందుకు డిసెంబర్ నెలాఖరు వరకు గడువు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే కమిషన్ విచారణ గడువు పెంపు జీవో జారీలో ప్రభుత్వం జాప్యం చేయడంతో విచారణ రెండు వారాలు ఆలస్యమైంది. ఈ నెల 12 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ చేపట్టాలని జస్టిస్ పిసి ఘోష్ తరువాయి 2లో

## పేదలను పణంగా పెట్టి బిలియనీర్లకు లబ్ధి

ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ మండిపాటు



**మహాగమ :** ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ మరోసారి ప్రధాని నరేంద్రమోదీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. పేదల ప్రయోజనాలను పణంగా పెట్టి బిలియనీర్లకు లబ్ధి చేకూర్చేందుకే పనిచేస్తున్నారన్నారు. శుక్రవారం రాహుల్‌గాంధీ జార్కండ్‌లోని గొడ్డా జిల్లాలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఇండియా కూటమి రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు పోరాడుతుంటే, బిజెపి మాత్రం దానిని చెత్తబుట్టలో వేసేందుకు తరువాయి 12లో



# తేమ, తరుగు పేరుతో దగా చేయకండి

రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉంచాలి

కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు



సిపిఐలో చేరిన 20 కుటుంబాలు

ప్రజాపక్షం/పాల్వంచ/లక్ష్మీ దేవిపల్లి

తేమ, తరుగు పేరుతో రైతులను దగా చేయొద్దని, కొనుగోలు కేంద్రంపై అధికారులు, సొసైటీ బాధ్యులు నిత్యం పర్యవేక్షించాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సూచించారు. ఖమ్మం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని సోములుగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జరుగుతోందని, తక్షణమే ప్రతిపాదిత గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయాలని, కేంద్రాల సంఖ్యను పెంచడం ద్వారా రైతులకు రవాణా ఖర్చులు ఆదా అవుతాయన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, కొనుగోలు కేంద్రాలను ఆశ్రయించి ప్రభుత్వ మద్దతు ధరతో పాటు తరువాయి 12లో

# ఆర్టికల్ 370 ముగిసిన అధ్యాయం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటన



**శ్రీనగర్ :** జమ్మూ కశ్మీరుకు స్వయంప్రతిపత్తి కల్పించిన 370వ అధికరణకు కాలం చెల్లిందని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే అన్నారు. మొదటి సారి ఆయన ఈ విధమైన ప్రకటన చేశారు. పార్లమెంటు దీనిని తీర్మానం ద్వారా రద్దుచేసినందువల్ల 370వ అధికరణ ఒక ముగిసిన అధ్యాయమని ఆయన ప్రకటించారు. శ్రీనగర్‌లో శుక్రవారంనాడు పత్రికాగోష్టిలో ఖర్గే మాట్లాడుతూ, 370వ అధికరణ పునరుద్ధరణకు కాంగ్రెస్‌పార్టీ ప్రయత్నాలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన విమర్శలపై ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "కాంగ్రెస్‌పార్టీ అలా ఎప్పుడు చెప్పింది?" అని ప్రశ్నించారు. 370వ అధికరణపై కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మొట్టమొదటిసారి ఈ విధంగా ఒక స్పష్టమైన ప్రకటన చేశారు. బిజెపి అదేపనిగా జమ్మూ కశ్మీరు ప్రత్యేక ప్రతిపత్తి అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకోసం సమస్యగా కొనసాగిస్తోందని అన్నారు. దీంతో ఇప్పటివరకూ 370వ అధికరణ రద్దుపై కాంగ్రెస్‌పార్టీ అనుసరించిన ఊగిసలాటధోరణికి తెరపడినట్లయింది. అదేవిధంగా బిజెపి గుజరాత్‌కు పరిశ్రమలను తరలించుకుపోతున్నదని, దీనివల్ల మహారాష్ట్రకు తీవ్ర నష్టం జరగమేకాకుండా, నిరుద్యోగం పెరుగుతోందని విమర్శించారు. బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలను ఆయన నిలదీశారు. దేశ జాతీయ ఆర్థిక వ్యవస్థకు భారీగా ఉపయోగపడుతున్న మహారాష్ట్రకు డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో తీరని వివక్ష, అన్యాయం జరుగుతోందని అన్నారు. బిజెపి పరిపాలనలో శాంతి భద్రతలు బాగా క్షీణించిపోయాయనీ, ప్రజలకు భద్రతలేదని చెబుతూ బద్లాపూర్‌లో అత్యాచారం జరిగితే కేసు నమోదు చేయడానికి తీవ్ర జాప్యం చేశారని ఖర్గే విమర్శించారు. పుణే రింగ్‌రోడ్ వంటి ప్రాజెక్టులలో తీవ్రమైన అవినీతి జరుగుతోందనీ, వాటి నిర్మాణ వ్యయం బుడగలాగా రూ.16,618 కోట్ల నుండి రూ. 42,170కు పెరిగిపోయిందని విమర్శించారు. దేశంలో జీవన వ్యయాలు పెరిగిపోయాయని, ధరలు మండిపోతున్నాయనీ ప్రత్యేకించి ద్రవ్యోల్బణం గడచిన 14 నెలల్లో తరువాయి 2లో

ఇందిరా మహిళా శక్తి సభ్యులు

# పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

స్థల సేకరణ, బ్యాంకు రుణాల్లో చేయూతనందించండి

అధికారులకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశం



ప్రజాపక్షం/ హైదరాబాద్

ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని తెలంగాణ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల ఫెడరేషన్ల ద్వారా రాష్ట్రంలో పెద్దఎత్తున 4 వేల మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తికి తరువాయి 2లో

# 'విద్యుత్ అంబులెన్స్'తో సత్ఫలితాలు

ఫోన్ వచ్చిన కొద్ది సమయంలోనే ఆయా ప్రాంతాలకు అత్యవసర స్పందన బృందం

డిసెంబర్ 1 నాటికి 101 వాహనాలు సిద్ధం!!

ఇటీవల 10 వాహనాలను ప్రారంభించిన విద్యుత్ శాఖ మంత్రి భట్టి





ప్రజాపక్షం / హైదరాబాద్

విద్యుత్ సరఫరాలో అవాంతరాలను నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చిన ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం వాహనాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గత నెలలోనే విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వినియోగించేందుకు గాను 10 వాహనాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. వినియోగదారుల నుండి ఫోన్ వస్తే చాలు కొన్ని నిమిషాల్లోనే ఆయా ప్రాంతాల్లో ప్రత్యక్షం అవుతు వినియోగదారుల నుండి ఆదరాభిమానాలను పొందుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ ఆదేశాలతో టిజి ఎస్‌పిడిసిఎల్ పరిధిలో 101 అత్యాధునిక (అంబులెన్సు తరహా) వాహనాలను డిసెంబర్ ఒకటి, 2024 నుండి క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వారు ఎక్కడైనా, ఏ సమయంలోనైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగితే అక్కడ కొద్ది సేపటికే వచ్చేసి వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇటు శీతాకాలం మొదలు కొని వచ్చే వేసవి నేపథ్యంలోనే ఈ డిసెంబర్‌లో 101 వాహనాలు విద్యుత్ శాఖ పరిధిలో తరువాయి 2లో

# 12 వారాలు ప్రసూతి సెలవులా?

3 నెలల కంటే తక్కువ వయస్సున్న పిల్లల దత్తత మహిళలపై 'సుప్రీం' వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** ప్రసూతి సెలవు ప్రయోజనాలను పొందేందుకు 3 నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను దత్తత తీసుకునే మహిళలను మాత్రమే అనుమతించే నిబంధన వెనుక ఉన్నటువంటి హేతుబద్ధతను వివరించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని కోరింది. మూడు నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను దత్తత తీసుకునే మహిళలకు మాత్రమే 12 వారాల పాటు ప్రసూతి సెలవు ప్రయోజనాలను పొందేందుకు అర్హత కల్పించే ప్రసూతి చట్టం, 1961 సంవత్సరం రాజ్యాంగ నిబంధన రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం నాడు తరువాయి 12లో

## ప్రపంచం



లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడిలో కనీసం 12 మంది రెస్క్యూ సిబ్బంది, 15 మంది పౌరులు మృతి చెందారు. సిరియా మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం బాల్‌బెక్ ప్రాంతంలో జరుగుతున్న సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బందిలో కొంత మంది బాంబు దాడిలో తీవ్రంగా గాయపడ్డారు వారిలో పన్నెండు మంది మృతి చెందారు. కాగా, జనావాసాలపైన కూడా వైమానిక దాడులు జరిగాయి. ఈ ఘటనలో లెబనాన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. హిజ్బొల్లా సంస్థ పరివేత పేరుతో ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. మరోవైపు గాజాలోనూ ఇదే పరిస్థితి. అక్కడ పాలస్తీనియన్లు ఆశ్రయం పొందుతున్న ఆసుపత్రులు, పాఠశాలలు, సహాయక శిబిరాలపైన కూడా ఇజ్రాయెల్ దాడులకు దిగుతున్నది. ఈ చర్యలను అంతర్జాతీయ సమాజం ముక్తకంఠంతో ఖండిస్తున్నప్పటికీ ఇజ్రాయెల్ తీరు మారడం లేదు.



స్పెయిన్‌లోని జరాగోజా ప్రాంతంలో ఒక నర్సింగ్ హోమ్ మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటనలో కనీసం 10 మంది మృతి చెందారని అధికారులు ప్రకటించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మృతుల వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

# లక్ష్యాన్ని ఢీకొని పేలిపోయే ఉత్తర కొరియా ఆత్మాహుతి డ్రోన్స్

**ప్యోంగ్యాంగ్:** నిర్దేశించిన లక్ష్యాలను ఢీకొని పేలిపోయే ఆత్మాహుతి డ్రోన్లను ఉత్తర కొరియా తయారు చేసింది. ఈ డ్రోన్ల ప్రదర్శనను సందర్శించిన అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, వీటి ఉత్పత్తిని భారీగా పెంచాలని ఆదేశించడంపై దక్షిణ కొరియా, జపాన్, అమెరికా వంటి దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా సాయుధ దళాలకు సాయంగా ఉత్తర కొరియా ఇటీవల తన సైన్యాన్ని పంపిన విషయం తెలిసిందే. నలుపు రంగు లెదర్ జాకెట్ ధరించిన కిమ్ కుర్చీ నుంచి లేచి డ్రోన్లు ఆకాశంలోకి ఎగరడాన్ని వీక్షించినట్లు ప్యోంగ్యాంగ్ ప్రభుత్వ మీడియా శుక్రవారం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఉత్తర కొరియా కనీసం మూడు వేర్వేరు డ్రోన్ మోడళ్లను ప్రదర్శించిందని ప్రభుత్వమీడియా ఫోటోలను సమీక్షించిన సైనిక నిపుణులు తెలిపారు. ఆ మూడు వేర్వేరు డ్రోన్ మోడళ్లలో రష్యన్ ఉపయోగించే లాన్సెట్ ను పోలిన పెద్ద ఎక్స్‌వింగ్ మోడల్ ఒకటి కాగా, మరొకటి చిన్న ఫిక్స్‌డ్ వింగ్ డ్రోన్ అని సైనిక నిపుణుడు యాంగ్ యూక్ తెలిపారు. మరొకటి దీర్ఘశ్రేణి దాడులు చేయగల పెద్ద 'థియేటర్‌స్థాయి' డ్రోన్ అని వివరించారు. ఈ డ్రోన్లు వివిధ స్థాయిల్లో పేలుడు పదార్థాలను మోసుకు వెళ్లి, ఆత్మాహుతి డ్రోన్‌గా దాడులకు పాల్పడగలవని తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధంతో పాటు మధ్యప్రాచ్యంలో జరిగిన యుద్ధాల్లోనూ ఈ అటాకింగ్ డ్రోన్లు కీలక పాత్ర పోషించాయి. ఈ మానవ రహిత వాహనాలు ప్రాణాంతక దాడులకు పాల్పడుతున్నాయి. దక్షిణ కొరియా, అమెరికాలతో సాంకేతిక అంతరం దృష్ట్యా ఉత్తర కొరియా వంటి నగదు ఉన్న దేశానికి ఇవి సాపేక్షంగా చౌకైన, మరింత ప్రభావవంతమైన ఎంపికను సూచిస్తాయి. సాయుధ దళాల డ్రోన్ సామర్థ్యాలను మెరుగుపర్చాలని కిమ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. అమెరికా, యూరోప్ దేశాల ఆంక్షల వల్ల రష్యా మినహా ఉత్తర కొరియాకు డ్రోన్ సరఫరాదారుగా నిలిచేందుకు ఏ దేశం కూడా ముందుకురావడం లేదు. ఈ పరిస్థితుల్లో సొంతంగా అటాక్ డ్రోన్ల డిజైన్ ను కలిగి ఉండడం ఉత్తర కొరియాకు అత్యవసరం. కాగా, డ్రోన్ ప్రదర్శనలో పాల్గొని, అటాక్ డ్రోన్స్ ను భారీగా ఉత్పత్తి చేయాలని జోంగ్ ఉన్ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సైన్యాలకు డ్రోన్లు అత్యవసరంగా మారాయని అన్నారు. వాటిని స్ట్రైకింగ్ పవర్ లో భాగంగా ఉపయోగించుకోవడం సులువైనదని తెలిపారు.





# పెరూ చేరుకున్న జో బైడెన్


### అమెరికా అధ్యక్షుడి హోదాలో చివరి పర్యటన



**లీమా (పెరూ):** అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ తన చివరి విదేశీ పర్యటన కోసం పెరూ చేరుకున్నారు. ఆరు రోజుల ఈ పర్యటనలో ఆయన పలు సదస్సులు, సమావేశాల్లో పాల్గొంటారు. పెరూలో జరిగే ఆసియా-పసిఫిక్ ఎకనామిక్ కోపరేషన్ (ఎపెక్) సదస్సుతో ప్రారంభమయ్యే బైడెన్ పర్యటన బ్రెజిల్‌లో గ్రూప్ 20 సమావేశంతో ముగుస్తుంది. ఈ పర్యటనలో భాగంగా ఆయన చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్‌తో ముఖాముఖి చర్చలు జరుపుతారు. అనంతరం దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్, జపాన్ ప్రధాన మంత్రి షిగెరు ఇషిబాతో సమావేశమవుతారు. ఈ ముగ్గురూ గత ఏడాది జరిగిన చర్చలు, అవగాహనల పరిస్థితిని సమీక్షించే అవకాశాలున్నాయని వైట్‌హౌస్ నుంచి అమెరికా జాతీయ భద్రతా సలహాదరు జేక్ సలీవాన్ ఒక ప్రకటనలో తెలిపారు. చైనా, ఉత్తర కొరియా దూకుడును నిలువరించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలపై వారు చర్చిస్తారని పేర్కొన్నారు. ఇలావుంటే, బైటెన్ తన పర్యటనను ప్రారంభించినప్పటికీ, ప్రపంచ దేశాల అధినేతల దృష్టి మొత్తం మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌పైనే కేంద్రీకృతమై ఉన్నాయి. నాలుగేళ్ల విరామం తర్వాత మళ్లీ వైట్‌హౌస్‌లోకి అడుగుపెట్టనున్న ట్రంప్ తీసుకోబోయే నిర్ణయాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ప్రపంచ దేశాల అధినేతలను ఆయనను అభినందలతో ముంచెత్తుతున్నారు. చైనా తదితర దేశాలతో ట్రంప్ వ్యవహార శైలి ఏ విధంగా ఉండబోతున్నదనేది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. గతంలో మాదిరిగానే ఆయన సంచలనాత్మక నిర్ణయాలు తీసుకుంటారా? లేక అప్పట్లో వచ్చిన విమర్శలను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి వ్యవహరిస్తారా? అన్నది చూడాలి.

# పెరూలో భారీ షిప్‌యార్డ్

### ఉద్యోగావకాశాలు పెరుగుతాయన్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్






**చాంకే (పెరూ):** ఇకపై పెరూలో ఉద్యోగావకాశాలు భారీగా పెరుగుతాయని, అభివృద్ధికి మార్గాలు ఏర్పడతాయని చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ అన్నారు. వాంకేలో 1.3 బిలియన్ డాలర్ల వ్యయంతో చేపట్టిన మెగాపోర్టు ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ నౌకాశ్రయం వల్ల పెరూ ఆదాయం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. పెరూ తీరప్రాంత అంచున ఉన్న ఒక మారుమూల మత్స్యకార పట్టణమైన చాంకేలో ఈ ఓడ రేవును చైనీస్ షిప్పింగ్ దిగ్గజం 'కాస్కో' నిర్మించింది. ఈ పట్టణ నివాసితులలో మూడో వంతు మందికి నీటి నీటి వసతి లేదు. అయితే, వనరులు అధికంగా ఉన్న దక్షిణ అమెరికాపై చైనా దృష్టి కేంద్రీకరించింది. ఓడ రేవుకు సుమారు 60 కిలోమీటర్ల దూరంలోని లిమాలో వున్న అధ్యక్ష భవనం నుంచి జిన్‌పింగ్ కార్యక్రమ స్థలికి చేరుకున్నారు. ఆయన వెంట పెరూ అధ్యక్షుడు డినా బోలువార్టే కూడా ఉన్నారు. వీరిద్దరూ ఓడరేపు ఆవిష్కరించిన దృశ్యాలు భారీ స్క్రీన్లపై దర్శనమిచ్చాయి. కార్యక్రమాన్ని పెరూ మీడియా ప్రత్యక్ష ప్రసారం చేసింది. ప్రారంభోత్సవానికి సూచికగా మొదటి అల్యూమినియం కంటైనర్‌ను ఒక క్రేన్ భారీ కార్గో షిప్‌లోకి దింపింది. ఆ వెంటనే సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. డ్రాగన్ దస్తులతో చైనీస్ డాన్సర్ల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ పెరూకు ఉజ్వల భవిష్యత్తు ఉందని అన్నారు. ఓడ రేవురాకతో ఎంతోమందికి ఉద్యోగాలు లభిస్తాయని, స్థానిక ప్రజల ఆదాయం పెరుగుతుందని అన్నారు. అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద ఈ ప్రాజెక్టులో భాగంగా 15 రేవులు, ఒక పెద్ద ఇండస్ట్రియల్ పార్క్ వస్తాయని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు 3.5 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ పెట్టుబడులను ఆకర్షిస్తుందని ఆయన అన్నారు. ఇలావుంటే, కాస్కో కంపెనీ చేపట్టిన ప్రాజెక్టు పట్ల స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు ఉద్యోగావకాశాలు దక్కుతాయన్న అధికారుల హామీని సందేహిస్తున్నారు. ఇలావుంటే, సహజవనరులు అధికంగా ఉన్న పెరూలో కొత్త షిప్పింగ్ యార్డు వల్ల ఆదాయ వనరులు పెరుగుతాయని నిపుణులు అంటున్నారు. ఇక్కడి నుంచి బ్లూబెర్రీస్, బ్రెజిల్‌కు చెందిన సోయాబీన్స్, చిలీ నుంచి రాగి భారీ పరిమాణంలో వివిధ దేశాలకు ఎగుమతయ్యే అవకాశాలు ఉన్నాయి. దక్షిణ అమెరికా నుంచి ఆసియాను అనుసంధానించే కొత్త మార్గం ఏర్పడడంతో, రవాణా మరింత సులభతరం అవుతుందని పెరూ ప్రభుత్వం భావిస్తున్నది. నౌకాశ్రయం ఉన్న ప్రాంతం పలు దేశాలకు అందుబాటులో ఉన్నందువల్ల, రవాణాకు ఇది కేంద్రంగా మారుతుందని ఆశిస్తున్నది.

# రష్యా, ఉక్రేన్ యుద్ధం అంతానికి కృషి



అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్:** రష్యా, ఉక్రేన్ యుద్ధం అంతానికి తాను కృషి చేస్తానని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అన్నారు. 'మార్ ఎ లాగో' ఎస్టేట్‌లో జరిగిన అమెరికా ఫస్ట్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 5వ తేదీన జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ట్రంప్ తన సమీప ప్రత్యర్థి, డెమోక్రాటిక్ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌ను ఓడించిన విషయం తెలిసిందే. ఫలితాలు వెల్లడైన తర్వాత ఆయన ఒక భారీ సభలో ప్రసంగించడం ఇదే మొదటిసారి. రష్యా, ఉక్రేన్ యుద్ధానికి తెరపడాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. వేలాది మంది ప్రజలు మరణిస్తున్నారని, లక్షలాది మంది నిరాశ్రయులవుతున్నారని ట్రంప్ అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ అంశాన్ని పరిశీలిస్తానని, యుద్ధం నిలుపుదలకు కృషి చేస్తానని అన్నారు.

## కాళేశ్వరంపై కమిషన్ విచారణ !

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ నిర్ణయించగా ఈ నెల 13న కమిషన్ గడువును పొడిగిస్తూ ప్రభుత్వం మెమోరాండం విడుదల చేసింది. జీవో కోసం 13 రోజులుగా ఎదురు చూస్తున్న జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇక ప్రభుత్వం నుండి అనుమతి రావడంతో తిరిగి విచారణ ప్రారంభం కానుంది. కాగా ఇప్పటి వరకు నీటి పారుదల శాఖ ఈఎన్‌సిలు, మాజీ ఈఎన్‌సిలు, చీఫ్ ఇంజినీర్లు, ఎస్‌ఈల క్రాస్ ఎగ్జామినేషన్ ఇప్పటికే పూర్తయింది. పలు సందర్భాల్లో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు తదితరుల పేర్లను ప్రస్తావిస్తూ వీరు కమిషన్‌కు తెలపడం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా ఐఏఎస్, మాజీ ఐఏఎస్‌లను విచారించిన అనంతరం మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఆ ఇద్దరు మాజీ కీలక ప్రజా ప్రతినిధులను విచారణకు హాజరు కావాల్సిందిగా సమన్లు పంపనున్నట్లు తెలుస్తోంది. వారి విచారణకు అవసరమైన ఆధారాలను కమిషన్ ఇప్పటికే ఇరిగేషన్ శాఖ అధికారుల నుండి సేకరించింది. ఈ నెలాఖరులో గానీ, డిసెంబర్ మొదటి వారంలో గానీ వారిద్దరికీ సమన్లు పంపే అవకాశాలున్నాయని తెలుస్తోంది. పిసి ఘోస్ కమిషన్ నివేదికను డిసెంబర్‌లో ఖరారు చేసి నెలాఖరు లోగానే ప్రభుత్వానికి సమర్పించే అవకాశాలు ఉంటాయని సమాచారం.

## పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

త్వరితగతిన చర్యలు ప్రారంభించాలని, ఇందు కోసం వారికి అవసరమైన స్థలాలను సేకరించి వారికి లీజుకు ఇవ్వాలని, బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన ఆర్థిక రుణాలు ఇప్పించే ఏర్పాటు చేయాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. ఇటీవల బ్యాంకర్ల సమావేశంలోనూ స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు సోలార్ పవర్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటు, ఆర్‌టిసికి బస్సులు సమకూర్చే తదితర మరిన్ని పథకాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురానున్నట్టు స్పష్టం చేశామని, రుణాల రీపేమెంట్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులు 99 శాతం ప్రగతిని కనబరుస్తున్నందున విరివిగా రుణాలు అందించి ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తామని బ్యాంకర్లు స్పష్టం చేసిన విషయాన్ని డిప్యూటీ సిఎం అధికారులకు వివరించారు. మహిళా సంఘాలకు ఆర్థిక చేయూతను ఇవ్వడం ద్వారా, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది సామాజిక మార్పు సాధించేందుకు అవకాశం ఏర్పడుతుందని డిప్యూటీ సిఎం తెలిపారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలపడితే గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్, సెర్ప్ సిఇఓ దివ్య దేవరాజన్, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, రెడ్కో వైస్ చైర్మన్, ఎండి వావిలాల అనీల తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)

11 శాతం మేరకు పెరిగిందని విమర్శించారు. అటు కేంద్రంలో, ఇటు బిజెపి పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వాలు ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయడంద్వారా, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను నిలిపివేయడంద్వారా ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిలకు రిజర్వేషన్లను చిన్నచూపు చూస్తోందన్నారు. లేటరల్ ఎంట్రీ వ్యవస్థను కూడా ఆయన నిశితంగా విమర్శించారు. ఈ విధానంద్వారా ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి భావజాలంగల వ్యక్తులను, ఉద్యోగులను ఉన్నతస్థానాల్లో కూర్చోబెడుతున్నారని ఖర్గే విమర్శించారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదంతో మోదీ చేస్తున్న ప్రచారాన్ని ఖర్గే ఎండగట్టారు. 400 సీట్లు గెలుచుకోవాలని ఆశపడిన బిజెపి చివరకు రెండు పార్టీలపై ప్రధానంగా ఆధారపడి ప్రభుత్వాన్ని నడపవలసి వస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌పార్టీ దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిందని గుర్తుచేశారు.మహాత్మాగాంధీని హత్య చేసిన గాడ్సేను బిజెపి మద్దతుదారులు గొప్పవాడిగా చూపించడాన్ని ఆయన ఖండించారు. దేశంలో ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

## 'విద్యుత్ అంబులెన్స్'తో సత్ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)




ఉండనున్నాయి. ఈ 101 వాహనాలు వస్తే గనుక..జంటనగరాల్లోని అన్ని ప్రాంతాల్లో అటు హైటెక్ సిటీ నుండి మొదలు కొని ఇటు పాత బస్తీ, చార్మినార్, మీరాలం ట్యాంక్, అటు కూకట్‌పల్లి, మియాపూర్ , లింగంపల్లి, బాచ్‌పల్లి, ఇటు తూర్పున ఉప్పల్, బోడుప్పల్ నుండి మొదలు కొని బీబీ నగర్ పరిసరాల వరకు, దక్షిణ ప్రాంతంలోనూ నాగోల్, ఎల్ బి నగర్ నుండి మొదలు కొని రామోజీ ఫిల్మ్ సిటీ పరిధి వరకు కూడా ఈ వాహనాలు అందుబాటులో ఉంచనున్నారు. విద్యుత్ డిమాండ్ ఒక్క సారిగా పెరుగుతూ వస్తున్న క్రమంలో తరుచూ ట్రాన్స్‌ఫార్మర్ పేలడం, లేదా లైన్ల నుండి వైర్లు తెగి పోవడం వరుసగా జరుగుతూ వస్తుండడంతో ఈ వాహనాలు విద్యుత్ శాఖకు అవసరం అవుతున్నాయి. విద్యుత్ అత్యవసర పరిస్థితి ఎదురైనపుడు గానీ, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధణ పనులు చేయించేందుకు గానీ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ తన పరిధిలో నలు దిక్కులా అత్యాధునిక పరికరాలతో కూడిన ప్రత్యేక ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం వాహనాలను అందుబాటులో ఉంచితే గనుక విద్యుత్ అంతరాయాలకు చెక్ చెప్పే అవకాశం ఉంటుంది. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోతలు లేకున్నప్పటికీ ఏదేని పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోతే వాటిని రిపేర్ చేసేందుకు గానీ, లేదా ఆ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో మరోటి అందుబాటులో ఉంచేందుకు గానీ గంటల తరబడి సమయం తీసుకునేది. హైదరాబాద్ ఖైరతాబాద్ పరిధిలోనే తరుచు ట్రాన్స్‌ఫార్మర్ల సమస్య వస్తుండడంతో అధికారులు అప్రమత్తం అవుతూ వస్తున్నారు. ఈ 101 ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం వెహికల్స్ గనుక వస్తే ఆ వాహనాల్లో షిఫ్ట్ విధానంలో ఒక అసిస్టెంట్ ఇంజినీర్, ముగ్గురు నైపుణ్యం కలిగిన సిబ్బంది, వాకి టాకీ, థెర్మో విజన్ కెమెరాలతో పాటు, అత్యాధునిక భద్రతా పరికరాలైన హెల్మెట్, ఎర్త్ రాడ్, గ్లౌజులు, సేఫ్టీ బెల్ట్, కండక్టర్, ఎల్ టి, హెట్ కేబుల్, స్పానర్ కిట్, 14 అడుగుల ఎత్తుగల ఎడ్జెస్టబుల్ నిచ్చెన, గొడ్డలి, రోప్, ఎల్‌టి హెచ్‌టి ఫ్యూజ్ వైర్, ఇన్సులేటర్ , ఉడ్ కట్టర్ వంటివి నిరంతరం కూడా ఈ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం వెహికల్స్‌లో అందుబాటులో ఉండనున్నారు. ముఖ్యంగా ఈ వాహనంలో నలుగురు సిబ్బంది సౌకర్యవంతంగా ప్రయాణించడంతో పాటు, 100 కిలో వాట్ సామర్థ్యం కలిగిన డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ ను సైతం తరలించడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. గత నెలలో ప్రవేశబెట్టిన వాహనాల పనితీరు వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో సంస్థ పరిధిలో ప్రస్తుతమున్న 10 వాహనాల స్థానంలో వాటికి అదనంగా మెట్రో జోన్ కు 50, రంగారెడ్డి జోన్‌కు 21, మేడ్చల్ జోన్ కు 19, రూరల్ జోన్‌కు 11 ఇలా మొత్తం 101 వాహనాలను కేటాయిస్తూ సంస్థ సిఎండి ముషారఫ్ ఫరూఖి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వాహనాలు వచ్చే నెల డిసెంబర్ ఒకటి నుండి క్షేత్ర స్థాయిలో మరింతగా అందుబాటులో ఉండనున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి.

## విజయఢంకా

(మొదటి పేజీ తరువాయి)

ఆయాపార్టీలకు వచ్చిన ఓట్ల శాతానికి అనుగుణంగా నిష్పత్తి ప్రాతిపదికపై ప్రజాప్రతినిధులను పార్టీలు ఎన్నుకుంటాయి. ఈ విధానాన్ని శ్రీలంకలో 1978లో ప్రవేశపెట్టారు. ఈ ఎన్నికల్లో ఎన్‌పిపి కూటమికి 60.80 లక్షల ఓట్లు లభించాయి. మొత్తంగా చూస్తే కౌంటింగ్‌లో 61 శాతం ఓట్లు లభించాయి. తమిళ మైనారిటీలు అధికంగా ఉండే జాఫ్నా ఎలక్టోరల్ జిల్లాలో మూడు స్థానాలు గెలుచుకుని ఎన్‌పిపి తన ఆధిక్యత ప్రదర్శించి చరిత్ర సృష్టించింది. తమ పార్టీ దేశంలో అన్నివర్గాల ప్రజల హృదయాలను గెలుచుకుని నిజమైన జాతీయపార్టీగా నిరూపించుకుంటుందని ఎన్నికల ప్రచారంలో దిస్సనాయకే చేసిన ప్రకటన ఈ ఎన్నికల ఫలితాలతో నిజమని రుజువైంది. అన్ని వర్గాల ప్రజలు దిస్సనాయకే నాయకత్వాన్ని అంగీకరించారు. తమిళ సాంస్కృతిక కేంద్రంగా ఉండే జాఫ్నాలో,జాఫ్నాజిల్లా ఇతర ప్రాంతాల్లో సాధారణంగా తమిళ జాతీయవాద పార్టీలే ఎప్పుడూ ఆధిక్యత ప్రదర్శిస్తాయి. కానీ ఈసారి తమిళులు వామపక్షనాయకత్వం పట్ల విధేయత ప్రకటించారు. ఈ విధంగా మొట్టమొదటిసారి ఒక సింహళ పార్టీ శ్రీలంక దక్షిణప్రాంత ఓటర్ల హృదయాలను చూరగొనడంలో విజయం సాధించింది. దీంతో దేశాధ్యక్షుడు దిస్సనాయకే ప్రతిపక్షాలపై తన బలాధిక్యతను నిరూపించుకున్నారు. గతంలో ఒకసారి యునైటెడ్ నేషనల్ పార్టీ జాఫ్నాజిల్లాలో ఒకేఒక్క సీటు గెలుచుకోగలిగింది. జాఫ్నా ఎలక్టోరల్ జిల్లాలో ఎన్‌పిపికి 80,000 ఓట్లు లభించాయి. ఇల్లంకై తమిళ అరసు కచ్చి పార్టీ (ఐటిఎకె)ని మట్టికరిపించింది. ఆ పార్టీకి కేవలం 63వేల ఓట్లు వచ్చాయి. ఐటిఎకె ఆల్ సిలోన్ తమిళ్ కాంగ్రెస్ (ఎసిటిసి), ఇండిపెండెంట్ గ్రూప్ 17లు ఒక్కొక్క స్థానం వంతున గెలుచుకున్నాయి.

కాగా అధ్యక్ష ఎన్నికల్లో దిస్సనాయకే చేతిలో పరాజయం పాలైన సాజిత్ ప్రేమదాస నాయకత్వానగల శ్రీలంక సమగి జన బలవేగయ పార్టీ 40 స్థానాలు గెలుచుకుని ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. ఇల్లంకై తమిళ అరసు కచ్చి పార్టీ 8 పార్లమెంటు స్థానాలు గెలుచుకుంది. న్యూ డెమోక్రటిక్‌పార్టీ ఐదు స్థానాల్లో గెలవగా, శ్రీలంక పోదు జన పెరమునపార్టీ మూడు స్థానాలు, శ్రీలంక ముస్లిం కాంగ్రెస్‌పార్టీ మూడు స్థానాలు గెలుచుకున్నాయి. శ్రీలంక పార్లమెంటుకు గురువారం జరిగిన ఎన్నికల్లో గడచిన 14 ఏళ్ళలో ఎన్నడూలేనంత అతి తక్కువగా పోలింగ్ నమోదైంది. ''ఈ ఎన్నికల ఫలితాలను మేం ముందుగానే ఊహించాం, దానివల్ల వచ్చే బాధ్యతలేమిటో కూడా మాకు తెలుసు, ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం, ప్రజలకోసం చేయగలిగినదంతా చేస్తాం'' అని జెవిపి నాయకుడు తిల్విన్ సిల్వా చెప్పారు.ఈ ఏడాది సెప్టెంబరులో దేశాధ్యక్షుడుగా గెలిచిన తర్వాత దిస్సనాయకే పార్లమెంటుకు ఆకస్మికంగా ఎన్నికలను ప్రకటించారు. కొత్త పార్లమెంటు వచ్చేవారంలో ఏదో ఒకరోజు సమావేశం కానున్నది. శ్రీలంక దేశం ఆర్థిక సంక్షోభం నుండి విముక్తిచెందే ప్రయత్నాల్లో పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. దేశంలో అధికార ఎన్‌పిపి కూటమికి జనతా విముక్తి పెరుమున (జెవిపి) పార్టీ నాయకత్వం వహిస్తున్నది. 2014 నుండీ జెవిపికి దిస్సనాయకే నాయకత్వం వహిస్తున్నారు. 1965 మే 14న 59 ఏళ్ళక్రితం చిన్న సంస్థగా ఆవిర్భవించిన జెవిపి ఈనాడు ప్రధాన స్రవంతిపార్టీగా దేశ రాజకీయాలను శాసిస్తున్నది. 1970లో కమ్యూనిస్టులు భాగస్వాములుగా ఉన్న యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు కూడా జెవిపి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసింది.

**భరత్ హైకమిషనర్ శుభకాంక్షలు**

ఘన విజయం సాధించిన అధ్యక్షుడు దిస్సనాయకేను కొలంబోలో ఉన్న భారత హైకమిషనర్ సంతోష్ ఝా కలిసి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. ''తోటి ప్రజాస్వామ్యదేశమైన భారతదేశం ఈ ఎన్నికలఫలితాల్లో ప్రజల తీర్పును స్వాగతిస్తున్నది, ప్రజల ప్రయోజనాలకోసం రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాలను తదుపరి మరింత బలోపేతం చేసుకునేందుకు భారత్ కట్టుబడి ఉంది'' అని సంతోష్ ఝా ఆయనకు తెలియజేశారు.

## ఘరానా మోసం

(మొదటి పేజీ తరువాయి)

నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొవిడ్ నేపథ్యంలో బహుళ పోషకాలు, రోగ నిరోధక శక్తి ఇచ్చే గాడిద పాలకు డిమాండ్ ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో అవి చూసి సంప్రదించామన్నారు. డాంకీ ప్యాలెస్ మిస్టర్ బాబు ఉలగనాథన్ ఆధ్వర్యంలో గిరి సుందర్, బాలాజీ, సోనిక్ రెడ్డి, డాక్టర్ రమేష్ బృందం సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్క రైతు వద్ద రూ.5 లక్షలు తీసుకున్నారన్నారు. ఒక్కో పాడి గాడిదను రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల చొప్పున విక్రయించారన్నారు. ఆ గాడిదల నుంచి ఉత్పత్తి చేసిన పాలు లీటరు రూ.1600 చొప్పున సేకరిస్తామని ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. 3 నెలల పాటు నమ్మకం కలిగించేలా నగదు చెల్లించారని తెలిపారు. గత 18 నెలలుగా డాంకీ ప్యాలెస్‌కు సరఫరా చేసిన పాల డబ్బుల, నిర్వహణ ఖర్చులు, షెడ్ నిర్మాణం, సిబ్బంది జీతాలు, వెటర్నరీ చికిత్స ఖర్చులు ఇవ్వడం లేదన్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఒక్కొక్కరికీ రూ.15 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు బ్యాంకు చెక్కులు రాసిచ్చారన్నారు. అవి బ్యాంకులో వేస్తే బౌన్స్ అయ్యాయని వాపోయారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు 400 మందికిపైగా రైతులు తమలాగా రూ.100 కోట్ల వరకు నష్టపోయారన్నారు. ఇదో పెద్ద కుంభకోణమన్నారు. దీని వెనుక రాజకీయ పెద్దల హస్తం ఉండొచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై చెన్నై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఒప్పందం సందర్భంగా ఇచ్చిన జిఎస్‌టి సంఖ్య, ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ కూడా నకిలీ వేనని తేలిందన్నారు.

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డిలు తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకున్నారు. లేని పక్షంలో తమకు ఆత్మహత్యలే శరణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన సాయిబాబు అనే బాధితుడు మాట్లాడుతూ డాంకీ ప్యాలెస్ గురించి చెబితే తాను రూ.56 లక్షలు పెట్టుబడి పెట్టానన్నారు. తమకు మూడు నెలల పాటు డబ్బులు ఇచ్చారని, కానీ ఆ తర్వాత నుంచి ఇవ్వలేదన్నారు.

# బంగ్లాదేశ్‌కు నేపాల్ విద్యుత్ ఎగుమతి



**ఖట్మండు :** నేపాల్ మొదటి సారి బంగ్లాదేశ్‌కు 40 మెగా వాట్ల విద్యుత్‌ను ఎగుమతి చేసింది. భారత్ విద్యుత్ సరఫరా వ్యవస్థను ఉపయోగించుకుని బంగ్లాదేశ్‌కు నేపాల్ ప్రభుత్వం విద్యుత్‌ను సరఫరా చేసింది. ఈ మేరకు జరిగిన త్రైపాక్షిక ఒప్పందం ద్వారా ఈ విద్యుత్ సరఫరా చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు భారత్ విద్యుత్ సరఫరా వ్యవస్థ ద్వారా నేపాల్ నుండి బంగ్లాదేశ్‌కు ఈ విద్యుత్ సరఫరా జరిగిందని నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (ఎన్‌ఇఎ) తెలియజేసింది. ఈ విద్యుత్ సరఫరా సంఘటన ఒక చరిత్రాత్మకమైన ఘట్టమని ఎన్‌ఇఎ అధికార ప్రతినిధి చందన్ ఘోష్ చెప్పారు. ఐతే కేవలం ఒకరోజు అవసరాల కోసం మాత్రమే ఈ సరఫరా జరిగిందని ఎన్‌ఇఎ తెలియజేసింది. ఐతే ఒప్పందం ప్రకారం 2025 జూన్ 15వ తేదీ వరకూ నేపాల్ నుండి బంగ్లాదేశ్‌కు ఈ విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఈ మేరకు భారత్, నేపాల్, బంగ్లాదేశ్ మధ్య ఈ ఏడాది అక్టోబరు మూడో తేదీన ఒక ఒప్పందంపై సంతకాలు జరిగాయి. దీనిప్రకారం నేపాల్ నుండి బంగ్లాదేశ్‌కు జూన్ 15 నుండి నవంబరు 15 వరకూ 40 మెగావాట్ల వంతున విద్యుత్‌ను సరఫరా చేశారు. ఎన్‌ఇఎ, ఎన్‌టిపిసి, విద్యుత్ వ్యాపర్ నిగమ్ లిమిటెడ్ ఆఫ్ ఇండియా, బంగ్లాదేశ్ పవర్ డవలప్‌మెంట్ బోర్డ్ మధ్య ఈ ఒప్పందం జరిగింది. ఐతే బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కారణంగానే ఇప్పటి వరకూ ఈ విద్యుత్ సరఫరాలో జాప్యం జరిగింది.

## ప్రజా పోరాటాల్లో ప్రొఫెసర్
# సాయిబాబా సజీవం

ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్న కేంద్ర ప్రభుత్వం
సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** సమాజంలో ప్రజాపోరాటాలు ఉన్నంతకాలం ప్రొఫెసర్ సాయిబాబా జీవించి ఉంటాడని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఆర్ కన్వర్షన్ హాలులో ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా సంస్మరణ సభ ప్రజాసంఘాల జెఎసి నాయకుడు ఆవునూరు సమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా తొంభైశాతం అంగవైకల్యాన్ని తట్టుకుని కేంద్ర ప్రభుత్వం నమోదు చేసిన కఠినమైన ఉపాచట్టం నుంచి బయటపడ్డాడని అన్నారు. దేశంలో కొనసాగుతున్న ప్రజా పోరాటాలను సాయిబాబా ప్రపంచ ప్రజాపోరాటాలతో అనుసంధానం చేసి రాజ్యానికి గుండెల్లో గునపం దించాడన్నారు. అందుకే సాయిబాబా ఎలాంటి నేరం చేయకుండానే పది సంవత్సరాల పాటు జైల్లో క్రూరమైన చిత్రహింసలకు గురైనాడన్నారు. ఉపాచట్టం కింద దేశంలో కొన్ని వేల మందిని కేంద్ర ప్రభుత్వం జైల్లో వేసి అణచివేస్తుందని మండిపడ్డారు. సాయిబాబా తన 58ఏళ్ల జీవితంలో 38 సంవత్సరాలు ప్రజాజీవితంలో, ప్రజాపోరాటాల్లో ఉన్నారన్నారు. కరోనా లాంటి మహమ్మారితో పాటు అనేక రకాల రోగాలతో పోరాడారని అన్నారు. ప్రశ్నించే గొంతుకలను కేంద్ర ప్రభుత్వం అణచివేసే విధానాలను అవలంభిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో వీక్షణ ఎడిటర్ వేణుగోపాల్, సాయిబాబా కుమార్తె మంజీరా, సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరు వాసుదేవరెడ్డి, పౌరహక్కుల సంఘం సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు, విప్లవ రచయితల సంఘం నాయకులు బాలసాని రాజయ్య, ముక్కెర రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోని మారుమూల ప్రాంతాల్లో..
# ఏముందో తెలుసుకునే వేదిక లైబ్రరీ

* నిరుద్యోగ యువత లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలి
* రాష్ట్రంలో 85 శాతం సర్వే పూర్తి
* రాష్ట్ర బిసి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** పుస్తకం ఈ సమాజంలో మనల్ని చైతన్యవంతం చేస్తాయనటానికి గ్రంథాలయాలే నిదర్శమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. పోటీ పరీక్షలో గ్రంథాలయాలు నిరుద్యోగుల విద్యార్థులకు ప్రిపేర్ కావటానికి వేదికగా ఉపయోగపడుతాయన్నారు. గ్రంథాలయాలు విజ్ఞానభాండాగారాలని..నేటి విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముఖ్య అతిథిగా రాష్ట్ర బిసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తక ప్రదర్శన హాల్‌ను గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఎలాంటి సౌకర్యాలు కలుగచేయాలన్నా, పిల్లలకు గ్రంథాలయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పుస్తకాలు చదువుకునే వారికి ఇబ్బందులు లేకుండ చూసుకోవాలన్నారు. గ్రూపు 3 పరీక్షల సమయంలో ఇక్కడ మైకుపెట్టి సమావేశాలు పెట్టాల్సింది కాదన్నారు. గ్రూపు 1లో 563 ఉద్యోగాలకు సంబంధించి చివరిదశకు వచ్చిందన్నారు. ప్రపంచంలో ఏ మారుమూల గ్రామంలో ఎక్కడ ఏముందో తెలుసుకునే వేదిక లైబ్రరీ అన్నారు. లైబ్రరీలకు తెలంగాణ ప్రభుత్వం రియాజ్ ఉద్యమకారునికి రాష్ట్ర స్థాయి చైర్మన్‌ను చేసిందన్నారు. సిద్దిపేట జిల్లా చైర్మన్‌గా అనుభవజ్ఞుడైన లింగమూర్తికి అవకాశం లభించిందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాలుపంచుకుంటున్నారని.. తెలంగాణ సమాజం భవిష్యత్ ప్రణాళికలను తయారు చేసేందుకు ఈ సర్వే దోహదం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో లక్షకు పైగా ఉండ్లకు 85వేల ఎన్యుమరేటర్స్ వస్తున్నారని వారికి వివరాలు అందించాలని సూచించారు. సమగ్ర వివరాలు అందిస్తే ఎక్కడ ఎలాంటి పథకం పోదని, కొత్త పథకాలు వస్తాయన్నారు. సర్వేను కొందరు పని గట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంఘాలు సర్వేను డిమాండ్ చేసి. ఇప్పుడు ఎక్కడ కనిపించటం లేదన్నారు. సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కెడెం లింగమూర్తి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా గ్రంథాలయంలో నెలకొన్న సమస్యలను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తెచ్చి, పరిష్కారానికి నిధుల మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, కాంగ్రెస్ ఇన్‌చార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తాడురి శ్రీనివాస్, గుండ్రేడి శ్రీనివాస్, అత్తు ఇమామ్, గయాసొద్దీన్, బొమ్మల యాదగిరి, గోపికృష్ణ, ఆర్‌డిఒ సదానందం, తహశీల్దార్ సలీం పాల్గొన్నారు.

## అల్లెగ్రో పరిశోధన కేంద్రం ఏర్పాటుతో
# 500 మందికి ఉద్యోగాలు



పరిశ్రమల శాఖ మంత్రి
శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఆటోమోటివ్ విద్యుత్తు వాహనాల తయారీలో ఉపయోగించే మ్యాగ్నెటిక్ సెన్సర్లు, చిప్‌ల తయారీలో దిగ్గజ సంస్థ అయిన అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లో పరిశోధన అభివృద్ధి (ఆర్ అండ్ డి) విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. శుక్రవారం అల్లెగ్రో కంపెనీ ప్రతినిధులతో ఎంఒయు పూర్తి అయిన అనంతరం సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ సంస్థ పరిశోధనా కేంద్రం ఏర్పాటు వల్ల 500 మంది ప్రతిభావంతులైన యువతకు ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. తెలంగాణాలో ఉన్న పారిశ్రామిక అనుకూల వాతావరణానికి సంతృప్తి చెందిన తర్వాత హైదరాబాద్‌ను ఎంచుకున్నట్టు అల్లెగ్రో యాజమాన్యం తెలపడం హర్షదాయకమని శ్రీధర్ బాబు అన్నారు. అభివృద్ధి, పరిశోధనా కేంద్రం ఏర్పాటులో ప్రభుత్వం అన్నివిధాల సహకరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. అల్లెగ్రో రాకతో రాష్ట్రంలో సెమీకండక్టర్ చిప్‌ల తయారీ పరిశ్రమకు ఊతం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.
విద్యుత్తు వాహనాల సిగ్నల్ డిజైన్, వెరిఫికేషన్, వ్యాలిడేషన్‌తో పాటు రోబోటిక్ ఆటోమేషన్‌లో కూడా అల్లెగ్రో చిప్‌లను రూపొందిస్తుందని వెల్లడించారు. బిఎండబ్ల్యు విద్యుత్తు కార్ల తయారీ సంస్థతో పాటు ఇవి ఆయా రంగంలోని బ్యాటరీల నిర్వహణ, పవర్ చిప్‌ల తయారీలో ఈ సంస్థ అగ్రగామిగా ఉందని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ సిఇఒ వినీత్ నర్గావాలా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సుమన్ నారాయణ్, మరో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మ్యాక్స్ గ్లోవర్‌లు పాల్గొన్నారు.

# టూరిజం ప్రమోషన్ కోసం త్వరలోనే నూతన కమిటీ

తెలంగాణకు వచ్చే దేశ విదేశీయులను పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం లక్ష్యం
ట్రవెర్నియా ఫెస్ట్‌లో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రానికి వచ్చే దేశ విదేశీయులు.. పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ కట్టడాలు, చారిత్రక ప్రాంతాలను సందర్శించే విధంగా టూరిజం ప్రమోషన్ కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టబోతుందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. దీనికి సంబంధించి కార్యాచరణ రూపొందిస్తున్నామని, త్వరలోనే ఒకమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహించిన ట్రవెర్నియా ఫెస్ట్‌కు ముఖ్యతిథిగా మంత్రి జూపల్లి హాజరయ్యారు. జ్యోతిప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పర్యాటక, వారసత్వ, చారిత్రక ప్రాంతాలు, ఆయా ప్రాంతాల ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లు, సంస్కృతి, సాంప్రదాయలను గురించి సమగ్ర సమాచారాన్ని పర్యాటక ప్రేమికులకు తెలియజేయడం లక్ష్యంగా ట్రవేర్నియా ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. సిఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ పర్యాటక రంగానికి పెద్దపీట వేసిందన్నారు. పర్యాటకులతోపాటు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలు, అధికారిక కార్యక్రమాలు, ఆయా పనుల నిమిత్తం తెలంగాణకు వచ్చే వారిని పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు అనేక పథకాలు చేపడుతున్నామని చెప్పారు. వచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. తెలంగాణ టూరిజం ప్రమోషన్ కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలను సందర్శించి, టూరిజం ప్రమోషన్‌కు అంబాసిడర్లుగా నిలవాలని కోరుతున్నామని తెలిపారు.

## సియోల్‌లోని హాన్ నది, హైదరాబాద్‌లోని
# మూసీ నది పరిస్థితి ఒక్కటే



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సియోల్‌లోని హాన్ నది, హైదరాబాద్‌లోని మూసీ నది పరిస్థితులు ఒకే విధంగా ఉన్నాయని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిన మూసీ పునరుజ్జీవనం, సుందరీకరణ పూర్తయితే మన మూసీ నది కూడా పరిశుభ్రంగా మారడంతో పాటుగా హైదరాబాద్ నగరానికి పర్యాటక ప్రదేశంగా మారుతుందని తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. దక్షిణ కొరియా దేశ పర్యటనలో భాగంగా శుక్రవారం సియోల్ నగరంలోని హన్, చియాంగీచాన్ నదులను తెలంగాణ శాసన బృందం సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్, లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు ఈ బృందంలో ఉన్నారు. సియోల్ నగరం మధ్య నుండి ప్రవహించే హన్ నది గతంలో మురికిగా కాలుష్యంతో ఉండేదని, ఇరవై ఏళ్ల కింద ప్రభుత్వం నదిని శుద్ధి చేసి పరిసరాలను సుందరంగా తీర్చిదిద్ది, మౌలిక వసతులు కల్పించడంతో పర్యాటక ప్రదేశంగా మారిందని స్థానిక అధికారులు శాసన బృందానికి వివరించారు. అదేవిధంగా చియాంగీచాన్ నదీ వెంట మౌలిక వసతులు ఏర్పాటు చేయడంతో పర్యాటకం బాగా అభివృద్ధి చెందిందని స్థానిక ప్రజలు, వ్యాపారులు తెలంగాణ శాసనబృందానికి తెలిపారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగిన 67వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తెలంగాణ శాసన బృందం అనంతరం కామన్‌వెల్త్ దేశాలలో స్టడీ టూర్‌లలో భాగంగా న్యూజిలాండ్, జపాన్ దేశాలలో పర్యటించి దక్షిణ కొరియా చేరుకున్నది.



# హామీలను అమలు చేయకుండా మహారాష్ట్రలో అబద్ధపు ప్రచారాలు

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు, హామీలను అమలు చేయకుండా మహారాష్ట్రలో అబద్ధపు ప్రచారాలు చేస్తున్నదని కేంద్ర మంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణలో 6 గ్యారంటీలు అమలు చేశామని, రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందంటూ, అద్భుతంగా పాలన అందిస్తుందని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నారని అబద్ధపు ప్రచారాలు చేసుకుంటున్నదని, పత్రికల్లో అడ్వర్టైజ్‌మెంట్లు ఇస్తున్నదని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు ఏం ఒరిగిందో తెలంగాణ సమాజం అర్థం చేసుకుంటున్నదన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వాలను స్వర్గసీమ అంటూ రాహుల్ గాంధీ పొగుడుతుంటే రేవంత్‌రెడ్డి జబ్బలు చరుచుకుంటున్నారని, కానీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణలో శాంతిభద్రతల పర్యవేక్షణలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

**సిఎం సవాల్‌ను స్వీకరిస్తున్నాం... 16న మూసీ నిద్రకు రెడీ**

మూసీ ప్రక్షాళన చేయండి, పేదల ఇళ్ళు కూల్చాకండి అనేదే బిజెపి నినాదమని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. మూసీ పరిసర ప్రాంతంలో ఒక్కరోజు నిద్రపోండి అని సిఎం చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని, ఈ నెల 16వ తేదీన మూసీ నిద్ర చేయనున్నామని, మూడు నెలల పాటు నిద్ర చేయడానికి కూడా తాము సిద్ధమేనన్నారు. ప్రజలతోనే వారి ఇళ్ళల్లో వారి ఇంట్లోనే భోజనం చేసి పేదల ఇళ్లల్లోనే నిద్ర చేస్తామన్నారు. మూసీని కొబ్బరినీళ్లలా మారుస్తామన్న కేసీఆర్.. ఏమీ చేయకుండానే వెళ్లిపోయారు. ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన పేరుతో పేదల ఇండ్లు కూల్చడం, నల్లగొండలో రైతులను రెచ్చగొట్టారు తప్పితే చేసిందేమీలేదన్నారు. పేద ప్రజల ఇండ్లు కూల్చొద్దంటే బుల్డోజర్లతో తొక్కిస్తామంటూ సిఎం అహంకారంతో మాట్లాడుతున్నాడని అన్నారు.

# దౌర్భాగ్య పరిస్థితుల్లో ప్రతిపక్షం

టూరిజం కార్పొరేషన్ చైర్మన్
పటేల్ రమేష్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల పరిణామాలు చూసిన ప్రజలు.. ప్రతిపక్షం ఇంకా ఇంత దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉంది అనుకుంటున్నారని టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని, రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని అస్తిరపరచాలని బిఆర్‌ఎస్ నేతలు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వంకు మాత్రమే దక్కుతుందన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలని ప్రభుత్వం కులగణన చేపడుతుందని స్పష్టం చేశారు. పారిశ్రామికంగా అభివృద్ధి.. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని సిఎం ఆలోచిస్తున్నారన్నారు. అయితే కెటిఆర్, పట్నం నరేందర్ రెడ్డిలు మాత్రం రైతులను రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్నారన్నారు. అధికారులను చంపే ప్రయత్నం చేయించారని అన్నారు. మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం సరైన నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఇటువంటి దాడులు చేస్తే.. ప్రాజెక్టులు కట్టేవారా..? అని ప్రశ్నించారు. రైతులకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం బేడీలు వేసింది వాస్తవం కాదా..? అని అన్నారు. అధికారం పోయాక.. కెటిఆర్‌కి మతి భ్రమించిందని అన్నారు. కెటిఆర్‌కి ఇంకా అధికార దాహం.. పిచ్చి పోలేదన్నారు. కెటిఆర్, పట్నం నరేందర్ రెడ్డికి డైరెక్షన్ ఇవ్వడంతోనే కలెక్టర్‌పై దాడులు జరిగాయన్నారు. దాడికి పాల్పడిన సురేష్‌కి అసలు భూమి లేనే లేదని స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ ఇచ్చిన ఒక్కహామీని కూడా నేరవేర్చలేదని అన్నారు.

**పదేళ్లలో తాము ఇలాంటి దాడులు చేయలేదు : మల్‌రెడ్డి రాంరెడ్డి**

పదేళ్లలో తాము ప్రతిపక్షంలో ఉన్నా ఇలాంటి దాడులు చేయలేదని రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం చేశామని గుర్తుచేశారు. రాష్ట్రాన్ని ఏడున్నర లక్షల కోట్ల అప్పులపాలు చేశారని తెలిపారు. అప్పులు చేసి.. బిఆర్‌ఎస్ నేతలు దోచుకు తిన్నారని విమర్శించారు. ప్రభుత్వ భూములు అమ్ముకున్నారని, రాబోయే రోజుల్లో ప్రజలే కెటిఆర్, హరీష్ రావులకు బుద్ధి చెబుతారన్నారు.

**కిరాయి గుండాలతో దాడి : జె. జైపాల్**

కలెక్టర్‌పై జరిగిన దాడిలో బిఆర్‌ఎస్ నేతలు కిరాయి గుండాలతో దాడి చేయించారని ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ జైపాల్ ఆరోపించారు. నిరుద్యోగం పోవాలంటే ఇండస్ట్రీస్ రావాల్సిన అవసరం ఉందన్నారు. భూములు ఇవ్వకపోతే ఇండస్ట్రీస్ ఎలా వస్తాయని ఆయన ప్రశ్నించారు. ధరణి భూములు ఎలా కొల్లగొట్టారో తెలుసు అని అన్నారు. ఎప్పుడు అధికార పీఠంలో కూర్చోవాలని కేటీఆర్ ఆశ పడుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లు కూడా రేవంత్ రెడ్డి సిఎంగా ఉంటారని అందులో ఎలాంటి సందేహం లేదన్నారు.

## ఎక్సైజ్ డైరెక్టర్‌గా హరికిరణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్‌గా ఐఎఎస్ అధికారి చెవ్వూరు హరికిరణ్ శుక్రవారం ఆబ్కారీ భవన్‌లోని తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు చెవ్వూరు హరికిరణ్‌కు ప్రొటోకాల్లో భాగంగా ఎఇఎస్ శ్రీనివాస్‌రావు పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం హరికిరణ్ తొలి సంతకం చేశారు. 2009 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన హరికిరణ్ ఆంధ్రప్రదేశ్ నెంబరు వన్ రాంకర్ గాను, అల్ ఇండియాలో 18వ రాంకర్‌గా గుర్తింపు పొందారు. ఐఎఎస్ అధికారిగా తొలుత కడప (వైఎస్సార్), తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్‌గా, ఆ తరువాత వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్‌గా పనిచేశారు. ఇటీవలే ఎపి నుంచి తెలంగాణకు వచ్చిన హరికిరణ్‌కు ఎక్సైజ్ డైరెక్టర్‌గా ఇటీవల ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి అనంతరం డైరెక్టర్ చెవ్వూరి హరికిరణ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును సెక్రటేరియట్ మంత్రి చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు.

## పవర్ ఇంజనీర్స్ ఎన్నికల్లో రత్నాకర్‌రావు, సదానందం గెలుపు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఈనెల 13న జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎలక్షన్లలో ప్రెసిడెంట్ గా పి.రత్నాకర్ రావు , సెక్రటరీ జనరల్ గా పి.సదానందం ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఇంజనీర్లు అందరికీ నూతనంగా ఎన్నికైన రత్నాకర్‌రావు, సదానందంలో ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వానికి ఇంజనీర్లకు మధ్య సమన్వయంతో పనిచేసి విద్యుత్ ఇంజనీర్ల సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. మరోసారి అవకాశం ఇచ్చి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జెఎల్ జనప్రియ, అడిషనల్ సెక్రటరీగా ఎం.వెంకటేశ్వర్లు ఎన్నుకోబడ్డారు. రాష్ట్ర బాడీ కంపెనీ బాడీలో ఎన్నికైనందుకు గాను ఎన్నికైన ఇంజనీర్లందరూ ధన్యవాదాలు తెలియజేశారు.

## రాష్ట్రంలో 11 నెలలుగా ఆటవిక పాలన

ఎంఎల్‌ఎ వివేకానంద



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో 11 నెలలుగా ఆటవిక పాలన కొనసాగుతోందని బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ కె.పి.వివేకానంద ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలనూ మోసం చేసి అధికారంలోనికి వచ్చిందన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి వివేకానంద మాట్లాడుతూ కెటిఆర్, హరీష్‌రావుపై బురదచల్లుతున్నారని, కెసిఆర్ నాయకత్వాన్ని బలహీనపర్చాలనే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కలిసి బిఆర్‌ఎస్ పార్టీని లేకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గంలో ఘటన జరిగితే బండి సంజయ్ ఎందుకు నోరువిప్పడంలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి, బండి సంజయ్ అగ్ని గుండంలా మారుస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో ప్రభుత్వం డ్రామాలు చేస్తుందని వివేకానంద ఆరోపించారు.

# హైదరాబాద్‌లో మరో మెగా టోర్నమెంట్



ఫిఫా ఫ్రెండ్లీ ఫుట్ బాల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వబోతున్న తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ
గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా ఏర్పాట్లు
సిఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతో మరిన్ని క్రీడాభివృద్ధి కార్యక్రమాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మరో మెగా టోర్నమెంట్‌కు హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వబోతుంది. ఇందుకు గచ్చిబౌలి స్టేడియం వేదిక కానుంది. నవంబర్ 18న గచ్చిబౌలిలోని జిఎంసిబి స్టేడియంలో ఇండియా మలేషియా జట్ల మధ్య ఫీఫా ఫ్రెండ్లీ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ నిర్వహణకు కావలసిన అన్ని ఏర్పాట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ముమ్మరంగా పూర్తి చేస్తోంది. అక్టోబర్ 3, 6,9 వ తేదీల్లో ఇండియా సిరియా మారిషస్ జట్ల మధ్య ఫిఫా ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ మ్యాచ్‌కు అతిథ్యం ఇచ్చిన తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఇండియా మలేషియా జట్ల మధ్య ఈ ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వబోతుంది. ఈ తరహా ఫిఫా ఫ్రెండ్లీ కప్ హైదరాబాద్ నగరంలో జరగడం ఇది మొదటిసారి కావడం విశేషం. ఎంతో ఘనమైన చరిత్ర కలిగి, ఫుట్‌బాల్ ఒలంపియన్ల కేంద్రంగా పేరుగాంచి భారతీయ ఫుట్‌బాల్ క్రీడకు కేంద్రంగా వెలుగొందిన హైదరాబాద్ నగరంలో ఫుట్‌బాల్ క్రీడ తన చారిత్రక వైభవాన్ని కోల్పోతుంది. దశాబ్దాలుగా విస్మరించబడి, దిన దినం క్షీణించిపోతున్న ఈ క్రీడకు పునర్ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని రేవంత్ రెడ్డి అనేకసార్లు ప్రకటించారు. స్వయంగా ఫుట్ బాల్ క్రీడాకారుడైన రేవంత్ రెడ్డి పలు సందర్భాల్లో వివిధ ఫుట్ బాల్ క్రీడల్లో పాల్గొని నగర క్రీడాకారులను ఉత్తేజ పరిచిన సంగతి విధితమే. అంతేకాకుండా ఇటీవల సిఎం కప్ 2024 టార్చ్ రిలే సందర్భంగా జూనియర్ ఫుట్ బాల్ టీమ్‌ను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా అక్టోబర్ 3, 6,9 వ తేదీల్లో ఫిఫా ఇంటర్ కాంటినెంటల్ ఫుట్ బాల్ కప్పుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆతిథ్యం ఇచ్చి ఘనంగా నిర్వహించి హైదరాబాద్ నగర క్రీడాభిమానుల అభిమానం చూరగొంది. ఆ మ్యాచ్ ను నిర్వహించడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవ ఫిఫా, ఆల్ ఇండియా ఫుట్ బాల్ ఫెడరేషన్ ప్రతినిధుల ప్రశంసలు అందుకుంది.

## 47వ ఆల్ ఇండియా రైల్వే బాస్కెట్‌బాల్
# ఛాంపియన్‌షిప్ క్రీడలు ప్రారంభం





**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మహిళల కోసం ఉద్దేశించిన 47వ ఆల్ ఇండియా రైల్వే బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ క్రీడలు శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ గ్రౌండ్స్‌లో ద.మ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.పద్మజ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.మధుసదనరావు, ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, ఇతర సీనియర్ అధికారులు క్రీడా సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ క్రీడలు 15 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్నాయి. ఇందులో 12 జట్లు పాల్గొననున్నారు. ఈ ఛాంపియన్‌షిప్ లీగ్‌కమ్‌నాకౌట్ ప్రాతిపదికన నిర్వహించనున్నారు. దక్షిణ మధ్య రైల్వే, సెంట్రల్ రైల్వే, పశ్చిమ రైల్వే, ఉత్తర రైల్వే, తూర్పు రైల్వే, తూర్పు మధ్య రైల్వే, ఈశాన్య రైల్వే, నార్త్ ఫ్రాంటియర్ రైల్వే, దక్షిణ రైల్వే, సౌత్ వెస్ట్రన్ రైల్వే, సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే ప్రాతినిధ్యం వహిస్తున్న ఛాంపియన్‌షిప్‌లో 12 భారతీయ రైల్వే జట్లు పాల్గొంటున్నాయి. తొలి రోజు ప్రారంభ మ్యాచ్‌లలో పశ్చిమ రైల్వే జట్టు నార్త్ వెస్ట్రన్ రైల్వేపై, తూర్పు రైల్వే దక్షిణ రైల్వేపై, సెంట్రల్ రైల్వే సౌత్ వెస్ట్రన్ రైల్వేపై, దక్షిణ మధ్య రైల్వే నార్త్ ఈస్టర్న్ రైల్వేపై గెలుపొందాయి. కాగా తెలంగాణ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ జట్టు సభ్యులు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద.మ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.పద్మజ మాట్లాడుతూ రైల్వే శాఖ కల్పిస్తున్న క్రీడలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో గొప్పగా ఎదగాలన్నారు. చిత్తశుద్ధి, కృషితో ఆటలో కొత్త శిఖరాలను చేరుకోవాలని కోరారు.

# ఫోకస్ సైన్స్

## వేగంగా అంతరిస్తున్న జీవజాతులు


పలు జీవజాతులు అత్యంత వేగంగా అంతరిస్తున్నాయి. కొన్ని వేల సంవత్సరాల్లో జరగనంత క్షీణత, ఇటీవలి కొన్ని శతాబ్దాల్లోనే చోటు చేసుకోవడం ఆందోళన కలిగించే అంశం. వరల్డ్ వైడ్ పండ్ ఫర్ నేచర్ (డబ్ల్యుడబ్ల్యుఎఫ్) విడుదల చేసిన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ 2024 ప్రకారం, 1970–2020 మధ్యకాలంలో, అంటే కేవలం 50 సంవత్సరాల్లో వణ్యప్రాణుల జనాభా సుమారు 73 శాతం క్షీణించింది. మంచినీటి పర్యావరణ వ్యవస్థల్లో ఇది 85, భూ సంబంధమైన వ్యవస్థల్లో 69 శాతంగా ఉంది. స్విట్జర్లాండ్‌లోని గ్లాండ్ నగరంలో కేంద్ర కార్యాలయం ఉన్న డబ్ల్యుడబ్ల్యుఎఫ్‌ను 1961లో నెలకొల్పారు. ప్రకృతిని పరిరక్షించడం, భూమిపై జీవ వైవిధ్యాన్ని కాపాడడం ఈ సంస్థ లక్ష్యం. వన్యప్రాణులు నివసించే ప్రదేశాలను రక్షించే వినూత్న పరిష్కాలను అభివృద్ధి చేయడం కూడా ఈ సంస్థ విధుల్లో ఒకటి. ఇంతటి గురుతర బాధ్యతను నిర్వసిస్తున్న డబ్ల్యుడబ్ల్యుఎఫ్ నివేదిక వణ్యప్రాణుల క్షీణతపై సంచలన వాస్తవాలను వెల్లడిస్తున్నది. మనిషి మితిమీరన స్వార్థం కారణంగా వణ్యప్రాణులకు



నిలువనీడ లేకుండా పోతున్నదని, ఫలితంగా వాటి సంఖ్య గణనీయంగా తగ్గుతున్నదని ఈ నివేదిక చేదు నిజాలను బయటపెట్టింది. ప్రపంచ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ, లాటిన్ అమెరికా, కరేబియన్ ప్రాంతాల్లో చాలా ఎక్కువగా ఉంది. ఈ రెండు ప్రాంతాల్లో వణ్య ప్రాణుల సంఖ్య ఏకంగా 95 శాతం తగ్గింది. ఆఫ్రికాలో 76 శాతం, ఆసియాపసిఫిక్ రీజియన్‌లో 60 శాతం చొప్పున అడవి జంతువుల జనాభా క్షీణించింది. ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియాలోని అడవులలో 212 శాతం కర్బన నిల్వ అనేక రకాలుగా నష్టాలకు దారితీస్తుందని డబ్ల్యుడబ్ల్యుఎఫ్ చేసిన హెచ్చరికను తేలిగ్గా తీసుకోకూడదు. ప్రస్తుత పరిస్థితి కొనసాగుతూ, పర్యావరణ సమస్యలు ఇదే విధంగా పెరుగుతూ ఉంటే, 2030 తర్వాత, నివారణ చర్యలు చేపట్టడానికి కూడా వీలులేనంత దారుణ పరిస్థితులు ఏర్పడతాయని డబ్ల్యుడబ్ల్యుఎఫ్ స్పష్టం చేసింది. స్థూల ఉత్పత్తులు సగానికిసగం పడిపోతాయని అంచనా వేసింది. ఆఫ్రికాలో దంతాలు, చర్మాల కోసం వణ్యప్రాణులను హతమారుస్తుంటే,


ఇతర ప్రాంతాల్లో మైనింగ్ కోసం అడవులను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. గత్యంతరం లేక జనావాసాల్లోకి వస్తున్న వణ్య ప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయి. వణ్య ప్రాణుల రక్షిత ప్రాంతాలను విస్తరించడం, క్షీణిస్తున్న పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం లేదా మెరుగుపరచడం, జీవ వైవిధ్యాన్ని కాపాడే ప్రణాళిలను రూపొందించడం అమలు చేయడం వంటి చర్యలతో పరిస్థితిని కొంత వరకూ మెరుగుపరచవచ్చు. జీవ వైవిధ్యానికి ముప్పు వాటిల్లితే, ముందుగా నష్టపోయేది మనిషే. ఈ వాస్తవాన్ని మనం ఎంత తొందరగా గ్రహిస్తే అంత మంచిది.

## విశ్వం ప్రారంభంలోనే 'ఎరుపు రాక్షసులు'!



బిగ్ బ్యాంగ్ తర్వాత విశ్వం ఏర్పడిందన్న సిద్ధాంతాన్ని ఇప్పుడు దాదాపుగా అందరు శాస్త్రవేత్తలు అంగీకరిస్తున్నారు. బిగ్ బ్యాంగ్ అనంతరం విశ్వం ప్రారంభమైన కాలంలోనే ఏర్పడిన మూడు అతిపెద్ద గెలాక్సీలను శాస్త్రవేత్తలు ఇటీవల కనుగొన్నారు. 'ఎరుపు రాక్షసులు (red monsters) అని పిలిచే ఈ మూడు గెలాక్సీల అన్వేషణ జేమ్స్ స్పేస్ టెలిస్కోప్ ద్వారా కొనసాగిస్తున్న ఫ్రెస్కో ప్రోగ్రామ్ ద్వారా సాధ్యమైంది. గెలాక్సీల ఖచ్చితమైన దూరాలను, నక్షత్ర ద్రవ్యరాశిని కొలవడానికి ఎన్ఐఆర్‌కామ్‌ను, గ్రిజం స్పెక్ట్రోగ్రాఫ్‌ను ఈ టెలిస్కోప్ వినియోగిస్తుంది. ఇప్పటికే ఉన్న గెలాక్సీ నిర్మాణ నమూనాలను సవాలు చేస్తూ, ప్రారంభ విశ్వంలో నక్షత్రాల నిర్మాణం గతంలో అనుకున్నదానికంటే చాలా సమర్థవంతంగా ఉందని ఫలితాలు సూచిస్తున్నాయి. జెనీవా విశ్వవిద్యాలయం (యుఎన్ఐజిఇ) నేతృత్వంలోని అంతర్జాతీయ బృందం ఈ మూడు అతిభారీ గెలాక్సీలను గుర్తించింది దాదాపుగా పాలపుంత మాదిరి భారీ పరిమాణం గల ఈ గెలాక్సీలు బిగ్ బ్యాంగ్ తర్వాత మొదటి బిలియన్ సంవత్సరాలలో ఏర్పడినట్టు అభిప్రాయపడుతున్నారు. అయితే, బిగ్ బ్యాంగ్ సమయానికే ఇవి ఉండవచ్చన్న వాదనలు లేకపోలేదు. 'నేచర్' మ్యాగజైన్‌లో ప్రచురించిన నివేదికను అనుసరించి, శాస్త్రవేత్తలు పేర్కొనే సైద్ధాంతిక నమూనాలో, గెలాక్సీలు, కృష్ణ పదార్థం (డార్క్ మ్యాటర్) ఏర్పడడానికి కొన్ని బిలియన్ సంవత్సరాలు పడుతుంది. అణువులతో కూడిన హాలోస్ వాయువును గురుత్వాకర్షణ బంధిత నిర్మాణంలోకి డార్క్ మేటర్ ఆకర్షిస్తుంది.ఈ వాయువుల్లో గరిష్టంగా 20 శాతం మాత్రమే గెలాక్సీలలో నక్షత్రాలుగా మారతాయి. అయితే, అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం 'నాసా' ప్రయోగించిన జేమ్స్ వెబ్ టెలిస్కోప్ (జెడబ్ల్యుఎస్‌టి)తో యుఎన్ఐజిఇ నేతృత్వంలో అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం చేసిన కొత్త పరిశోధనలు ఈ అభిప్రాయాన్ని సవాలు చేస్తున్నాయి. ప్రారంభ విశ్వంలోని భారీ గెలాక్సీలు, ఆ తర్వాత ఏర్పడిన వాటి కంటే చాలా సమర్థంగా పని చేస్తాయని, గతంలో అనుకున్నదానికంటే వేగం పెరుగుతుందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తున్నది. ఈ మూడు గెలాక్సీలోని నక్షత్రాల ద్రవ్యరాశి నేటి పాలపుంత మాదిరిగానే ఉందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇవి తక్కువ ద్రవ్యరాశి ప్రతిరూపాలు. ఇతర గెలాక్సీల కంటే దాదాపు రెండు రెట్లు సమర్థవంతంగా నక్షత్రాలకు ఆవిర్భావానికి దోహదపడతాయి. కాస్మిక్ చరిత్రకు సంబంధించి మొదటి బిలియన్ సంవత్సరాలలో ఉద్గారరేఖ గెలాక్సీల పూర్తి నమూనాను క్రమపద్ధతిలో విశ్లేషించడానికి అంతర్జాతీయ బృందం ఈ కొత్త ప్రోగ్రామ్‌ను అభివృద్ధి చేసింది.

## మానవ కణాలు మాట్లాడుకుంటాయి!



మనిషి శరీరం కోట్లాది కణాలతో నిర్మితమై ఉంటుందనేది తెలిసిన విషయమే. వీటి సంఖ్య 30 లక్షల కోట్ల నుంచి 37 లక్షణ కోట్ల వరకూ ఉంటాయని అంచ నా. ఇతర జీవులు, వృక్షాల్లోనూ జీవ కణాలు ఉంటాయి. ఈ కణాలు ఒకదానితో ఒకటి సంభావించుకుంటాయని ఎప్పుడైనా ఊహించారా? అత్యంత కీలకమైన డాటాను బదిలీ చేసుకుంటాయని అనుకున్నారా? 'ఎర్త్ డాట్ కామ్'లో ప్రచురితమైన గోతెన్‌బర్గ్ విశ్వవిద్యాలంలో హడి వాలాడి నేతృత్వంలో పరిశోధకుల బృందం పరిశోధనా వ్యాసాన్ని అనుసరించి, ఆర్ఎన్ఏగా పిలిచే రిబొన్యూక్లియాక్ యాసిడ్ సాయంతో సంభావించుకుంటాయి. సమాచారాన్ని కూడా ఇచ్చిపుచ్చుకుంటాయి. సెల్యులార్ కమ్యూనిటీలో అత్యంత విశ్వసనీయమైన ఎక్స్‌ట్రాసెల్యులర్ వెసికిల్స్‌లోని ఆర్ఎన్ఏ ఎల్లప్పుడూ సమాచారాన్ని అందించడానికి సిద్ధంగా ఉం టుంది. ఆర్కియా, బాక్టీరియా, యూకారియోటిక్ కణాలతోపాటు మొక్క లు వంటి ఇతర జీవ జాలంలో ఉండే ఆర్ఎన్ఏ కణాల మధ్య సమాచార పంపిణీకి ఉపయోగపడుతుంది. జీవులు ఆర్ఎన్ఏను శక్తివంతమైన ఆయుధంగా మార్చుకొని, కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టపరచుకుంటా యి. నిరంతరం ఎన్నో మార్పులకు లోనవుతున్న ప్రపంచంలో జీవం ఎలా కొనసాగుతున్నదనే ప్రశ్నకు కూడా శాస్త్రవేత్తల బృందం సమాధానమిచ్చింది. పర్యావరణ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే విధంగా, ఆర్ఎన్ఏ తన వైఖరిని మార్చుకుంటుందని, అంతేగాక, కణాలను సంసిద్ధం చేస్తుందని వివరించింది. ఈ పరిశోధన సరికొత్త అధ్యయనాలకు, సిద్ధాంతాలకు శ్రీకారం చుట్టింది. ఆర్ఎన్ఏను ఉపయోగించుకొని, కణాలకు సం దేశాలతోపాటు ఆదేశాలను కూడా పంపగలిగితే, వైద్య పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయని అంటున్నారు.

## ఎడారులు, నదుల వలస?

మనుషులే కాదు... ఎడారులు, నదులు కూడా వలస వెళతున్నాయి. ఆశ్చర్యాన్ని కలిగించినప్పటికీ, ఇది నిజమేనని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. వివిధ అధ్యయనాలను అనుసరించి, ఎడారులు, నదులు క్రమంగా ధ్రువాలపైపు దిశను మార్చుకుంటున్నాయి. వాతావరణ అస్థిరతే ఈ పరిస్థితికి కారణం. 'పోలార్డ్ షిఫ్ట్'గా పేర్కొనే ఈ మార్పు భూగోళంపై తీవ్ర ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మండలాలు, జాతుల పంపిణీ, తుపాను మార్గాలు లేదా వాతావరణ నదులు ధ్రువ ప్రాంతాల వైపు కదలడాన్ని పోలార్ షిఫ్ట్ అంటారు. భూమి మొక్క శీతోష్ణ స్థితి మండలాలను వాతావరణ మండలాలుగా పేర్కొంటారు. ఇవి ధ్రువాల వైపు మారితే, ఎడారులు కూడా అటువైపే కదులుతాయి. తుపాన్లు వతావరణం మధ్య అక్షాంశాలపైపు కదులుతాయి. ఫలితంగా వివిధ జాతులు తమ పరిధులను మార్చుకుంటాయి. దీనితో జీవ వైవిధ్యం దెబ్బతింటుంది. ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. మానవులు వివిధ రోగాలబారిన పడతారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా తుపాను ట్రాక్‌లు కూడా ధ్రువాల దిశగా మళ్లుతున్నాయి. గత నాలుగు దశాబ్దాల కాలంలో నదులు 6 నుంచి 10 డిగ్రీల వరకూ ధ్రువాలవైపు మళ్లాయి. అదే విధంగా వాతావరణం కూడా పంథాను మార్చుకుంటున్నందున, ఎడారుల దిశ కూడా మారుతుంది. పర్యావరణ పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తు దారుణంగా ఉంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.




## తక్షణమే 'బెస్ట్ అవైలబుల్ స్కీం' బకాయిలు విడుదల చేయాలి

### ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్ డిమాండ్



**ప్రజాపక్షం/కెయూ క్యాంపస్ :** రాష్ట్రంలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రెండేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో వారు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని, వెంటనే బకాయిలను విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్ శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భగా స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పోరేట్, ప్రైవేటు పాఠశాలలో సోషల్ వెల్ఫేర్, గిరిజన సంక్షేమ శాఖల సహకారంతో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 9వేల మంది ఎస్‌సి పిల్లలు, 6 వేలమంది ఎస్‌టి పిల్లలు చదువుకుంటున్నారని, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఉన్నత విద్యలో రాణించాలని దృక్పథంతో కార్పోరేట్ విద్యను అందించాలని తీసుకొచ్చిన ఈ స్కీం ద్వారా వేలాదిమంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. ప్రతి ఏటా ఫీజులు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా చెల్లించకుండా దళిత, గిరిజన విద్యార్థుల పట్ల తీవ్రవివక్ష పాటిస్తున్నదని ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోగా ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించకపోవడం బాధ్యతారహిత్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పిల్లలకు వసతి, భోజనాలు పెట్టలేకపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రభుత్వం నుండి బకాయిలను చెల్లించే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

## సెలవు రోజున పాఠశాల నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు

### ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ప్రీతం డిమాండ్




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వ సెలవు రోజున పాఠశాలను నిర్వహిస్తున్న ఆర్ఎఫ్‌సిఎల్ శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం విద్యాధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ సెలవు ఉన్నప్పటికీని శ్రీ చైతన్య పాఠశాల నిబంధనలకు విరుద్ధంగా, ప్రత్యేక తరగతుల పేరిట పాఠశాలను నిర్వహిస్తూ, విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ర్యాంకుల పేరిట విద్యార్థులపై ఒత్తిడి పెంచుతూ, ప్రభుత్వ సెలవు రోజు పాఠశాల నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల మానసిక స్థితిగతులను పట్టించుకోకుండా, ప్రభుత్వ సెలవు రోజున పాఠశాలను, ఏ విధంగా నిర్వహిస్తారని తల్లిదండ్రులు అడగగా మీ ఇష్టం ఉంటే పంపించండి లేదంటే, ఇంటి దగ్గరే ఉంచుకోండి అని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చే పరిస్థితి పాఠశాలలో నెలకొందన్నారు. సెలవు రోజున ఏ విధంగా పాఠశాలను నిర్వహిస్తున్నారని ఆయన విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. విద్యాధికారులకు ఫోన్ చేసినప్పటికీని సమాధానమిచ్చే పరిస్థితి లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలన్నారు. నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న పాఠశాలలపై కలెక్టర్, సంబంధిత విద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

### సిపిఐ(ఎం), సిఐటియు నుంచి సిపిఐ, ఎఐటియుసిలో చేరికలు



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ నగరంలోని శివనగర్ తమ్మర భవన్‌లో సిపిఐ(ఎం), సిఐటియుల నుంచి సిపిఐ, ఎఐటియుసి అనుబంధ తెలంగాణ ఆటో, ప్రైవేట్ మోటర్ వర్కర్స్ యూనియన్‌లో పలువురు చేరారు. సిఐటియు ముఖ్య నాయకులు ఎండి మహబూబ్ పాషా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆటో కార్మికులు చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గడిచిన పదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించాయన్నారు. రాష్ట్రంలో గత 10 సంవత్సరాలలో అమలు కానీ హామీలను తాము అధికారంలోకి వచ్చాక నెరవేరుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడంలో విఫలమయిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పలువురు ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు అధికారంలోకి రాగానే సంవత్సరానికి రూ.12000 ఇస్తామని, ఆటో, మోటర్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీలు అమలు చేయలేదన్నారు. ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై పెద్ద దెబ్బ తగిలిందన్నారు. నష్టపోయిన డ్రైవర్లను ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రులు పలు సందర్భాలలో చెప్పడం జరిగిందని, అయినా ఏడాది కావస్తున్నా ఆదుకున్న దాఖలు లేవన్నారు. ఉపాధి దెబ్బ తినడంతో ఆటోడ్రైవర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని, వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో గత 11 సంవత్సరాలుగా పెరిగిన పెట్రోల్, డీజిల్, ఆయిల్ గ్యాస్, నిత్యవసర ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ల చార్జీలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ఇప్పటికయిన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటోడ్రైవర్ల ఆదుకోవాలని తక్కళ్లపల్లి డిమాండ్ చేశారు. తెలంగాణ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి మహబూబ్ పాషా, జిల్లా నాయకులు ఎస్‌కె బాబా, ఎండి.ముస్తఫా, ఎండి.అమ్జద్, శ్రీదర్, ఎండి హాబిబొద్దిన్, సజ్జు తదితరులు సిపిఐ, ఎఐటియుసిలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కె భాషామియా, పనాస ప్రసాద్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుస్సా రవీందర్, ఎండి యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘాలు బలహీనపడితే కార్మికులకు నష్టం

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్




**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న కార్మిక సంఘాలు బలహీనమైతే కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం వాటిల్లుతుందని గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎఐటియుసి పనిచేస్తుందని, సంస్థ అభివృద్ధికి అవరోధంగా మారిన రాజకీయ జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించబోమని తెలిపారు. ఈనెల 28న సింగరేణి డైరెక్టర్ (పా) ఆధ్వర్యంలో జరిగే స్ట్రక్చర్ సమావేశంలో పెండింగ్ లో ఉన్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సింగరేణిలో చాలాకాలంగా స్ట్రక్చర్ సమావేశాలు పెండింగ్‌లో ఉన్నాయని, తాము గుర్తింపుపత్రం అందుకున్న వెంటనే సమావేశాలు నిర్వహించాలని యాజమాన్యానికి వినతిపత్రం అందించామన్నారు. యూనియన్ చందా చెల్లింపు విషయంలో కార్మిక చట్టాలపై అవగాహన లేని కొన్ని సంఘాలు ఉద్దేశపూర్వకంగా ఎఐటియుసిని బదనాం చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. కార్మికులు ఇచ్చిన చందా డబ్బులతో యూనియన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. డిఎంఎఫ్‌టి, సిఎస్ఆర్ నిధులను నిబంధనల మేరకు సంబంధిత ప్రాంతాలలో మాత్రమే ఖర్చు చేయాలన్నారు. ఈనెల 26వ తేదీలోగా కార్మికులు ఐటి చెల్లింపు విధానం ఎంచుకోవాలని సూచించారు. ఈనెలలో జరిగే స్ట్రక్చర్ సమావేశంలో డిస్మిస్ కార్మికులకు మరో అవకాశం ఇవ్వాలని, మారుపేర్లకు సంబంధించిన, విజిలెన్స్, వెల్ఫేర్ ఐఆర్ డిపార్ట్మెంట్లలో పెండింగ్లో ఉన్న కేసులను రివ్యూ చేయాలని మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్ మెన్, ఈపి ఆపరేటర్లకు సూటబుల్ ఎంప్లాయిమెంట్ ఇవ్వాలని, 11వ వేతన ఒప్పందంలో పెండింగ్‌లో ఉన్న 14రకాల అలవెన్స్‌లను పెంచాలని, మెరిట్ స్కాలర్ షిప్, సింగరేణి మెడికల్ కాలేజీలో సింగరేణి కోట ఎంబిబిఎస్ సీట్లు 25 శాతానికి పెంచాలని, అపాయింట్మెంట్ నుండి ప్రమోషన్ లేక సర్ఫేస్ డిపార్ట్మెంట్లలో పని చేస్తున్న కొన్ని క్యాడర్ స్కీముల ఉద్యోగుల కు పదోన్నతులను ఇవ్వాలని, సింగరేణిలోని క్యాంటీన్‌లలో అన్నింటిని యాజమాన్యమే నిర్వహిస్తూ, ప్రతి కార్మికులకి రోజుకు 25 రూపాయలు ఖర్చు పెట్టాలని, కాంట్రాక్ట్ వర్కర్లకు క్యాంటీన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఎనిమిది సంవత్సరాలుగా ఒక స్ట్రక్చర్ సమావేశం జరగకపోయినా కార్మిక సంఘాలు మాట్లాడలేదని ఆరోపించారు. ఈసారి జరిగే స్ట్రక్చర్ సమావేశంలో పెరిక్స్‌పై ఐటి చెల్లింపు, కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయింపుతో పాటు పలు అంశాలు చర్చించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉప ప్రధానకార్యదర్శి వీరభద్రయ్య, సమ్మయ్య, నాయకులు బాజీ సైదా, కొమరయ్య, సతీష్, నరసింగరావు, లచ్చన్న, నవీన్‌రెడ్డి, నాగేశ్వరరావు, పరుశురాం, సందీప్, రాము, దేవేందర్, రమణ, సురేష్, రవి పాల్గొన్నారు.

## ఘనంగా సిపిఐ శతజయంతి ఉత్సవాలు

### హేమంతరావు, పోటు ప్రసాద్ పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత జయంతి ఉత్సవాలను వాడవాడనా ఘనంగా జరుపుకోవాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం రూరల్ మండలంలోని ఎంవీ పాలెం గ్రామంలో సభ్యత్వ పునరురద్ధరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో భాగం మాట్లాడారు. తాడిత, పీడిత ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తూ అండగా నిలబడేది కమ్యూనిస్టులే అన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు పాసంగుల చందర్రావు, గ్రామశాఖ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** పేదల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ పోరాటాలు చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. వందేళ్ల పోరాట చరిత్ర కలిగిన సిపిఐ శత జయంతి ఉత్సవాలను గ్రామగ్రామాన ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. శుక్రవారం రఘునాథపాలెం మండల పరిధిలోని ఈర్లపుడి గ్రామశాఖ ఆధ్వర్యంలో సిపిఐ శత జయంతి సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన సిపిఐ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి శివా నాయక్, గ్రామశాఖ కార్యదర్శి వెంకయ్య, సీనియర్ నాయకులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, వస్రమ్, శంకర్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# అజిత్‌తో సంబంధాలు పెట్టుకోం

బిజెపితో అనుబంధం ఉన్నా ఎవరితోనూ సంబంధాలు పెట్టుకునే ప్రసక్తే లేదు:శరద్ పవార్



**పుణె :** మహారాష్ట్ర ఎన్నికల తరువాత అజిత్ పవార్‌తో సంబంధాలు పెట్టుకోబోమని ఎన్‌సిపి(శరద్ పవార్) అధ్యక్షుడు శరద్ పవార్ పరోక్షంగా స్పష్టం చేశారు. ఎన్నికల అనంతరం అజిత్ పవార్‌తో తిరిగి కలుసుకుంటారా? అనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ బిజెపితో అనుబంధం ఉన్న ఎవరితోనూ సంబంధాలు పెట్టుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ప్రసంగాల ద్వారా సమాజాన్ని విభజిస్తున్నారని విమర్శించారు. మహా వికాస్ ఆఘాడీ (ఎంవిఎ) రూపకర్త శరద్ పవార్‌ను పిటిఐ ఇంటర్వ్యూ చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో సరైన ఫలితాలు సాధించకపోవడంతో అధికార మహాయుతి విపరీతమైన ధనశక్తిని వినియోగిస్తుందని, నగదు బదిలీ పథకాలను కూడా ఉపయోగిస్తున్నదని, కానీ ప్రజలు కూటమిని తిరస్కరిస్తారని ధీమా వ్యక్తం చేవారు. మహారాష్ట్రకు నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా, అనేక మార్లు కేంద్ర మంత్రిగా రాజకీయ దిగ్గజం శరద్ పవార్ ప్రచారంలో ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మతతత్వ నినాదలపై పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. 'ఆయన మతపరమైన వ్యాఖ్యలు అందరికీ తెలిసిందేనని, ఆయనకు ఎందుకు ప్రాధాన్యతనివ్వాలి? ఆయన మీద ఒక్క పదం కూడా అనదల్చుకోలేదు. వీళ్ళు కాషాయ దుస్తులు ధరించి మతతత్వాన్ని రెచ్చగొడతారు. వీరంతా దేశానికి అపకారం చేస్తున్నార'ని అన్నారు. ప్రతిపక్షాలు కులాల ప్రాతిపదికన సమాజాన్ని విభజిస్తున్నాయని, ఐక్యత పేరుతో మహాయుతికి ఓటెయ్యాలని మోదీ ప్రచారం చేయడాన్ని ప్రస్తావించగా, 'ఆయన ప్రధాన మంత్రి. ఆయన కొన్ని విషయాలు అంటున్నారు. మా భాగస్వాములపై అంటున్న మాటలు సరైనవి కావు. ఆయనే సమాజాన్ని విభజిస్తున్నారు. కొద్ది రోజులుగా ఆయన ప్రసంగాలు చూడండి, ఆయన లేవనెత్తుతున్న విషయాల రాజకీయ ప్రయోజనాల కోసమేన'ని శరద్ పవార్ అన్నారు. ప్రధాని తన విస్తృత ప్రచారంలో భాగంగా ప్రజల్లో పెద్ద ఎత్తున అసంతృప్తిని గమనించారని అన్నారు. కాంగ్రెస్, శివసేన(యుబిటి), ఎన్‌సిపి(ఎస్‌పి) కూటమి సమాజాన్ని విభజిస్తున్నాయని, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నాయని, 'ఏక్ హై తో సేఫ్ హై (ఒక్కటిగా ఉంటే భద్రంగా ఉంటాం)' అని ప్రధాని మోదీ ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకించి కాంగ్రెస్, బిజెపి ఒకప్పటి భాగస్వామిగా ఉన్న ఉద్దవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి)పై ప్రత్యేకించి విరుచుకుపడ్డారు. కాగా, ఎంవిఎ ప్రచారానికి నేతృత్వం వహిస్తూ , 2023 పార్టీలో చీలిక తరువాత ప్రత్యేకించి తమ పార్టీ బలంగా ఉండే పశ్చిమ మహారాష్ట్రలో 83 సంవత్సరాల పవార్ విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఆ ప్రాంతాల్లో ప్రజాదరణ తమకే ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 'ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై అసంతృప్తిగా ఉన్నారు. ప్రత్యేకించి రైతులు, యువతరం వ్యతిరేకిస్తున్నారు. వారికి ఓటు వేసేందుకు అవకాశం వచ్చినప్పుడు మాకు, మా భాగస్వాములకు ఓట్లు వేస్తార'ని వివరించారు. ఎన్నికల తరువాత మీ సోదరుడి కుమారుడు అజిత్ పవార్, మీరు కలుస్తారా అని ప్రశ్నించగా, బిజెపితో కలిసున్న వారితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'మాకు మా స్వంత పార్టీ ఉంది. బిజెపితో సంబంధం ఉన్న వాళ్లు ఉన్నారు. వారితో చర్చలు జరిపే ప్రశ్నే తలెత్తదు' అని శరద్ పవార్ అన్నారు. అజిత్ పవార్ వెంట వెళ్ళి, అధికార పార్టీ కూటమి తరుపున పోటీ చేస్తున్న ఎన్‌సిపి నాయకులు ద్రోహులు అని, ప్రజలు కచ్చితంగా నవంబర్ 20న న్యాయం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తరువాత అధికార మహాయుతి లాడ్కీ బహిన్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, కొంత బలపడిందనే వాదన గురించి ప్రశ్నించగా, వారికి సానుకూల స్పందన రాలేదనే వాస్తవాన్ని గుర్తెరిగిన తరువాత వారు డబ్బును వినియోగిస్తున్నారని శరద్ పవార్ విమర్శించారు. లడ్కీ బహిన్ నగదు బదిలీ పథకం కింద మహిళలకు నెలకు రూ.1500 ఇస్తున్న ప్రభావం ఉండదా? అని అడగగా, ఏ ఆదాయ పథకమైనా కొంత ప్రభావం ఉంటుందని, కానీ, తన పరిశీలన ప్రకారం శాంతి, భద్రతలను దృష్టిలో పెట్టుకొని మహిళలు సంక్షేమ పథకాలకంటే తమ కూటమి వైపే మొగ్గు చూపుతారని అన్నారు. బిజెపి హిందూత్వ ప్రచారం మీదనే ఎక్కువ ఆధారపడుతున్నట్లుందనే ప్రశ్నకు పవార్ స్పందిస్తూ దాని ప్రభావం ఎన్నికల ఫలితాల వచ్చాక తెలుస్తుందన్నారు.

# చరిత్ర సృష్టిస్తున్న తెలంగాణ ప్రభుత్వం

ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్



**న్యూఢిల్లీ :** ఒకవైపు పదేళ్లకు ఒకసారి జనగణన చేపట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైతే, మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన సర్వే చేపట్టి చరిత్ర సృష్టిస్తున్నదని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పదేళ్ళకు ఒక సారి ప్రతి ప్రభుత్వం జనగణన నిర్వహిస్తున్న సంప్రదాయాన్ని గౌరవించడంలో ఎన్‌డిఎ ప్రభుత్వం విఫలమైందని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 'కుల గణన సామాజిక న్యాయం దిశగా కేవలం ఒక విప్లవాత్మక అడుగే కాదు. ఈ ప్రక్రియ నిర్వహణకు అద్భుత పాలనాపర సామర్థ్యం అవసరం. అది భారీ పని, తెలంగాణలో మొత్తం 33 జిల్లాల్లో 80 వేల మంది గణకులు 1.17 కోట్ల ఇళ్లకు వెళ్ళి సర్వే నిర్వహిస్తున్నార'ని జైరామ్ రమేశ్ తెలిపారు. నల్లగొండ జిల్లాలో ఇప్పటికే 55 శాతానికి పైగా జనాభా సర్వే పూర్తయిందని, మిర్యాలగూడ మున్సిపాలిటీలో 44 వార్డులలో విస్తరించిన 288 ఎన్యుమరేషన్ బ్లాక్‌ల జిఐఎస్ మ్యాప్‌లను అభివృద్ధి చేశారని వివరించారు. ఈ సాంకేతికత కారణంగా మెరుగైన ప్రణాళిక ద్వారా మున్సిపాలిటీ భవిష్యత్తులో మున్సిపాలిటీ సేవలను అందించే అవకాశం ఉంటుందన్నారు. భర్తీ చేసిన ఫామ్‌ల గోప్యతను పాటించేందుకు, వాటిని భద్రపరిచేందుకు వీలుగా నల్లగొండ జిల్లా అధికారులు ఇనుప ట్రంక్‌లను సేకరించారని తెలిపారు. కుల సర్వేను ఎన్నికల ప్రక్రియ కోసం వినియోగిస్తారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం సాధించిన విషయం ఎంతో అద్భుతమైనదని, కేంద్ర ప్రభుత్వం పదేళ్లకు ఒక సారి చేయాల్సిన జనగణనను 2021లో చేపట్టడంలో విఫలమైన చోటే తెలంగాణ ప్రభుత్వం విజయవంతమైందన్నారు. జాతీయ స్థాయి కులగణన సర్వే నిర్వహించి ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్‌లపై సుప్రీం కోర్టు విధించిన 50 శాతం సీలింగ్‌ను తొలగించాలని గత వారం కాంగ్రెస్ పునరుద్ఘాటించిన విషయం విదితమే.

**బీహార్‌కు ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వలేదు?**

గతంలో వాగ్దానం చేసినట్లు బిహార్‌కు ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వలేదని ప్రధాని నరేంద్ర మోదీని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. 2014లో ఎన్నికల ప్రచారంలో భాంగా బిహార్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని మోదీ వాగ్దానం చేశారని గుర్తు చేశారు. కంద్ర ప్రభుత్వ బహుళ కోణ పేదరిక సూచి (ఎంపిఐ) నివేదిక ప్రకారం బిహార్ దేశంలో పేద రాష్ట్రమని, 52 శాతం ప్రజలకు కనీస వైద్య, విద్య, జీవన ప్రమాణాలు లేవని తెలిపారు. హామీ ఇచ్చి పదేళ్ళైనా ఎందుకు బిహార్‌కు ప్రత్యేక హోదాను ప్రసాదించాలని జైరామ్ రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. ఎందుకు బిహార్ ప్రజలను మరిచిపోయారని, కేంద్రంలో పదేళ్లు, బిహార్‌లో దాదాపు 20 ఏళ్ళు బిజెపి అధికారంలో ఉందన్నారు. బిహార్ యువత్ కోరుకుంటున్నట్లు అగ్నిపథ్ పథకాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని నిలదీశారు.

## మహారాష్ట్ర మహాయుతిలో చిచ్చుపెట్టిన యోగి నినాదం





**ముంబయి:** మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నిక లు జరగనున్న వేళ మహాయుతి కూటమిలో లుకలుకలు బయటపడ్డాయి. ఉత్తరప్రదేశ్ ము ఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలే ఇందుకు కారణమయ్యాయి. ఇటీవల ఎన్నికల ప్రచారం సందర్భంగా యోగి ఓ నినాదం ఇ చ్చారు. దీన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎన్‌సిపి నేత అజిత్ పవార్ వ్యతిరేకించారు. దీంతో పవార్ తీరుపై మరో డిప్యూటీ సిఎం, బిజెపి నేత దేవేంద్ర ఫడణవీస్ బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. మహారాష్ట్రలో బిజెపి స్టార్ ప్రచారకర్తగా ఉన్న యోగి ఆదిత్యనాథ్ ఇటీవల ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ.. 'విడిపోతే చస్తారు (ప్రజలను ఉద్దేశిస్తూ)' అన్న అర్థంలో ఓ నినాదం ఇచ్చారు. గతంలోనూ ఆయన పలు సందర్భాల్లో ఈ నినాదాన్ని ఉపయోగించారు. అయితే, ఈ వ్యాఖ్యలపై సొంత నేతల నుంచి వ్యతిరేకత ఎదురైంది. మహారాష్ట్ర అధికార మహాయుతి సంకీర్ణ ప్రభుత్వంలోని మిత్రపక్షాలతో పాటు కొంతమంది బిజెపి నేతలు కూడా యోగి వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అజిత్ పవార్ దీనిపై స్పందిస్తూ.. 'ఆ నినాదాన్ని నేను సమర్థించను. దీని గురించి ఇప్పటికే చాలా సార్లు చెప్పా. బహుశా జార్ఖండ్, యుపి వంటి రాష్ట్రాల్లో ఈ నినాదం పనిచేస్తుందేమో గానీ.. అంబేద్కర్ సూత్రాలను పాటించే మహారాష్ట్ర నేలపై దీనికి స్థానం లేదు. బిజెఫి నేత పంకజ ముండే కూడా దీన్ని వ్యతిరేకించారు'' అని అన్నారు. తాజాగా ఈ వ్యాఖ్యలపై బిజెపి నేత, మాజీ సిఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. 'అజిత్ పవార్ కొన్ని దశాబ్దాల పాటు హిందూ వ్యతిరేక సిద్ధాంతాలతో కలిసి పనిచేయాల్సి వచ్చింది. అందుకే ఇంకా ఆయనపై మాజీ మిత్రుల (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) ప్రభావం ఉన్నట్లుంది. జనాల నాడి, అభిప్రాయాలను అర్థం చేసుకునేందుకు ఆయనకు ఇంకా కొంత సమయం పడుతుంది'' అని అన్నారు. దీంతో రాజకీయంగా ఈ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

# గిరిజన సహకారాన్ని అణగదొక్కే యత్నం

స్వాతంత్ర్య ఉద్యమ ఘనత ఒకే కుటుంబానికి వెళ్లిందని ప్రధాని మోదీ విమర్శ



**జామయి :** దేశంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వాలు స్వాతంత్ర్య ఉద్యమానికి గిరిజన నాయకుల సహకారాన్ని అణగదొక్కడానికి ప్రయత్నించాయని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ఆరోపించారు. దీంతో కేవలం ఒక పార్టీ, ఒక కుటుంబం మాత్రమే ఆ ఘతన పొందాయన్నారు. బీహార్‌లోని జాముయి జిల్లాలో ఆదివాసీల ఆరాధ్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 6,000 కోట్లకు పైగా సంక్షేమ పథకాలను ప్రారంభించా రు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ కూడా పాల్గొన్నారు.

అనంతరం మాట్లాడుతూ తాను 'ఆదివాసీ సమాజ్'ను ఆరాధిస్తానని, ముం డా జన్మదినాన్ని 'జంజాతీయ గౌరవ్ దివస్' (ఆదివాసీల కీర్తి దినం)గా జరుపుకోవాలని తమప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. 'దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడంలో ఆదివాసీలు తమ పాత్రను ఎప్పటి నుంచో నిర్వహిస్తున్నారు. రాముడు యువరాజు నుండి దేవుడిగా మారడానికి 'ఆదివాసీ సమాజం' తోడ్పడింది' అని ప్రధాని అన్నారు. 'స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనులు కూడా ముఖ్యమైన పాత్ర పోషించారు. అయితే గత ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా ఈ వాస్తవాన్ని అణిచివేసేందుకు ప్రయత్నించాయి, తద్వారా క్రెడిట్ అంతా ఒకే పార్టీ, ఒకే కుటుంబం పొందింది' అని మోదీ ఆరోపించారు. 'ఒక పార్టీకి, ఒక కుటుంబానికి మా త్రమే క్రెడిట్ ఇస్తే, బిర్సా ముండా, తిల్కా మాంఝీ (18వ శతాబ్దపు సంతాల్ నాయకుడు) ఎవరు గుర్తుంచుకుంటారు? ప్రశ్నించారు. గిరిజనుల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, సామాజిక జనాభా అధికంగా ఉన్న జిల్లాలను 'ఆకాంక్షాత్మకం'గా ప్రకటించడం వంటి చర్యలను ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. గిరిజనులకు మెరుగైన విద్య, ఆరోగ్యం, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. గిరిజన సంక్షేమానికి తమ ప్రభుత్వం బడ్జెట్‌ను రూ.1.25 లక్షల కోట్లకు పెంచిందని, అంతకుముందు ఇది కేవలం రూ. 25,000 కోట్లు మాత్రమేనని ఉండేదని గుర్తుచేశారు. 'ఒక గిరిజన మహిళ' ద్రౌపది ముర్మును బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ రాష్ట్రపతి అభ్యర్థిగా చేసినప్పుడు 'పూర్తి మద్దతు' అందించినందుకు నితీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముర్ము జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో 'గిరిజనులలో అత్యంత వెనుకబడిన వర్గాల వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, గత ప్రభుత్వాలు ఎన్నడూ పట్టించుకోని సమస్యలపై ఎప్పుడూ నాతో చర్చించేవారని' మోదీ చెప్పారు. 'నేడు ప్రధానమంత్రి జన్ మన్ యోజనను ప్రారంభించాం. ఇది అత్యంత వెనుకబడిన గిరిజనుల లక్ష్య వృద్ధి కోసం, రూ. 24,000 కోట్లతో కూడిన పథకం. ఈ పథకం యొక్క ఘనత ముర్ముకే చెందుతుంది. అత్యున్నత రాజ్యాంగ పదవికి ఎన్నిక కావడం గర్వకారణం' అని అన్నారు.

## మాధబి బచ్ కుంభకోణం కేవలం ఇన్‌సైడర్ ట్రేడింగ్ కాదు...

పరస్పర విరుద్ధ ప్రయోజనాల కేసు : రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** సెబీ చైర్ పర్సన్ మాధబి పురి బచ్ పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత ఆర్థిక వ్యవస్థను దేశ ప్రయోజనాల కోసం రక్షించాల్సిన వాళ్ళే కొద్ది మంది కార్పొరేట్ దిగ్గజాలకు ఊడ్చిపెట్టారని ఆరోపించారు. మధబి బచ్ కుంభకోణం కేవలం ఇన్‌సైడర్ ట్రేడింగ్ వ్యవహారం కాదని, ప్రత్యక్షంగా విరుద్ధ ప్రయోజనాలు కలిగిన అంశాలు అందులో బైటపడ్డాయని, కార్పొరేషన్‌లను పర్యవేక్షించాల్సిన శక్తివంతమైన నియంత్రణాధికారులే వారితో చేతులు కలిపారని అన్నారు. రాహుల్ గాంధీతో కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ హెడ్ పవన్ ఖేడా చేస్తున వరుస యూట్యూబ్ సిరీస్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై మాధబి బచ్ నుంచి తక్షణ స్పందన వెలువడలేదు. తాను ఎవరితో చేతులు కలపలేదని గతంలో ఆమె ఖండించారు.

## సెక్స్ ట్రాఫికింగ్ బాధితుల సమగ్ర పునరావాస విధానంపై శాసనపరమైన శూన్యత

అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి 'సుప్రీం' ఆదేశం



**న్యూఢిల్లీ :** సెక్స్ ట్రాఫికింగ్ బాధితుల కోసం సమగ్ర పునరావాస విధానం ఏర్పాటుకు సంబంధించి శాసనపరమైన శూన్యత ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశాన్ని పరిశీలించి అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీం కోర్టు శుక్రవారం కేంద్రాన్ని ఆదేశించింది. 'మానవ, లైంగిక అక్రమ రవాణా అనేది బాధితుడిని అమానవీయంగా మార్చే నేరాలు, బాధితుడి జీవించే హక్కు, స్వేచ్ఛ, వ్యక్తిగత భద్రతను ఉల్లంఘించేవి.ఇటువంటి నేరాల్లో సమాజంలోని బలహీనవర్గాలు, ముఖ్యంగా మహిళలు, పిల్లలు అమానుషంగా ప్రభావితం అవుతున్నారు' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జెబి.పార్థివాలా, పంకజ్ మితల్ తో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి నేరాలకు గురవుతున్న బాధితులు అక్రమరవాణాదారుల చేత అమర్యాదకు గురవుతున్నారని, వారిపైన శారీరక, మానసిక రూపాలలో హింసకు గురవుతున్నారని ద్విసభ్యధర్మాసనం తెలిపింది. అంతేకాకుండా పలుసార్లు వారికి చేసే గాయాల వల్ల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతోందని, సంక్రమణ వ్యాధులు సోకి అనారోగ్యాల బారిన పడుతున్నారని, లైంగిక సంక్రమణ వ్యాధులను కూడా వారు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది.'వాటికితోడు అదనంగా మానసిక అనారోగ్యం మూలంగా ఆందోళన విభ్రమలు, పోస్ట్ ట్రామటిక్ స్ట్రెస్ డిజార్డర్ (పిటిఎస్‌డి), నిరాశ, మాదకద్రవ్యాల దుర్వినియోగం, ఇతరులను అసభ్యకర భాషలో దూషించడం తదితర పరిస్థితులలోకి నెట్టివేయబడతున్నారు' అని ధర్మాసనం తెలిపింది. అలాంటి బాధితులను వెంటనే సుదీర్ఘకాలంపాటు డాక్టర్లు, వైద్యనిపుణులకు చూపించి మంచి చికిత్స అందించేందుకు కృషి చేయాలని, వారి అవసరాలను వారే తీర్చుకునేలా వారి ఆరోగ్య పరిస్థితులను చక్కదిద్దాలని ధర్మాసనం వివరించింది. లైంగిక వేధింపుల బాధితులపై 2015లో ఇచ్చిన తీర్పును పాటించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టిన సందర్భంగా ద్విసభ్య ధర్మాసనం ఆవేదన వ్యక్తంచేస్తూ పలు కీలక సూచనలు చేసింది.

# ఈ ఏడాది 7.2 శాతం జిడిపి వృద్ధి అంచనా

'మూడీ రేటింగ్ సంస్థ' వెల్లడి



**న్యూఢిల్లీ :** ఈ ఏడాది స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో వృద్ధి 7.2 శాతంగా ఉంటుందని అమెరికా కేంద్రంగా పనిచేసే ముందస్తు రేటింగ్ అంచనాల సంస్థ ''మూడీ'' వెల్లడించింది. ఐతే ద్రవ్యోల్బణం సమస్యల కారణంగా రిజర్వుబ్యాంకు ఈ ఏడాది సాపేక్షంగా కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగిస్తుందని కూడా వెల్లడించింది. చిల్లర వర్తకానికి సంబంధించిన ద్రవ్యోల్బణం భారీగా పెరిగినప్పటికీ కూడా రాబోయే నెలల్లో ఈ ద్రవ్యోల్బణం రిజర్వుబ్యాంకు లక్ష్యాలకు అనుగుణంగా ఓ మోస్తరుగా అదుపులోకి వస్తుందని కూడా మూడీ క్రెడిట్ రేటింగ్స్ ముందస్తు అంచనాల్లో ప్రకటించింది. రాబోయే నెలల్లో ఆహార ధరలు ఉపశమిస్తాయని, వాటి పెరుగుదల తీవ్రత తగ్గుతుందని, ఎందుకంటే భారీగా నాట్లు జరిగినందువల్ల తగినన్ని ఆహార ధాన్యాల నిల్వలు లభ్యంకాగలవని పేర్కొంది. చిల్లరవర్తకంలో ద్రవ్యోల్బణం గడచిన 14 నెలల్లో ఎన్నడూలేనంతస్థాయిలో 6.21 శాతానికి పెరగడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్న తరుణంలో మూడీ రేటింగ్ ముందస్తు అంచనాలు వెలువడ్డాయి. రిటైల్ ద్రవ్యోల్బణం రిజర్వుబ్యాంకు భరించేస్థాయిని దాటిపోయి పెరిగింది. ముఖ్యంగా కూరగాయల ధరలు, ఆహార వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంవల్ల ఈ పరిస్థితి వచ్చిందని జాతీయ గణాంకాల సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఆహార ధరల ఒత్తిడి కొనసాగడం, దానిలోని హెచ్చుతగ్గులు ద్రవ్యోల్బణ రాహిత్యానికి దారితీస్తాయని పేర్కొంది. ''ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, వాతావరణలో తీవ్రమైన వికృత పరిస్థితులు, రిజర్వుబ్యాంకు వైఖరులను, విధాన నిర్ణయాలలో పట్టువిడుపులను ప్రభావితం చేస్తాయి. ఇప్పటికే రిజర్వుబ్యాంకు రెపో రేటు (రిజర్వు బ్యాంకు బ్యాంకులకు ఇచ్చే రుణాలపై వడ్డీ)ను అక్టోబరునెలలో 6.5 శాతంవద్ద స్థిరంగా ఉంచి తన ద్రవ్య విధాన వైఖరిని తటస్థంగా కొనసాగిస్తున్నప్పటికీ రాబోయే సంవత్సరంలో సాపేక్షంగా కఠిన ద్రవ్య విధానంలోకి వెళుతుంది'' అని పేర్కొంది. రిజర్వుబ్యాంకు ద్రవ్య విధాన కమిటీ సమావేశం నిర్ణీత ప్రకారం వచ్చేనెలలో జరుగుతుంది. గృహవినియోగాలు కూడా పెరుగుతాయని, దానివల్ల పండుగ సీజన్‌లో ఖర్చులు పెరుగుతాయని, గ్రామీణ ప్రాంతాలలో డిమాండ్ పెరుగుతుందని పేర్కొంది. దీనికి అదనంగా బిజినెస్ సెంటిమెంట్లు, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ వ్యయాల కొనసాగింపు వంటివి కూడా ప్రైవేటు పెట్టుబడులకు దోహదం చేస్తాయని పేర్కొంది. భారత్ రియల్ జిడిపిని పోల్చి చూసినప్పుడు 2024 రెండో త్రైమాసికంలో 6.7 శాతం మేరకు పెరిగిందని పేర్కొంది. గృహవినియోగాల పునరుద్ధరణవల్ల ఇది జరిగిందని తెలిపింది. ఇన్వెస్టిమెంటు బాగా పెరగడం, తయారీరంగ కార్యకలాపాలు బలంగా కొనసాగడం వంటివి జులై–సెప్టెంబరు త్రైమాసికంలో క్రమంగా ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి సూచనలని పేర్కొంది. జి–20లో ఉన్న చాలా సభ్యదేశాలు ఇదేవిధంగా క్రమానుగత ఆర్థిక వృద్ధిని చవిచూస్తున్నాయని మూడీ తెలియజేసింది.

## చికెన్ దొంగతనం కేసుల్లో బిజీగా దర్యాప్తు సంస్థలు

జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్ ఎద్దేవా



**రాంచి :** కేంద్ర దర్యాప్తు సంస్థలపై జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తీవ్ర వి మర్శలు చేశారు. చికెన్ దొంగతనం వంటి ఘటనలపై దర్యాప్తు చేసే పనిలో దర్యా ప్తు సంస్థలు క్షణం తీరిక లేకుండా ఉన్నాయని ఆరోపించారు. బిజెపి ఆజ్ఞ మేరకు ఉత్తర ప్రదేశ్‌లో పరిక్షా పత్రం లీకేజీ వంటి కేసుల జోలికి వెళ్లడం లేదన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న పేపర్ లీకేజీల వెనుక కాషాయ పార్టీ హస్తం ఉందని సోరెన్ ఆరోపించారు. పేపర్ లీకేజీల ద్వారా సేకరించిన డబ్బును ఎన్నికల ప్రచార నిధిని సమకూర్చుకునేందుకు ఉపయోగిస్తున్నారని చెప్పారు. జార్ఖండ్ ఎ న్నికల్లో బిజెపి చూపిస్తున్న ఆడంబరం, ప్రదర్శన అంతా పేపర్ లీకేజీల సొమ్ము తో చేస్తున్నదేనన్నారు. ఈ రోజుల్లో కోడి దొంగతనాల కేసులను కూడా దర్యాప్తు ప్రారంభించిన ఇడి, సిబిఐ, ఎన్‌ఐక్ష పేపర్ లీక్‌లపై విచారణ జరపలేదని, వీటిని లీక్ చేసి, ఆ డబ్బుతో ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేలు, ఎంపిలను కొనుగోలు చేస్తుందని సోరెన్ మండిపడ్డారు. 'బిజెపి పాలిత రాష్ట్రాలన్నింటిలోనూ పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయి... ఎంపి వ్యాపం స్కామ్ అనేక మంది ప్రాణాలను బలిగొంది. జార్ఖండ్‌లో, మేము ఒక పేపర్ లీక్ తర్వాత కఠినమైన చట్టం చేశాము, కాని బిజెపి దానిని బ్లాక్ లాగా పేర్కొంటూ రాజ్‌భవన్‌కు వెళ్లింది' అని ఆయన ఆరోపించారు. 'తప్పుడు' కేసుల్లో తనను ఇడి, సిబిఐ 'వేధించకుంటే', ప్రభుత్వంలో అనేక కొత్త పోస్టులను సృష్టించి, పెద్ద ఎత్తున రిక్రూట్‌మెంట్‌లకు హామీ ఇచ్చేవాడినని సోరెన్ పేర్కొన్నాడు.



## 700 కిలోల డ్రగ్స్‌తో పట్టుబడిన ఇరాన్ బోటు : 8 మంది అరెస్ట్

**అహ్మదాబాద్:** భారీ స్థాయిలో డ్రగ్స్ ఉన్న ఇరాన్ బోటు భారత సముద్ర జల్లాల్లోకి ప్రవేశించింది. దీంతో ఇండియన్ నేవీ, ఎన్సీబీ, యాంటీ టెర్రరిస్ట్ సాక్వ్‌డ (ఎటిఎస్) పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. 700 కిలోల మెత్‌ను స్వాధీనం చేసుకున్నారు. 8 మంది ఇరాన్ జాతీయులను అరెస్ట్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున గుజరాత్ సముద్ర తీరంలోని భారత ప్రాదేశిక జలాల్లో ఇరాన్ బోటు అనుమానాస్పదంగా కనిపించింది. అందులో డ్రగ్స్ ఉన్నట్లు నిఘా వర్గాలు సమాచారం ఇచ్చాయి. కాగా, ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్ 'సాగర్ మంథన్ – 4' అనే కోడ్‌నేమ్‌తో ఆపరేషన్ చేపట్టాయి. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి), గుజరాత్ పోలీస్‌కు చెందిన యాంటీ టెర్రరిస్ట్ సాక్వ్‌డ (ఎటిఎస్)తో కలిసి ఆ బోటు వద్దకు చేరుకున్నారు. ఇరాన్ బోటును తనిఖీ చేశారు. అందులో ఉన్న మెత్‌గా పిలిచే 700 కిలోల మెథంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బోటులో ఉన్న 8 మంది ఇరానీయన్లను అరెస్ట్ చేశారు. ఈ డ్రగ్స్ విలువ మార్కెట్‌లో రెండు నుంచి ఐదు కోట్ల వరకు ఉంటుందని ఎన్‌సిబి అధికారులు తెలిపారు. ఈ డ్రగ్స్ ఎక్కడకు, ఎవరికి సరఫరా చేసేందుకు తరలిస్తున్నారో అన్నది దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## స్వతంత్ర మీడియా లైసెన్సింగ్ అథారిటీ బిల్లు రాజ్యసభ పరిశీలనకు ఆమోదం

కేంద్ర సమాచార ప్రసారాల శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడి



**న్యూఢిల్లీ :** దేశంలో మీడియా సేవల నియంత్రణ, లైసెన్సింగ్ కోసం స్వతంత్ర అధికారాన్ని ఏర్పాటు చేయడానికి ఉద్దేశించిన ప్రైవేట్ సభ్యుల బిల్లు రాజ్యసభ పరిశీలనకు ఆమోదం పొందిందని శుక్రవారం రాజ్యసభ బులెటిన్ తెలిపింది. సిపిఐ (ఎం) ఎంపి వి.శివదాసన్ ద్వారా ఇండియన్ మీడియా సర్వీసెస్ (నియంత్రణ, లైసెన్సింగ్) బిల్లు 2024ను ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లుగా ప్రవేశపెట్టారు. ఇండియన్ బోర్డు ఆఫ్ మీడియా సర్వీసెస్ నియంత్రణ, లైసెన్సింగ్ ఏర్పాటుచేయడానికి, మీడియా సేవలు దేశంలో ఉచిత, స్వతంత్ర మీడియా సేవల అభివృద్ధిని సులభతరం చేయడానికి ఈ బిల్లు ద్వారా ఒక స్వతంత్ర అధికారాన్ని లభిస్తుందని బులెటిన్ తెలియజేసింది. కేంద్ర సమాచార ప్రసారాల శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ రాజ్యసభ సెక్రటరీకి ఈ విషయాన్ని తెలియజేశారని వెల్లడించింది. రాష్ట్రపతి ఈ బిల్లును ఆమోదించి సభకు పంపించారని వివరించింది. ఖజానా నుంచి ఖర్చుతో కూడిన ప్రైవేట్ మెంబర్ బిల్లులకు కేంద్ర సమాచార ప్రసారాల శాఖ ద్వారా రాష్ట్రపతి అనుమతి అవసరం. అలాంటి బిల్లులను రాజ్యసభ పరిగణనలోకి తీసుకుంటుంది. ఇండియన్ మీడియా సర్వీసెస్ (నియంత్రణ, లైసెన్సింగ్) బిల్లు 2024 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ప్రారంభించిన ఆరునెలల లోపు అధికారిక గెజిట్‌లో నోటిఫికేషన్ ద్వారా, ఈ చట్టం ప్రయోజనం కోసం స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థను భారతీయంగా పిలువబడుతుంది. మీడియా సేవల కోసం బోర్డు, మీడియా సేవల పనితీరును నియంత్రించడానికి, దేశంలో ఉచిత, స్వతంత్ర మీడియా సేవలను ప్రోత్సహిస్తుంది. ఈ చట్టం ప్రయోజనాలను నెరవేర్చడానికి కేంద్ర ప్రభుత్వం సరిపోతుందని భావించేటటువంటి డబ్బు మొత్తాలను రాజ్యసభలో చట్టం ద్వారా పార్లమెంట్ చేసిన కేటాయింపు తర్వాత సెంట్రల్ గవర్నమెంట్ బోర్డుకు మంజూరు చేయాలని కూడా తెలియజేస్తుంది. లైసెన్సింగ్‌ను బ్యూరోక్రసీ, అధికార పార్టీకి వదిలివేయవద్దని, లైసెన్స్‌లు పునరుద్ధరించడం, లైసెన్స్‌లు జారీచేయడానికి ప్రతిపాదించబడిన ఒక అటానమస్ బాడీ ద్వారా సరిదిద్దాలన్నదే ధ్యేయం అన్నారు. దీనివల్ల మీడియా స్వేచ్ఛగా, కార్యకలాపాలను సజావుగా నిర్వహిస్తుందని బిల్లు చెబుతోంది.


IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHUPALPALLY
O.S.No. 245 of 2024

Between:-
Godde Rajeshwari ... Plaintiff
AND
1) The District Collector, Jayashankar Bhupalpally District.
2) The General Manager, Singareni Collieries Company Ltd., Bhupalpally, Jayashankar Bhupalpally District.
3) Godde Uma Mahashwari
4) To whomsoever it may concern
...Defendants

PUBLIC NOTICE

It is hereby informed that the above named plaintiffs filed the suit against the defendants for declare she is legal heir and successor of late Godde Ngabhushanam for submitting necessary papers for sanction all death benefits and provide job to the plaintiff she is a legal heir and successor late Godde Ngabhushanam the above suit is posted to **25-11-2024 at 10:30 AM** for the appearance of defendant No. 4, i.e whomsoever it may concern before the said Hon'ble court either in person or through an advocate give answer to the claim failing which the matter will be decide in your absence. Hence you are summoned to appeare before the honorable court on the above date and time.

Hence this public notie.
// BY ORDER OF THE COURT //
Yours faithfully
**Sd/- K.CHIRANJEEVI**
Advocate
Bhupalpally
Cell: 9441445963

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శనివారం, నవంబరు 16

## అధ్యక్షునికి జైకొట్టిన శ్రీలంక

శ్రీలంక పార్లమెంటుకు గురువారం జరిగిన ఎన్నికల్లో ఆ దీవి దేశం ఓటర్లు తమ అధ్యక్షుడు అనుర దిస్సానాయకే సంకీర్ణం 'నేషనల్ పీపుల్స్ పవర్' (ఎన్‌పిపి)కి పట్టంకట్టారు. ఎన్‌పిపి 21 పార్టీల కూటమి. ఈ కూటమికి పోలైన ఓట్లలో 62శాతం లభించాయి. 22 ఎలక్టోరల్ జిల్లాలకుగాను 21లో ఎన్‌పిపికి మెజారిటీ లభించింది. పార్లమెంటులోని 225 సీట్లలో 141, పార్టీలకు పోలైన ఓట్లనుబట్టి దామాషా పద్ధతిలో కేటాయించే 26సీట్లలో 18– మొత్తం 159 పిపిపి వశమైనాయి. సెప్టెంబర్‌లో అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్టు అనుర దిస్సానాయకె విజయం సాధించటం ఎంత అద్భుతమో, పార్లమెంటు ఎన్నికల్లో పిపిపికి మూడింట రెండువంతుల సీట్లు లభించటం కూడా అంతే చిత్రం, భళారే విచిత్రం. రద్దయిన పార్లమెంటులో 3స్థానాలున్న జాతీయ ప్రజాశక్తి కూటమికి ఓటర్లు 159సీట్లు కట్టబెట్టటం అత్యంత అరుదైన విషయం. శ్రీలంక ప్రజలు మార్పును కోరుకుంటున్నారని 55 ఏళ్ల నవ అధ్యక్షుడు సరిగ్గా అంచనా వేశారు. పార్లమెంటును ముందే రద్దుచేసి ఎన్నికలకు ఆదేశించిన అనుర దిస్సానాయకే ఆత్మవిశ్వాసానికిది విజయం. అధ్యక్షుడు స్వేచ్ఛగా పనిచేయాలంటే పార్లమెంటు అడ్డంకి కాకూడదని ఓటర్లు భావించారా లేక పాత పాలకవర్గ పార్టీలపట్ల ఏహ్యాభావం అధ్యక్షుని కూటమికి అనుకూలంగా పనిచేసిందా? సెప్టెంబర్‌లో అధ్యక్ష ఎన్నికలకు కొనసాగింపుగానే ఈ ఎన్నికలను చూడాల్సి ఉంటుంది. గడచిన రెండు మాసాల్లో, దేశంలోని పరిస్థితులను అవగాహన చేసుకుని మెరుగుపరచటంపైనే అధ్యక్షుడు దృష్టి పెట్టాడు తప్ప ప్రజల మనస్సును గాయపరిచే తప్పేమీ చేయలేదు. కాని అధ్యక్ష ఎన్నికల్లో 17మిలియన్ ఓటర్లలో 80 శాతం ఓట్లు పోలుకాగా, అది ఈ ఎన్నికల్లో 65శాతానికి తగ్గటం పాలక కూటమి విశ్లేషణ చేయాల్సిన అంశం. మాజీ అధ్యక్షుడు రణసింఘె ప్రేమదాస కుమారుడు సాజిత్ ప్రేమదాస పార్టీ ఎస్‌బిజెకి 35 సీట్లు, తమిళ మైనారిటీలకు ప్రాతినిధ్యం వహించే ఇల్లాన్‌కై తమిళ అరసు కచ్చికి ఆరు సీట్లు, ఎన్‌డిఎఫ్‌కు 3, శ్రీలంక పొడుజన పెరామునకు 2 సీట్లు దక్కాయి. ఎన్‌డిఎఫ్‌కు మాజీ అధ్యక్షుడు రనిల్ విక్రంసింఘె నాయకత్వం వహించారు.

లాటిన్ అమెరికాలోని కొలంబియా, హోండూరస్ పాలకపార్టీలతో దిస్సానాయకె పార్టీ – జనతా విముక్తి పెరుమున(జెవిపి)కు పోలిక కనిపిస్తుంది. ఆ దేశాల్లో కొద్దికాలం క్రితం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఓటర్లు వామపక్ష అభ్యర్థులను ఎన్నుకున్నారు. ఆ దేశాల్లోని అమెరికా మద్దతుగల సాంప్రదాయక పార్టీలకు వ్యతిరేకంగా అవి చాలా సంవత్సరాలపాటు సాయుధ పోరాటం చేశారు. జెవిపి కూడా రెండు పర్యాయాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసింది. అయితే పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పనిచేసే పార్టీగా అది గత దశాబ్దంలో తమ గమనాన్ని మార్చుకుంది. ప్రజాస్వామిక వ్యవస్థలున్న దేశాల్లో సాయుధ పోరాటం చేస్తున్న 'విప్లవ' పార్టీలు వారి అనుభవం నుంచి పాఠాలు తీసుకోవచ్చు.

శ్రీలంక ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని ఉంది. కోవిడ్ దరిమిలా పర్యాటకరంగం పడకేయటం ఈ సంక్షోభానికి మూలం. అయినా శ్రీలంక ప్రజల జీవన ప్రమాణాలు భారత్ ఇతర ఆగ్నేయాసియా దేశాలకన్నా ఎంతో మెరుగు. విద్య, మహిళా సాధికారత స్థాయిని ఐరాస ప్రశంసించింది. సంక్షోభాన్ని అధిగమించేందుకు ఐఎంఎఫ్ నుంచి రుణం పొందినందున ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ పేరుతో అది విధించిన షరతులు అధ్యక్షుడి తాత్వికతకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. అది విధిలేని పరిస్థితిగనుక, పేదలపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించే కృషి అవసరం. సిన్హళ పక్షపాతిగా, తమిళుల వ్యతిరేకిగా ఉన్న ముద్రను చెరుపుకోవటానికి మొన్న ఎన్నికల ప్రచారంలో తమిళ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చటం అవసరం.

అంతర్జాతీయంగా చూస్తే, హిందూ మహాసముద్రంలో కీలకమైన ప్రాంతంలో ఉన్న శ్రీలంకపై అమెరికా, చైనా, ఇండియా ఒత్తిళ్లున్నాయి. అనుర ఎలాగూ అమెరికా సైనిక ప్రయోజనాలతో రాజీపడడు. కాగా చైనా, భారత్ రెండూ శ్రీలంకకు అవసరం. శ్రీలంక ఇప్పటికే చైనా బెల్టురోడ్ చొరవలో భాగస్వామిగా ఉంది. అధ్యక్షుని కార్యాలయంలో మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, ఫిడెల్ కాస్ట్రో ఫోటో లున్నాయట. చైనా నాయకుల ఫోటో ఏదీలేనందున అధ్యక్షుడు చైనాతో ఆచరణాత్మక వైఖరితో వ్యవహరించవచ్చు. భారత్ శ్రీలంకలో అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నది. గత రెండేళ్లలో దాని సంక్షోభంలో ఎంతో సహాయం చేసింది. కాబట్టి ఆయన భారత్‌తో సత్సంబంధాలనే కోరుకుంటాడు. అయితే సార్క్ దేశాల్లో నరేంద్రమోదీ ప్రభుత్వం ఒక్కటే అమెరికాతో అతి సన్నిహితంగా ఉండటం ఇబ్బందులు కలిగించవచ్చు. ఇరుపక్షాల ఆచరణాత్మకతే ప్రయోజనదాయకం.

# 'అచ్చేదిన్' జాడ ఎక్కడ మోదీ జీ!



ఎం. కోటేశ్వరరావు

చిల్లర ద్రవ్యోల్బణం పద్నాలుగు నెలల గరిష్టం అక్టోబరు నెలలో 6.21శాతానికి చేరింది. ఆహార ద్రవ్యోల్బణం అంతకు మించి 15నెలల గరిష్టం 10.87శాతానికి చేరింది. ఏడాది క్రితం అక్టోబరు నెలలో 6.61శాతమే ఉంది. ఈ అంకెలను మోదీని వ్యతిరేకించే వారు చెప్పలేదు, కేంద్ర ప్రభుత్వ జాతీయ గణాంక సంస్థ(ఎన్ఎస్ఓ) వెల్లడించినవే. ప్రతినెల 12వ తేదీన ధరలు, ద్రవ్యోల్బణం సంబంధిత అంశాలను ఎన్ఎస్ఓ విడుదల చేస్తుంది. గతంలో మోదీ మంత్రదండపు విజయగాధలను గానం చేసిన వారు ఇప్పుడు మాట్లాడటం లేదు. దేవునిబిడ్డ అతీంద్రీయ శక్తులు ఏమైనాయో తెలియటం లేదు.. పాలకులు, పార్టీలు ఎలాబోతే మనకేం... గుల్లవుతున్నది మన జేబులే అనుకోవటం జనంలో ఇప్పుడే ప్రారంభమైనట్లు తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడించాయి. నరేంద్ర మోదీ గతంలో చెప్పిన వాటిని తప్ప కొత్తకొత్త అంశాలను మాత్రమే జనానికి చెబుతున్నారు. మాటల మాంత్రికుడు మరి. పదేండ్ల క్రితం ధరల పెరుగుదలతో జనాలకు చచ్చే రోజులు దాపురించటాన్ని నరేంద్రమోదీ చక్కగా వినియోగించుకున్నారు. తనకు అధికారమిస్తే అచ్చేదిన్ తెస్తానని చెప్పారు. ఇప్పుడా మాట కలలో కూడా ప్రస్తావించటం లేదు.



2014 మార్చి నెలలో వినియోగదారుల(వస్తువుల) సాధారణ సూచిక 138.1 ఉంటే 2024 అక్టోబరు నెల అంచనా 196.8గా ఉంది. దీన్ని సులభంగా చెప్పుకోవాలంటే నిత్యావసర వస్తువుల ఒక కిట్ ధర పదేండ్లలో రు.138.10 నుంచి రు.196.80కి పెరిగింది. విడివిడిగా అంటే కేవలం ఆహార వస్తువులనే తీసుకుంటే రు. 140.70నుంచి రు.209.40కి చేరింది. అచ్చేదిన్ అని నరేంద్రమోదీ చెప్పినపుడు అంతకు ముందున్న ధరలను తగ్గిస్తారని జనం అనుకున్నారు. భజనపరులు ధరల తగ్గింపు అంటే పెరుగుదల రేటు అని టీకా తాత్పర్యాలను చెబుతున్నారు. ఇది వాస్తవమా? మోదీ తొలిసారి అధికారానికి వచ్చిన సమయంలో మనం దిగుమతి చేసుకొనే ముడి చమురుధరలు ఆకాశాన్ని అంటాయి. వెంటనే అంతర్జాతీయ మార్కెట్లో పతనంతో దిగుమతి బిల్లు తగ్గి ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. దీన్ని తన విజయంగా చెప్పుకున్నారు. 2014 జనవరి నుంచి 2019 జనవరి వరకు చూస్తే 22 నిత్యావసర వస్తువుల్లో పదింటి ధరలు పది శాతం పెరిగాయి. పెసరపప్పు, బంగాళాదుంపలు, ఉల్లి ధరలు అంతకు ముందు ఉన్నవాటి కంటే కాస్త తగ్గాయి. తొమ్మిది వస్తువుల ధరలు పది నుంచి 40శాతం వరకు పెరిగాయి. సెనగపప్పు, పాల ధరలు 33.21శాతం చొప్పున పెరిగాయి. అదే 2019 జనవరి నుంచి 2024 జనవరి వరకు అన్ని వస్తువుల ధరలు 15 శాతంపైగా పెరిగాయి తప్ప తగ్గలేదు. పన్నెండు సరకుల ధర 40శాతంపైన, ఏడింటి ధర 50శాతం పైగా పెరిగింది. కందిపప్పు 110, ఉల్లి 107శాతం పెరిగింది. పప్పుధాన్యాల ధరల సూచిక 2014 మార్చి నెలలో 120.1ఉంటే ఈ ఏడాది అక్టోబరులో 216.8గా ఉంది. ఇదంతా అచ్చేదిన్ కాలపు నిర్వాకం. ధరల పెరుగుదల యుపిఏ పాలన చివరి సంవత్సరాల నాటి స్థాయికి చేరే బాటలో ఉంది. గ్రామీణ ప్రాంతాలలో సాధారణ ద్రవ్యోల్బణం రేటు ఎక్కువగా ఉంది. అక్టోబరులో ఆహార వస్తువుల ధరల సూచిక ప్రకారం పట్టణాల్లో 10.69శాతం ఉంటే పట్టణాల్లో 11.09శాతం ఉంది.ఆహార ధరల పెరుగుదల ఇలా ఉన్న కారణంగానే జనం అవసరమైన మేరకు పోషకాహారం తీసుకోలేకపోతున్నారు. అలాంటి జనాలు రోగాల పాలు కావటం దానిమీద ఖర్చు మరొక భారం. మొత్తంగా ధరల పెరుగుదల కారణంగా వస్తువుల మీద విధిస్తున్న జిఎస్‌టి ఏడాది కేడాది పెరుగుతున్నది. తమ ప్రభుత్వం సాధించిన అభివృద్ధే దీనికి నిదర్శనం అంటూ పాలకులు తప్పుదారి పట్టిస్తున్నారు.

మనదేశంలో అత్యధికులు తమ ఆదాయాల్లో సగం మొత్తాన్ని ఆహారంకోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇటీవలనే కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకొనే వంటనూనెలపై గరిష్టంగా 30శాతం వరకు దిగుమతి పన్ను విధించింది. ఆ మేరకు దిగుమతి చేసుకొనేవాటితో పాటు స్థానికంగా తయారయ్యే వాటి ధరలు కూడా పెరిగాయి. కొన్ని ఔషధాల ధరలను కేంద్ర ప్రభుత్వం 50శాతం పెంచింది, ఎందుకు అంటే జనానికి అవసరమైన వాటిని ఉత్పత్తి చేయాలంటే కంపెనీలకు గిట్టుబాటు కావటం లేదు, పెంచకపోతే ఉత్పత్తి మానివేస్తే జనానికే నష్టం అని చెబుతున్నారు. ఆహారధాన్యాలు కూడా జనానికి అవసరమే. వ్యవసాయ ఉత్పత్తి పట్ల కూడా అదే విధంగా వ్యవహరిస్తున్నదా? 2014లో క్వింటాలు సాధారణ రకం ధాన్య కనీస మద్దతు ధర రు.1,310 కాగా ఇప్పుడు రు.2,183కు పెంచారు. మరోవైపు ధాన్య ఉత్పత్తి ఖర్చు ఇదే కాలంలో రు.644 నుంచి రు.1,911కు పెరిగిందని వ్యవసాయ పంటల ధరల, ఖర్చుల కమిషన్ చెప్పింది. ఈ ఖర్చుతో పోల్చుకుంటే మద్దతు ధరల పెరుగుదల ఎంత తక్కువో చెప్పనవసరం లేదు.

యుపిఏ పాలనాకాలంలో ధరల పెరుగుదలను బిజెపి రాజకీయంగా సొమ్ము చేసుకుంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ 2012 మే 23,24 తేదీలలో మూడు ట్వీట్లు చేశారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన తరువాత పెట్రోలు ధరల పెంపు ప్రకటన పార్లమెంటు గౌరవాన్ని భంగపరచటమే అన్నారు. పెద్ద మొత్తంలో ధరల పెంపుదల యుపిఏ ప్రభుత్వ వైఫల్యం, గుజరాత్ మీద వందల కోట్ల భారం పడుతుందన్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలలో కంటే గుజరాత్‌లో పెట్రోలియం ఉత్పత్తుల మీద విధిస్తున్న వ్యాట్ తక్కువ అన్నారు. గ్యాస్ ధర పెరగ్గానే సిలిండర్ పట్టుకొని మీడియా ముందుకు పరుగుపరుగున వచ్చిన బిజెపి నాయకురాలు స్మృతి ఇరానీ గురించి చెప్పనవసరం లేదు. "గ్యాస్ ధర యాభై రూపాయలు పెంచి కూడా తమది పేదల సర్కార్ అని చెప్పుకుంటున్నారు సిగ్గులేదు, యుపిఏ పాలనలో జిడిపి అంటే గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ కాదు. గ్యాస్, డీజిల్, పెట్రోలు ధరలు, ఆరోసారి పెట్రోలు ధరలు పెంచారు, ఇదేమాత్రం సమర్ధనీయం కాదు, దీని వలన ద్రవ్యోల్బణం పెరుగుతుంది. యుపిఏ ప్రభుత్వ తప్పుడు విధానాల ఫలితంగానే పెట్రోలు ధరలు, గృహరుణాల వడ్డీ పెరుగుతున్నదని, కంపెనీల కోసమే పెట్రోలు ధరలు పెంచుతున్నారని, చైనా చొరబాట్లు, పెట్రోలు ధరలు పెరుగుతున్నాయని, రూపాయి విలువ పడిపోయిందని, 60శాతం దేశపౌరులు ఆహారంకోసం ఇబ్బందులు పడుతుంటే లౌకికవాదం గురించి మాట్లాడుతున్నారంటూ" 2010–13 సంవత్సరాలలో ట్వీట్లు చేశారు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చమురు ధరల పెరుగుదలను సమర్థించుకొనేందుకు జవహర్‌లాల్ నెహ్రూ పేరును ఉపయోగించుకున్నారు. కొరియా యుద్ధం భారత ద్రవ్యోల్బణం మీద ప్రభావం చూపుతుందని 1951లోనే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పారు. ప్రపంచమంతా ఒకటిగా ఉన్నా ఇప్పుడు ఉక్రేన్ యుద్ధం ప్రభావితం చేస్తున్నదని మేం చెబుతున్నాం, దాన్ని అంగీకరించరా? చమురు కంపెనీలు అధిక ధరలకు కొనుగోలు చేస్తే దాన్ని మనం భరించాల్సిందే అని లోక్‌సభలో సమర్థించుకున్నారు. పోనీ ఈ తర్కానికైనా కట్టుబడి ఉన్నారా? జనంపట్ల, ద్రవ్యోల్బణం తగ్గింపు పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా అన్నదే ప్రశ్న. 2022 ఏప్రిల్ నుంచి ఒకే ధరలను వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ముడి చమురు ధర 20శాతం తగ్గింది. ఆ మేరకు చూసుకుంటే పెట్రోలు, డీజిలు ధరలు కనీసం దానిలో సగం కూడా ఎందుకు తగ్గించలేదు. జనం జేబులు కొల్లగొట్టి ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీల రూపంలో కట్టబెడుతున్నది. చమురుపై పెంచిన సెస్సుల పేరుతో మోదీ సర్కార్ ఇప్పటి వరకు రు.26.74లక్షలకోట్ల రూపాయలను వినియోగదారుల నుంచి వసూ లు చేసింది. ఈ భారం రవాణా రంగం, ఇతర వాటిమీద పడి అనేక వస్తువుల ధరలు పెరగటానికి దారి తీసింది. అందువలన ధరల పెరుగుదలకు ప్రకృతి మీదో, మరొకదాని మీదో నెపం మోపితే కుదరదు. ద్రవ్యోల్బణాన్ని నాలుగుశాతానికి పరిమితం చేస్తామని ఆర్‌బిఐ పదే పదే చెప్పటం తప్ప ఆచరణలో అమలు జరగలేదు. జనం ఇబ్బందు లు పడుతుంటే లౌకికవాదం గురించి కబుర్లు చెప్పారని విమర్శించిన బిజెపి పెద్దలు రోజూ మాట్లాడుతున్నదేమిటి? హిందూమతానికి ప్రమాదం వచ్చింది, హిందూత్వను, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలనే కదా! కనీసం హిందువులు, సనాతన వాదమని ప్రకటించుకున్న జనసేన వారికైనా హిందూమతం ధరలను తగ్గిస్తుందా? జనాల కడుపు నింపుతుందా ?

నరేంద్రమోదీ అధికారానికి వచ్చిన 2014 మే నెలలో ముడిచమురు పీపా ధర 113 డాలర్లు ఉంది, తరువాత 2015 జనవరిలో 50, 2016 జనవరిలో 29 డాలర్లకు పడిపోయినపుడు ధరలు తగ్గించకపోగా పెద్ద మొత్తాలలో సెస్ విధించారు. తరువాత ధరలు పెరిగినప్పటికీ సెస్ రద్దు చేయలేదు. ఇప్పుడు 70డాలర్లకు అటూ ఇటూగా ఉంటోంది.సెస్ ఎందుకు విధించారయ్యా అంటే కరోనా వాక్సిన్ ఉచితంగా కావాలంటారు. దానికి డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది అని పెట్రోలియం శాఖామంత్రిగా పనిచేసిన రామేశ్వర్ తేలీ వాదించారు. తరువాత ఎత్తివేశారా అంటే లేదు, దేశ రక్షణకు అయ్యే ఖర్చుకు డబ్బు ఎక్కడి నుంచి తేవాలని మరొకవాదన చేశారు. సెస్ ఎత్తివేత సంగతి తరువాత గత ఆరునెలల్లో తగ్గిన మేరకైనా ధర ఎందుకు తగ్గించటం లేదంటే నోరు విప్పటం లేదు. దీని సంగతేమిటో ప్రశ్నించాలా వద్దాలేక జేబులను కొల్లగొడుతుంటూ గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోవాలా?

# లగచర్ల ఘటన దురదృష్టకరం



ఉజ్జిని రత్నాకరరావు
9490952646

వికారాబాద్ జిల్లా లగచర్లలో 'ఫార్మా ఇండస్ట్రియల్ కారిడార్'పై అభిప్రాయ సేకరణకోసం వెళ్లిన కలెక్టర్, వారి వెంట ఉన్న అధికారులపై జరిగిన దాడి చూస్తే కొంత ప్లాన్ ప్రకారమే రైతులను, యువకులను, ప్రజలను రెచ్చగొట్టి దాడి చేసినట్లు స్పష్టంగా టివిలలో చూపించిన దశ్యాల ద్వారా తెలుస్తుంది. ప్రజాభిప్రాయసేకరణ కాబట్టి ప్రజలు, భూములు కోల్పోతున్న రైతులు తమ అభిప్రాయాలు వేదిక వద్ద వెల్లడించే అవకాశం ఉండింది. తమ భూములను ఎట్టి పరిస్థితులలో ఇవ్వబోమని చెప్పే అధికారం ఉంది. ఫార్మా కంపెనీలతో పెరిగే పొల్యూషన్ పై అభ్యంతరం చెప్పే హక్కు ఉంది. కానీ, లగచర్లలో అదేమీ జరగలేదు. అందుకు విరుద్ధంగా కలెక్టర్ పైన వారి వెంటఉన్న రక్షణ సిబ్బంది, ఇతర ఉద్యోగులపైన దాడి జరగడం అనేక అనుమానాలకు తావిస్తుంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాటుచేసిన వేదిక వద్దకు "ఎవ్వరు వెళ్ళవద్దని.. వారే ప్రజలవద్దకు రావాలి.. వాళ్ల సంగతి ఇక్కడనే తెల్చుకుందాం" అంటు కొందరు రెచ్చగొట్టి దాడి చేయించారని తేలింది. టివి దృశ్యాలలో మనకు స్పష్టంగా గోచరించుతుంది. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఓ వ్యక్తి యువకులను, ప్రజలను, రైతులను రెచ్చగొట్టారని, అతనే ప్రజాభిప్రాయాన్నిసేకరణ వేదిక దగ్గర ఉన్న కలెక్టర్ దగ్గరికి వచ్చి గ్రామ ప్రజలకు జవాబు చెప్పాలని కలెక్టర్‌ను తీసుకెళ్లాడు. కలెక్టర్ వారి దగ్గరకు వెళ్లటంతోనే వారిని కనీసం మాట్లాడకుండా నలువైపుల నుండి ప్రజలు తోసుకొని వచ్చి కలెక్టర్‌పై దాడికి పూనుకోవటం.. వారు వెళ్లి వాహనంలో కూర్చునే లోపే రాళ్లు, కర్రలతో వాహనంపై దాడిచేసి ముందు వెనుక అద్దాలు ధ్వంసం చేయటం, క్షణాల్లో జరిగిపోయింది. రెండవ వైపు వారి వెంట ఉన్న వాహనాలను ధ్వంసం చేసినారు. దీన్నిబట్టి చూస్తుంటే కొంతమంది యువకులు పథకం ప్రకారమే ఉద్రేకాన్ని రెచ్చగొట్టినట్టుగా ఉంది. ఈ సంఘటనలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గానే తీసుకున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ ఘటనపై రాష్ట్రంలో ఉన్న ప్రధాన ప్రతిపక్షం ఈ దాడులు జరగటాన్ని ఖండించగపోగా రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడటం శోచనీయం.

ఈ సంఘటనపై పోలీసుల వైఫల్యం ఉన్నదని ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టరు ఎందుకు వారి దగ్గరికి వెళ్లిండని ఆరోపిస్తున్నారు. దీనిపై ఐజి పోలీస్ కలెక్టర్‌పై దాడులలో కుట్రకోణం దాగి ఉందని, దానికి బాధ్యులైనవారిని చాలామందిని గుర్తించి అరెస్టు చేశామని, అందుకు ప్రోత్సహించి ప్రేరేపించినట్లు విచారణలో తేలిన బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యేను అరెస్టుచేసినట్లు ఐజి పోలీస్ తెలిపారు.

దీనిపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందిస్తూ ప్రధాన నిందితుడు...మాపార్టీ వాడేనని భూములు కోల్పోతున్న రైతులు కడుపు మండి దాడి చేసినారు. దీన్నిబట్టి చూస్తుంటే ప్రజల తరఫున పోరాడాల్సిన ప్రతిపక్షం, ప్రజల జీవితాలతో ఆడుకోవడం దురదృష్టకర పరిణామం.

గత పది ఏళ్ల రాష్ట్ర పాలనలో అధికారంలో ఉంటూ ఆ కాలంలో ప్రభుత్వ అవసరాల కోసం, ప్రాజెక్టుల కోసం, పరిశ్రమల కోసం వేలాది ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఉదాహరణకు కాళేశ్వరం ప్రాజెక్టు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులకు వేలాది ఎకరాలను రైతులనుండి బలవంతంగా లాక్కొని వారి హయాం ముగిసేనాటికి కూడా సగానికిపైగా రైతులకు నష్టపరిహారం చెల్లించలేదు. ఆ సందర్భంలో భూములు కోల్పోతున్న రైతులు భూములు ఇచ్చేది లేదని నిరసనలు, రోజులు, నెలల తరబడి నిరాహార దీక్షలు, కొన్నిచోట్ల రాస్తారోకోలు, బంద్‌లు నిర్వహించారు. ఏ ఒక్కచోట కూడా ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులపైన గాని, భూములు సర్వేకు వచ్చిన సిబ్బందిపైన గాని దాడులు జరగలేదు. గతంలో అధికారంలో ఉండి ధర్నాలు, నిరసనలకు అనుమతులివ్వనివారే.... ఈనాటి ప్రభుత్వం ధర్నాలకు, నిరసనలు జరుపుకునే స్వేచ్ఛ ఇచ్చింది. అటువంటి అవకాశం ఉన్నప్పటికీ కొంతమందిని రెచ్చగొట్టి (ఇందులో సంఘవిద్రోహులు ఉన్నట్లు) రాళ్లు కర్రలతో అధికారులు వచ్చిన వాహనాలపై దాడులు చేయటం, అధికారులపై పిడిగుద్దులు గుద్దటం, అధికారులు పరిగెత్తుతుంటే వెంటబడి తరుముకుంటూ కొడుతున్న దృశ్యాలు జుగుప్సాకరంగా ఉన్నవి.

ప్రతిపక్ష పార్టీల బాధ్యత.. అధికారపక్ష తప్పిదాలను నిలదీయడం.. ఎండగట్టటం.. ప్రజలను సమీకరించి నిరసనలు, ఆందోళనలు చేయించవచ్చు. అందులో ఎలాంటి అనుమానం లేదు. కానీ చట్టం ప్రకారం చేయాల్సిన బాధ్యతలను విడనాడి.. దాడులే మా బాధ్యత అన్నట్టు.. అడ్డదారి రాజకీయాలను ఆశ్రయిస్తూన్న తీరే జుగుప్సాకరంగా కనిపిస్తుంది.

లగచర్ల ఘటనను అందరూ ఖండించాల్సిందే. దానికి పాల్పడిన కుట్రదారులు, సూత్రధారులు, పాత్రధారులు ఎవరనే దానిపై సమగ్ర విచారణ చేపడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. లగచర్ల ఘటన వెనుక ఎవరున్నా శిక్షించాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల జెఎసి డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరెట్ల వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నారు.

**ప్రభుత్వ నిర్ణయాలు అమలు చేయు బాధ్యత అధికారులదే**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కొరకు తీసుకునే నిర్ణయాలను క్రింది స్థాయి వరకు వెళ్లి అమలు చేయుటలో ప్రభుత్వ ఉద్యోగులది కీలకపాత్ర. అభివృద్ధిలో భాగంగానే పరిశ్రమలకు, ప్రాజెక్టులకు, రైల్వేలైన్స్, రహదారులు, రవాణ తదితర విభాగాలకు భూసేకరణ చేయటం పరిపాటి. అటువంటి సందర్భంలో సేకరించాల్సిన భూములు. కోల్పోతున్న రైతులకు తగిన విధంగా నష్టపరిహారంతో పాటు ఆల్టర్నేట్‌గా మరికొన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. కేంద్ర భూ సేకరణ చట్టం 2013లోనే విధివిధానాలతో పాటు.. తగిన విధంగా నష్టపరిహారాన్ని అందించాల్సి ఉన్నదని చట్టంలోనే పొందుపరిచినారు.


**"లగచర్ల ఘటనలు దురదృష్టకరం"**

రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ ఫార్మా గ్రీన్ విలేజ్‌లకు 2 వేల ఎకరాలు భూ సేకరణ చేపట్టాలని నిర్ణయించింది. అందుకు ఒకే జిల్లాలో గాకుండా తొమ్మిది జిల్లాలలో 10 ఫార్మా విలేజ్‌లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఒక్కొక్క విలేజి 1000 నుండి 2000 ఎకరాలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించి, మొదట వికారాబాద్, నల్లగొండ, మెదక్ జిల్లాలలో మూడు ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు భూసేకరణ మూడు జిల్లాలలో ప్రక్రియను ప్రారంభించింది.

గత ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల గ్రామ పరిసరాలలో దాదాపు 20,000 ఎకరాలలో హైదరాబాద్ ఫార్మా సిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దానికోసం భూసేకరణ కూడా పూర్తి చేసింది. అయితే ఫార్మా కంపెనీలు కాలుష్యంపై స్థానికులు, రైతుల నుంచి పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం అయింది. భూసేకరణకు రైతులు సహకరించకపోవడం, కొంతమంది రైతులు హైకోర్టుకు వెళ్లి భూ సేకరణ నిలుపుదల చేసినారు. కొంతమంది ప్రస్తుతం మార్కెట్ రేటు కంటే ఎక్కువ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా రు. అయితే భూ సేకరణకు సంబంధించిన కొన్నిచోట్ల కోర్టులో కేసు లు ఉండటంతో ఫార్మాసిటీ గత నాలుగు సం.లుగా జాప్యం జరుగుతు వచ్చింది. ఈ క్రమంలో కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం హైదరాబాద్ ఫార్మసిటీ ప్రాజెక్టు భూములపై కోర్టులో కేసులు, పొల్యూషన్‌పై గతంలో జరిగిన ఆందోళనల నేపథ్యంలో రద్దు చేసింది. అయితే హైదరాబాదుకు సమీపంలో కాకుండా కొంచెం దూరంలో అన్ని వసతులతో ఫార్మా విలేజిలు ఏర్పాటు చేసేటందుకు అందులో అన్ని వసతులు కల్పించేందుకు ఈ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది.

# 'పత్రికా స్వేచ్ఛ' ప్రజాస్వామ్య పరిరక్షణకు బలమైన రక్షణ

పత్రికా స్వేచ్ఛ ప్రజాస్వామ్య వ్యవస్థలో బలమైన రక్షణ. అది ప్రభుత్వాన్ని సమీక్షించే సామర్థ్యాన్ని కల్పిస్తుంది. అవినీతి, దుర్వినియోగం వంటి విషయాలను బయట పెట్టడంలో పాత్రికేయుల పాత్ర కీలకం. స్వేచ్ఛగా పనిచేసే, సత్యాన్ని తెలియజేసే మీడియా సమాజాభివృద్ధికి తోడ్పడుతుంది. భారతదేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 16వ తేదీన జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకుంటారు. 1956లో భారత తొలి ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966 నవంబర్ 16 వ తేదిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం నవంబర్ 16వ తేదీన జాతీయ పత్రికా(నేషనల్ ప్రెస్ డే) దినోత్సవాన్ని జరుపుకుంటారు.




**పత్రికా స్వేచ్ఛ అంటే ఏమిటి?**

పత్రికా స్వేచ్ఛ అంటే పత్రికలు, మీడియా సంస్థలు ఎలాంటి పరిమితులు లేకుండా నిజమైన సమాచారం, వాస్తవాలను ప్రజలకు చేరవేయగలగడం. ఇది ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన మూలస్తంభంగా భావిస్తారు. ఇది ప్రజలకు సమగ్ర సమాచారం అందించే హక్కును కూడా కల్పిస్తుంది.

**ప్రజాస్వామ్య పనితీరుకు కొలమానం**

ఒకదేశంలో ప్రజాస్వామ్యం సక్రమంగా పని చేస్తున్నదీ, లేనిదీ తెలుసుకోవాలంటే ఆ దేశంలో పత్రికారంగాన్ని పరిశీలిస్తే చాలు. పత్రికా రంగం మీద ఎటువంటి ఆంక్షలు లేకుండా పత్రికా స్వాతంత్ర్యం అమలవుతుంటే ఆ దేశంలో ప్రజాస్వామ్య పాలనకు, చట్టబద్ధ పాలనకు ఢోకా లేనట్టే.

**పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడంలో పాత్రికేయుల కృషి** : పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం అంటే కేవలం మీడియా సంస్థలు, ప్రభుత్వాలు మాత్రమే కాకుండా, పాత్రికేయులు కూడా తమ ప్రాణాల కు భయపడకుండా, ధైర్యంగా తమ విధి నిర్వహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో మీడియా సంస్థలు తమ స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా ప్రజలకు నిజాయితీగా సమాచారా న్ని అందించాలి.

**ఫోర్త్ ఎస్టేట్** : ప్రభుత్వానికి ఉండే మూడు అంగాల (లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్, జుడిషియరీ) తో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థ ఆరోగ్యానికి అత్యావశ్యకమైనది పత్రికాస్వేచ్ఛ. అందుకే పత్రికలను నాల్గవ అంగంగా, నాలుగవ స్తంభంగా, ఫోర్త్ ఎస్టేట్‌గా పేర్కొన్నారు. ఫోర్త్ ఎస్టేట్ అంటే పత్రికలు లేదా ప్రసార మాధ్యమాలు.

**పత్రికా స్వేచ్ఛకు ఎదురవుతున్న సవాళ్లు**

ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛకు వివిధ రకాల సవాళ్ళు ఎదురవుతున్నాయి. కొన్ని దేశాలలో మీడియాపై ప్రభుత్వం నుంచి ఒత్తిడి ఉండడం, వారిపై అణిచివేత చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అంతేకాకుండా, కొన్నిసార్లు రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, నేరస్థులు కూడా పాత్రికేయులను బెదిరించడం, దాడులు చేయడం జరుగుతుంది. దీనివల్ల పాత్రికేయులు భయంతో, స్వేచ్ఛగా తమ వృత్తి నిర్వహించలేక పోతున్నారు. రాజకీయాలలోనూ, పరిపాలనలోనూ స్వచ్ఛత విలసిల్లడానికీ, పరుగెత్తేకాలంతో సమాంతరంగా ప్రజల ముంగిటికి వార్తలు అందించే విలేకరులు ప్రతిదినం ఎన్నో దాడులను, బెదిరింపులను ఎదుర్కొంటున్నారు. కొందరు జైళ్ల పాలవుతున్నారు, మరికొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. సమాజానికి ఒక దిక్సూచి పాత్రికేయరంగం. సమాజ పునర్నిర్మాణం లక్ష్యంగా పాత్రికేయులు ముందుకు వెళ్ళాలి.

**(నవంబర్ 16 జాతీయ పత్రికా దినోత్సవం)**

పిన్నింటి బాలాజీ రావు, 9866776286

# అహింసకు మరో రూపమే 'సహనం'

సహృదయుల్లో కనిపించే ప్రధాన సుగుణాల్లో సహనశీలత ఒకటి. అహింసకు ప్రతిరూపం సహనగుణమే. ఇతరుల సంస్కృతి, వారసత్వం, జీవనసరళి, వైవిధ్యత, ఆచారవ్యవహారాలు, భావప్రకటన స్వేచ్ఛలను గౌరవించడం, విభేధాలను సానుకూలతతో అంగీకరించడం, ప్రశంసించడం మన నిత్య జీవన విధానం కావాలి. విశ్వ మానవాళి జీవన సరళి సహజంగానే వైవిధ్యభరితం, విలక్షణం. అయినప్పటికీ వారిని శాంతి సామరస్యాలతో కట్టి ఉంచే దారమే సహనగుణ సంపద అని గమనించాలి. మానవ సమాజ ఏకీకరణకు, ప్రశాంత జీవన విధానాలు కొనసాగడానికి సహనం అనే గుణం ప్రధానమైనదని అంగీకరించిన ఐరాస 1995ఏడాదిని అంతర్జాతీయ సహన సంవత్సరం (ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ టాలరెన్స్)గా పాటించడం, దానికి కొనసాగింపుగా 1996 నుంచి 16 నవంబర్ రోజున అంతర్జాతీయ సహన దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ టాలరెన్స్)గా పాటించడం ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ సహన దినం వేదికగా సహనశీలత ప్రాధాన్యాన్ని వివరించడం, ఓపికను ప్రదర్శించడం, సామాజిక సామరస్యతను పాటించడం, ఇతరుల అభిప్రాయాలు/జీవన విధానాలను గౌరవించడం, సోదర భావాన్ని జాగృత పరచడం, సహనశీలత కేంద్రంగా చర్చలు/విద్యార్థులకు పోటీలు/సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం లాంటి పలు ఆలోచనలను కార్యరూపంలోకి తేవచ్చు. అంగీకారం, సహనం, క్షమాగుణం, కరుణ, దయ, పరస్పర గౌరవాలు మానవ జీవితాన్ని సుసంపన్నం చేస్తాయని నమ్మడం మన కనీస కర్తవ్యం.

**(16 నవంబర్ అంతర్జాతీయ సహన దినోత్సవం)**

# 30 వసంతాలలో మాలమాదిగలు సాధించింది ఏమిటి?

1994లో మాలలకు వ్యతిరేకంగా అగ్రకులాలకు అనుకూలంగా మొదలైన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మొత్తం దళితులను, రాజ్యాధికారాన్ని దూరంచేసింది. దీనివల్ల ఎమ్మార్పీఎస్ నాయకులు, మాల నాయకులు కొంతమంది మాత్రమే ఆర్థికంగా లబ్ది పొందారు. మిగతా దళితులందరూ రోజురోజుకు ఒకరిపై ఒకరు ధర్మయుద్ధం అని, ఒకరు సింహ గర్జనని, మరొకరు తిట్టుకోవడానికి మాత్రమే బహిరంగ సభలోమాట్లాడుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. ఇకపోతే ఎంఆర్‌పిఎస్‌కు జీవం పోసింది అగ్రకులాలయితే దాన్ని సృష్టికర్తల్లో మాజీ విప్లవకారులు పీపుల్స్ వార్ గ్రూపు వ్యవస్థాపకులు కెజి సత్యమూర్తి లాంటివారు గద్దరు గోరేటి వెంకన్న, మల్లేపల్లి లక్ష్మయ్య.. నేడు మాల మహానాడు పేరుతో కొనసాగుతు న్న అద్దంకి దయాకర్ అలియాస్ డేవిడ్. ఈయన ఏకంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సభలో ప్రకాశం జిల్లాకు వెళ్లి వర్గీకరణ కావాల్సిందే అని మాట్లాడడం ఎంఆర్‌పిఎస్‌కు మందకృష్ణ లాంటి విభజన వాదులకు కలిసి వచ్చింది. దళిత ప్రజల ఐక్యతకు ప్రమాదం గా మారింది. దీనికి మరో ప్రధాన కారణం దళిత ప్రజలు జాతీయ కాంగ్రెస్ వైపు ఉన్నారని ఎలాగైనా విడదీస్తే తమకు అధికారం వస్తుంది అని అనాటి పాలకులు ఈ విభజన వాదాన్ని పెంచి పోసించారు. కానీ మాల మహానాడు వ్యవస్థ అధ్యక్షులు పి వి రావ్ గారు అనేక సార్లు బహిరంగంగా మందకృష్ణ, ఆర్ కృష్ణయ్యతో మాట్లాడారు.

గతంలో ఎస్సి కులాలల్లో ఒకరి మీద దాడి జరిగితే మిగతా కులాలు కలిసి వచ్చి ఒకర్ని మరొకరు కాపాడుకునేవారు. ఒకరి ఉద్యోగంలో సమస్య ఉంటే మరో ఉద్యోగ సంఘంలో ఉన్నాసరే తోటి అంటరాని ఉదోగస్తునికి అండగా ఉండేవారు. నేడు ఆ పరిస్థితి మారిపోయింది. ఒకాయన మరో అంబేద్కర్ అని మరో మనువాదిని పొగుడుతూ తన రాజకీయ పదవిని కాపాడుకుంటున్నారు. 15 సం. లు ఒక మాజీ ముఖ్యమంత్రి కొడుకు ప్రజల్లోకి వెళ్లి ముఖ్యమంత్రి కాగలిగాడు. ఆయన చెల్లెలు ఒక పార్టీ పెట్టి ఆ తర్వాత జాతీయ కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అధ్యక్షురాలు అయింది. తెలంగాణ ఉద్యమాన్ని మొదలుపెట్టిన విప్లవకార్లు సామాజిక ఉద్యమకారులు బహుజన వాదులు. అయితే దీని ఆధారం చేసుకొని తెలంగాణలో ఒక రాజకీయ నాయకుడు రెండు సార్లు ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పాలించాడు. కానీ దేశాన్ని మొత్తం అమ్మేసిన తర్వాత విద్య, వైద్య రంగాలు, పారిశ్రామిక, డిఫెన్స్ రంగం కూడా గుజరాత్ పరమైన సందర్భంలో అంటరానితనాన్ని ఏ విధంగా పంచుకోవాలని మాదిగ సోదరులు అనుకుంటున్నారు. బిజెపికి అనుకూలమైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తీర్పునివ్వడం చాలా దుర్మార్గం. అగ్రకుల యువతను రాజకీయ అధికారం వైపు వెళ్లకుండా ఏమీలేని దగ్గర అడుక్కోవడానికి మన సంఘాలు పరిమితం అయ్యాయి తప్ప ఏనాడూ మనకన్నా అత్యంత తక్కువగా ఉన్న కులాలు మనల్ని పాలిస్తుంటే మనం ఇంకా కేవలం ఓటర్లుగా మాత్రమే మిగిలిపోయాం. ముప్పై యేండ్ల వర్గీకరణ అనుకూల వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలు సాధించినది ఒట్టి సున్న.

పబ్బతి శ్రీకృష్ణ, 955411328

# 44 శాతం సర్వే పూర్తి

**ఇంటింటి కుటుంబ సర్వే దేశానికి ఆదర్శంగా ఉండాలి**
**సిఎం రేవంత్‌రెడ్డి**



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** 'రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నాటికి 5, 24 ,542 ఇళ్లలో (44.1 శాతం) సర్వే పూర్తయింది. ఈ సర్వేలో 87, 807 మంది సిబ్బంది, 8788 పర్యవేక్షక అధికారులు పాల్గొంటున్నారు. 52, 493 గ్రామీణ, 40, 901 అర్బన్ బ్లాకులుగా మొత్తం 92,901 బ్లాకులుగా విభజించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతోంది. ఈ సర్వే ప్రక్రియను పర్యవేక్షించడానికి సీనియర్ ఐఎఎస్ అధికారులను ఉమ్మడి జిల్లాల వారీగా నియమించామని, క్షేత్ర స్థాయిలో ఈ సీనియర్ అధికారులు కూడా పర్యటిస్తున్నారు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అధికారులు వివరించారు. శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతున్న తీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇఎం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వేను దేశానికే ఆదర్శవంతంగా అయ్యేవిధంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నవంబర్ 6 వతేదీన ప్రారంభమైన ఈ సర్వేను జాప్యం లేకుండా నిర్దేసించిన కాలపరిమితిలో సకాలంలో పూర్తి చేయడానికి కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశలో నిర్వహించిన నివాసాల లిస్టింగ్‌లో మొత్తం 1,16,14,349 ఇళ్లకు మార్కింగ్ చేయడమైనదని, ఈ ఇళ్లల్లో ఏ ఒక్క ఇల్లును కూడా వదలకుండా ప్రతీ ఇంటిలో సమగ్రంగా సర్వేను నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే పత్రంలో పేర్కొన్న 56 ప్రశ్నలు,19 ఉప ప్రశ్నలు మొత్తం 75 ప్రశ్నలు రాష్ట్ర పౌరుల అభ్యున్నతికే సేకరించడం జరుగుతుందని, ఈ సర్వేను రాష్ట్ర గవర్నర్ వివరాలతో ప్రారంభించిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. ఇప్పటివరకు ఈ సర్వేలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని సర్వేకు కావలసిన వివరాలను కూడా ఉత్సాహంగా అందచేస్తున్నారని సమాచారం అందుతోందని వెల్లడించారు. సర్వేకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. సర్వే జరుగుతున్న తీరును రాష్ట్ర మరియు జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఆటంకం లేకుండా జరిగేవిధంగా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రధాన సెక్రటరీ శాంతి కుమారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా మరియు ఉన్నత అధికారులు, తదితరులు హాజరయ్యారు.

**మహారాష్ట్రలో రెండు రోజులు సిఎం పర్యటన**

మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారంలో రెండు రోజుల పాటు ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి 10 గంటలకు నాగ్‌పూర్‌కు చేరుకుంటారు. అక్కణ్నుంచి చంద్రాపూర్ లో అక్కడి నేతలతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం వరుసగా రాజురా, డిగ్రాస్, వార్ధా నియోజకవర్గాల్లో ప్రచార సభలు, రోడ్ షోలలో పాల్గొని రాత్రికి తిరిగి నాగ్‌పూర్ చేరుకుంటారు. ఆదివారం ఉదయం నాగ్‌పూర్ నుంచి నాందేడ్‌కు చేరుకుంటారు. నయగావ్, భోకర్, షోలాపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

# ట్రాఫిక్ పోలీసులపై విపరీతమైన ఒత్తిడి

**సిపి సివి ఆనంద్**

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో సైకిల్ ట్రాక్‌లు, ఫుట్ పాత్‌ల ఆక్రమణలపై పోలీసు కమిషనర్ సివి ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు మాఫియా తరహా చర్య అన్నారు. దీనివల్ల ట్రాఫిక్‌పై ప్రతికూల ప్రభావం పడుతోందని, అందువల్ల ఆపరేషన్ రోప్‌ను సీరియస్‌గా చేపట్టాలని తాను అధికారులకు సూచించానన్నారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు తమ వస్తువులను అమ్ముకుని జీవనం గడిపేందుకు సైకిల్ ట్రాక్‌లు ఫుట్ పాత్‌లను నిర్దాక్షిణ్యంగా ఆక్రమించుకుంటున్నారని, ఇటువంటి వాటిలో పేదరికం, జీవనోపాధి అంశాలను తీసుకురావొద్దని కోరారు. వీటిని క్లియర్ చేసే సమయంలో మా అధికారులు ప్రతి రోజు విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, అందువల్ల అధికారులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎక్స్ వేదికగా ఓ నెటిజన్ చేసిన పోస్టుకు చిలకలగూడ ట్రాఫిక్ పిఎస్ స్పందనపై సివి ఆనంద్ పై విధంగా స్పందించారు. ఆలుగడ్డ బావి నుంచి మెట్టుగూడ వెళ్లే మార్గంలో ఎడమవైపున కూరగాయల వ్యాపారులు, నర్సరీలు రోడ్డును ఆక్రమించుకుంటున్నారని, వీటిపై చర్యలు తీసుకోవాలని ఓ నెటిజన్ చేసిన పోస్టుకు చిలకలగూడ ట్రాఫిక్ పిఎస్ స్పందించింది. తాము క్రమం తప్పకుండా ఆపరేషన్ రోప్ నిర్వహిస్తున్నామని, నిబంధనలకు విరుద్ధమైన వాటిని తొలగించి చలాన్లు వేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ పోలీసుల చర్యను సివి ఆనంద్ ప్రశంసించారు. మీ పనిని కొనసాగించాలని, ఆ ప్రాంతాన్ని క్లీన్ గా ఉంచేందుకు అవసరమైన చోట జిహెచ్‌ఎంసి సహాయం తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ రోప్‌ను తొలుత చార్మినార్ ప్రాంతంలో ప్రారంభించాలని, అక్కడ హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విజయం సాధిస్తారా లేదో చూడాలనిఆ తర్వాత మరో ప్రాంతంలో విస్తరించాలని ఓ నెటిజన్ చేసిన కామెంట్‌కు సివి ఆనంద్ సెటైరికల్ రిప్లై ఇచ్చారు. 'ఇదిగో! ప్రతి దానిలో 'ఆ కోణాన్ని' తీసుకురండి' అంటూ స్మైలీ ఎమోజీతో రిప్లై ఇచ్చారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

**ధాన్యం, పత్తి పంట కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దు**
**సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి**
**రాష్ట్ర రెవెన్యూ శాఖ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం బైంసా పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, రెవెన్యూ, ఇంజనీరింగ్, మార్కెటింగ్, వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల భూ సమస్యలను త్వరితగతిన పరిశీలించి, పరిష్కరించాలని అధికారులను సూచించారు. జిల్లాలోని అటవీ, ప్రభుత్వ భూముల సర్వేను చేపట్టి, హద్దులను గుర్తించి సంరక్షించాలని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సర్వే నిర్వహించిన వివరాలను రికార్డు రూపంలో సమర్పించాలన్నారు. వరి ధాన్యం, పత్తి పంట కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతులు నష్టపోకుండా పంటల కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఏర్పాటుచేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు, సేకరించిన వరి ధాన్యం, పత్తి పంట రైతుల ఖాతాల్లో జమ చసిన డబ్బులకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

పంటలను అమ్మిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లాలో పంపిణీ చేసిన రెండు పడక గదుల ఇండ్లు, పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇండ్లుకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి నిర్వహణ తీరును అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

ఇప్పటివరకు జిల్లాలో నిర్వహించిన సర్వేకు సంబంధించి వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన వారికి ఇండ్లను అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బైంసా పట్టణంలోని జిన్నింగ్‌మిల్‌ని సందర్శించి, పంటను అమ్ముకునేందుకు వచ్చిన రైతులు, నష్టపోకుండా పంట నాణ్యత, తేమశాతానికి సంబంధించి వివరాలను తెలిపి అధిక లాభాలు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నిర్మల్, బైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్ రెడ్డి, మార్కెటింగ్ ఎడి శ్రీనివాస్, డిఎస్‌ఓ కిరణ్ కుమార్, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు అశోక్ కుమార్, తహసిల్దార్ ప్రవీణ్,అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# మొదటి అర్ధ భాగంలో సింగరేణి అదుర్స్

**గతేడాదితో పోల్చితే వెయ్యి కోట్ల కన్నా ఎక్కువ స్థూల లాభం, 36 శాతం వృద్ధి**
**ఆర్థిక క్రమశిక్షణతో పెరిగిన లాభాలు**
**వార్షిక లక్ష్య సాధన దిశగా వడివడిగా ముందుకు**



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** తీవ్ర వర్ష ప్రభావాన్ని అధిగమిస్తూ తన వినియోగదారులకు తగినంత బొగ్గును సరఫరా చేస్తూ సింగరేణి సంస్థ గడచిన ఏడు నెలల కాలంలో గతేడాదితో పోల్చితే వెయ్యి కోట్ల కన్నా ఎక్కువ లాభం గడించి ముందుకు దూసుకుపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగంలో భారీ వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి కొన్ని అవాంతరాలు ఏర్పడినప్పటికీ.. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఇప్పుడు మళ్లీ ఉత్పత్తి రథం వేగంగా కదులుతోంది. సంస్థ ఛైర్మన్ ఎండి ఎన్.బలరామ్ ప్రతిరోజు అన్ని ఏరియాలతో ఉత్పత్తి పై ప్రత్యేకంగా సమీక్షిస్తూ, అవాంతరాలను అధిగమించేందుకు రోజువారీగా దిశా నిర్దేశం చేస్తూ లక్ష్యాల సాధన దిశగా అన్ని శాఖలను సమాయత్తం చేస్తున్నారు. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా, ఓవర్ బర్డెన్ తొలగింపులో గణనీయమైన వృద్ధి కనిపిస్తోంది. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ వార్షిక ఉత్పత్తి లక్ష్యం 720 లక్షల టన్నులను సాధించాలని సింగరేణి వ్యాప్త అధికార యంత్రాంగం సమాయత్తమై పనిచేస్తుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు బొగ్గు అమ్మకం ద్వారా రూ.17151 కోట్లు, విద్యుత్ అమ్మకాల ద్వారా రూ.2286 కోట్ల టర్నోవర్ను నమోదు చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు బొగ్గు, థర్మల్ విద్యుత్ అమ్మకాల ద్వారా పన్ను చెల్లింపునకు ముందు రూ.4 వేల కోట్ల స్థూల లాభాన్ని కంపెనీ ఆర్జించింది. గతేడాది ఇదే సమయానికి ఆర్జించిన రూ.2932 కోట్ల మీద ఇది 1072 కోట్లు అదనం కావడం విశేషం. మొత్తమ్మీద గతేడాదితో పోల్చితే స్థూల లాభంపై 36 శాతం వృద్ధి నమోదైంది.

**ఆత్మ విశ్వాసం, ఉత్సాహం నింపిన ప్రభుత్వ ప్రోత్సాహం**

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఇటీవలనే సింగరేణి చరిత్రలోనే అత్యధిక లాభాల వాటా 796 కోట్ల రూపాయలను ప్రకటించి చెల్లించేలా ఆదేశాలివ్వడం, అలాగే దీపావళి బోనస్ 358 కోట్ల రూపాయల చెల్లింపుతో పాటు కార్మికుల రక్షణకు సింగరేణి ప్రత్యేక చొరవ చూపడం కూడా కార్మిక శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించింది. ఈ క్రమంలో ఈ లాభాలు సాధ్యమయ్యాయి.

## 12 ఏళ్ల బాలికను బలిగొన్న గుండెపోటు



**ప్రజాపక్షం/ చెన్నూర్ :** మంచిర్యాల జిల్లాలో ఓ 12 ఏళ్ల బాలిక ప్రాణాలు మింగేసింది గుండెపోటు. దీంతో చెన్నూర్ పట్టణంలో పండుగ పూట విషాదం నెలకొంది. పట్టణంలోని పద్మనగర్ కాలనీకి చెందిన నివృతి (12) అనే చిన్నారి ఉదయం ఇంట్లో ఆడుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన నివృతిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. చిన్నారిని పరీక్షించిన వైద్యులు నివృతి అప్పటికే మృతి చెందినట్లుగా ధృవీకరించారు. గుండె పోటు కారణంగా మృతి చెందినట్టు ప్రాథమికంగా గుర్తించారు. గుండెపోటు 12 ఏళ్ల చిన్నారిని పొట్టన పెట్టుకుందని కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. తమ గారాల పట్టి చిన్న వయసులోనే అనంత లోకాలకు వెళ్లిందంటూ ఆ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.చెన్నూర్ పద్మనగర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్, రమ దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు. నివృత్తి మొదటి సంతానం. చెన్నూర్ పట్టణంలోని స్థానిక పాఠశాలలో పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. కార్తీక పౌర్ణమి కావడంతో పాఠశాలకు సెలవు ఇచ్చారు. పండుగ పనుల్లో నిమగ్నమైన చిన్నారి ఒక్కసారిగా కుప్పకూలి చనిపోవడం అందరిని కలచివేసింది. నివృతి మరణ వార్త విన్న పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు కన్నీళ్లతో నివృతికి నివాళులర్పించారు.

# రెండు కేసుల్లో 21.45 కిలోల గంజాయి పట్టివేత

**13 మందిపై కేసు నమోదు .. ఐదు గురు అరెస్టు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైలులో ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు జరుగుతున్న గంజాయి స్మగ్లింగ్ దందాకు ఎక్సైజ్ అధికారులు చెక్‌పెట్టారు. శుక్రవారం హైదరాబాద్‌లో రెండు చోట్ల గంజాయిని పట్టుకుని ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి 21.45 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో 13 మంది నిందితులు పరారీలో ఉన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ టిఎఫ్ పోలీసులు శుక్రవారం మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేయగం ఈ ఉదంతం వెలుగు చూసింది. ఈ క్రమంలోనే ఒరిస్సా నుంచి వచ్చి మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్‌లో దిగిన రాజమండ్రికి చెందిన ఎస్‌కె అహ్మమద్ అలీని పట్టుకున్నారు. ఆతడి వద్ద ఉన్న 17.22 కెజిల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దూల్‌పేట్‌కు చెందిన రాహుల్ సింగ్‌కు ఇవ్వడానికి తీసుకువచ్చినట్లు విచారణలో అహ్మమద్ అలీ అంగీకరించాడు.ఒరిస్సాకు చెందిన పాండు అలియాస్ పవిత్ర నాయక్ దూల్‌పేట్‌కు చెందిన రాహుల్ సింగ్‌కు గంజాయి పంపిస్తాడని నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ టి ఎఫ్ సిఐ ఎంపిఆర్ చంద్రశేఖర్ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదదు చేశారు.

**మరో కేసులో..** అప్పర్ దూల్‌పేట్ హాజారీ హోటల్ సమీపంలో ఎస్ టి ఎఫ్ , ఎక్సైజ్ అధికారులు కలిపి శక్రవారం ఉదయం నిర్వహించిన రూట్ వాచ్‌లో నలురుగు నిందితుల వద్ద 4.238 కేజీల గంజాయిని పట్టుకున్నారు. గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు నిర్వహించిన రూట్ వాచ్‌లో భాగంగా గంజాయితో పట్టుబడిన నలుగురిని విచారించగా మరో ఎనిమిది మందికి గంజాయి అమ్మకాలతో సంబంధాలు ఉన్నాయని నిందితులు వెల్లడించారు. గంజాయితో పట్టుబడిన వారిలో ఎడిగా గణేష్, రాహుల్ సింగ్, అంకిత్, లడ్డు సింగ్‌లు ఉన్నారు. పరారీలో యూసఫ్, చరణ్, శంకర్, అమన్ సింగ్, అదర్శసింగ్, ముఖేష్ సింగ్, ఎన్కె ఆహ్మమద్, సుమరాజ్ గులారీలు ఉన్నారు. రెండు చోట్ల గంజాయిని పట్టుకున్న వారిలో ఎస్‌టిఎఫ్ టీమ్ లీడర్ నంద్యాల అంజి రెడ్డి, దూల్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్ సిఐలు మధుబాబు, గోపాల్, ఎస్ టి ఎఫ్ సీఐలు మధు , ఎంపిఆర్ చంద్రశేఖర్, ఎస్‌ఐలు సాయి కిరణ్,, భరత్కుమార్, భాస్కరెడ్డి అజీమ్, శ్రీధార్ హెడ్ కానిస్టేబుళ్లు కానిస్టేబుళ్లు ప్రకాష, రాకేష్, మహేష్ ఉన్నారు. గంజాయిని పట్టుకున్న అధిఆకరులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

# ఆటోమొబైల్ రవాణాను ప్రారంభించిన ద.మ రైల్వే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ డివిజన్‌లో ఆటోమొబైల్ రవాణాను దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది. హైదరాబాద్ డివిజన్ పరిధిలోని బాలానగర్ స్టేషన్ నుండి ఉత్తర రైల్వేజోన్ , ఢిల్లీలోని బిజ్వాసన్ స్టేషన్ల వరకు 1,770 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేసే ఎన్ఎమ్‌జి రేక్‌లపై ఎలక్ట్రిక్ ఆటోలు రవాణా చేయనున్నారు. తద్వారా దక్షిణ మధ్య రైల్వేకు రూ17.5లక్షల ఆదాయం చేకూరుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అనిరుధ్ పామర్ హైదరాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషనల్ మేనేజర్ వి.విద్యాధర్, బాలానగర్ రైల్వే స్టేషన్‌ను సందర్శించి లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. కాగా దక్షిణ మధ్య రైల్వే ఇటీవలి సంవత్సరాలలో సరుకు రవాణాను మెరుగుపరచడానికి అనేక కార్యక్రమాలను చేపడుతోంది. సరుకు రవాణాను బలోపేతం చేయడానికి, సరుకు రవాణా వినియోగదారులను ఆకర్షించేందుకు విస్తృతమైన మార్కెటింగ్ ప్రయత్నాలను చేపట్టడానికి జోన్‌లోని ఆరు డివిజన్లలో వ్యాపార అభివృద్ధి యూనిట్లు(బి. డి. యూ)కూడా ఏర్పాటు చేశారు. తదనుగుణంగా జడ్చర్లలోని రాజాపూర్ గ్రామంలో ప్లాంట్‌ను కలిగి ఉన్న కె.ఈ.టి.ఓ మోటార్లు అక్కడికి సమీపంలోని బాలానగర్ స్టేషన్ నుండి ఆటోమొబైల్స్ రవాణా చేసేందుకు ముందుకు వచ్చాయి. అదే సరుకు రవాణాదారుడు బాలానగర్ రైల్వే స్టేషన్ నుండి మరో 6 నుండి 7 రేక్‌ల ఆటోమొబైల్ ట్రాఫిక్‌ను లోడ్ చేయాలని ఆశిస్తున్నారు. సవరించిన ప్రయాణీకుల కోచ్‌లను ఎన్.ఎమ్.జి రేక్‌లుగా మార్చి వాటిద్వారా ప్రాథమికంగా కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్లు, స్కూటర్లు తేలికపాటి వాణిజ్య వాహనాలు రవాణా చేయడానికి ఉపయోగించనున్నారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సరుకు రవాణాను పెంపొందించడంలో హైదరాబాద్ డివిజన్ చేస్తున్న నిరంతర కృషిని అభినందించారు. ప్రస్తుతం ఉన్న సరుకు రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూనే, అదనంగా సరుకు రవాణా వ్యాపారాన్ని మరింతగా ఆకర్షించేందుకు జోన్ పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. డివిజన్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు ఇదే ప్రయత్నాన్ని కొనసాగించాలని సూచించారు.

## రాజ్యాంగేతర శక్తిగా తిరుపతిరెడ్డి

**తాము అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డిని ఏంచేయాలో తమకు తెలుసు**
**బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** తాము అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డిని ఏం చేయాలో తమకు తెలుసునని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్‌ఎస్ కార్యకర్తలు భయపడవద్దని ధైర్యం చెప్పారు. లగచర్ల ఘటనలో అరెస్టై సంగారెడ్డి జైల్లో ఉన్న వారితో ములాఖత్ అనంతరం ఆయన జైలు బయట మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తిరుపతి రెడ్డి ఫోన్‌లో ఆదేశాలిస్తుంటే అధికారులు పాటిస్తున్నారన్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి రాబందులా మారారని మండిపడ్డారు. గత ఫార్మా కంపెనీలను విమర్శించిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఫార్మా కంపెనీలు కావాలనిచెప్పడమే కాకుండా వేలాది ఎకరాలు కావాలంటున్నారని మండి పడ్డారు. లగచర్ల ఘటనలో కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారన్నారు. కేవలం బీఆర్‌ఎస్ కార్యకర్తలను మాత్రమే అరెస్ట్ చేశారని మండి పడ్డారు. తమ చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎద్దేవా చేశారు. ఈ ఘటనకు ముఖ్య మంత్రి కావాలనే రాజకీయ రంగు పులిమరన్నారు. . తన పదవి ఐదేళ్ల ఉంటుందని రేవంత్‌రెడ్డి గుర్తుపెట్టుకోవాలన్నారు. కొడంగల్ ను అల్లుడిఫార్మా కంపెనీకి రానివ్వాలని ముఖ్య మంత్రి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎకరం రూ. 60 లక్షల భూమిని రూ. 10 లక్షకే లాక్కును ప్రయత్నాలుచేస్తున్నారన్నారు.

## 16న నల్లగొండకు డెడికేటెడ్ కమిషన్

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** రాష్ట్రంలో స్థాని క సంస్థల వారిగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయమై ఉమ్మడి నల్గొండ జిల్లాలోని బిసి కుల సంఘాలు, ఇతర కుల సంఘాలు, ప్రజలు,సంస్థలు తదితరుల నుండి వ్యక్తిగత అభ్యర్థనలు, సమర్పణలు ,సలహాలు, ఆక్షేపణల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కు శనివారం డెడికేషన్ కమీషన్ నల్లగొండ జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.డెడికేషన్ కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు , సెక్రటరీ బి.సైదులు లు 16 న ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నల్లగొండ , యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు చెందిన బిసి కుల సంఘాలు, ఇతర కుల సంఘాలు, ప్రజలు,సంస్థలు తదితరుల నుండి స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయమై వ్యక్తిగత అభ్యర్థనలు, సమర్పణలు ,సలహాలు, ఆక్షేపణలను స్వీకరించడం ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారని తెలిపారు.

## నేడు మూడోసారి

# సాగర్ టూ శ్రీశైలం...



**ప్రజాపక్షం/నందికొండ :** నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం కు లాంచి యాత్రను తెలంగాణ టూరిజం దాదాపు రెండేళ్ల తర్వాత ఈనెల 2 న మొదటి యాత్ర 9 న రెండో యాత్రను దిగ్విజయంగా ముగించుకొని నేడు ముచ్చటగా మూడవ యాత్రకు సిద్ధమైంది మొదటి యాత్రకు ఆశించిన స్థాయిలో యాత్రికులు లేక యాత్రను కొంసాగించారు. ఆ తర్వాత భారీగా పబ్లిసిటీ జరగడంతో రెండు, మూడవ యాత్రకు భారీగా పబ్లిసిటీ రావడంతో రెండు రోజుల్లోనే టిక్కెట్లు ఫుల్ అయిపోయాయని తెలంగాణ టూరిజం శాఖ తెలియజేసింది.రెండేళ్ల తర్వాత రిజర్వాయర్ నిండుకుండలా మారి రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు చేరుకోవడంతో తెలంగాణ టూరిజం శ్రీశైలం యాత్రకు శ్రీకారం చుట్టారు.ఈ యాత్ర దట్టమైన నల్లమల అడవుల నడుమ కృష్ణవేణి తరంగాలపై లాంచీలో ప్రయాణం ఒక మధురమైన మధురానుభూతిని కలిగిస్తుంది నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు కృష్ణా నదిలో 120 కిలో మీటర్ల దూరం 6గంటల పాటు సాగే సుదీర్ఘ లాంచీ ప్రయాణం ఆనందాన్ని ఆహ్లాదాన్ని పంచిస్తోంది అనడంలో ఎటువంటి సందేహం లేదు తెలంగాణ పర్యాటక శాఖ అందుబాటులోకి తెచ్చిన ఈ యాత్ర నేడు ముచ్చటగా మూడవసారి పూర్తిస్థాయి పర్యాట కులతో సిద్ధమైంది. ఈ యాత్ర పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకోవడంతో సాగర్ వద్ద నేడు పర్యాటకుల సందడి నెలకొంది ప్రతి శనివా రం ఉదయం 9 గంటలకు నాగార్జునసాగర్ నుంచి లాంచీ బయలుదేరి శ్రీశైలానికి సాయం త్రం 3 గంటలకు చేరుకుంటుందని మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీశైలం నుంచి బయలుదేరి నాగార్జున సాగర్ కు సాయంత్రం 3గంటలకు చేరుకుంటుందని మేనేజర్ హరియా నా యక్ తెలిపారుఒకవైపు ప్రయాణానికైతే పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600, అని రాను పోను అయితే పెద్దలకు రూ.3, 000, చిన్న పిల్లలకు రూ.2,400 టికెట్ ధర నిర్ణయిం చామని ప్రయాణికులకు మధ్యాహ్న భోజన వసతి కల్పి స్తున్నామని లాంచీ దిగిన తర్వా త అక్కడ రవాణా, రాత్రి బస, వసతికి అయ్యే ఖర్చు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

## జగిత్యాల అపోలో ఫార్మసీలో

# గడువు ముగిసిన ఒఆర్ఎస్ పాకెట్

**కంప్యూటర్‌లో గడువు ఉండి, ఒఆర్ఎస్ పాకెట్‌పై గడువు ముగిసిన వైనం**

**ప్రజాపక్షం/ జగిత్యాల రూరల్ :** జగిత్యాల చుట్టు వైద్య పరంగా ముదు, నాలుగు జిల్లాల కు ముఖ్యకేంద్రంగా కొనసాగుతున్న జగిత్యాలలో నిత్యం వేళల్లో ప్రజలు అనారోగ్య బారిన పడి హాస్పిటల్స్, మందుల కోసం జగిత్యాల జి ల్లా కేంద్రానికి వచ్చి తీసుకునివెళ్తారు. అంతటి పేరున్న జగిత్యాల జిల్లా కేంద్రంలోని అపోలో ఫార్మసీలో గడువు ముగిసిన ఒఆర్ఎస్ పాకెట్ యువకుడికి ఇచ్చిన అపోలో ఫార్మసీ సిబ్బంది. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన యువకు డు గురువారం మధ్యాహ్నం సమయంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంగడి బజార్ మార్కండేయ కమాన్ ఎదురుగా ఉన్న అపోలో ఫార్మసీకి వెళ్లి మూడు ఒఆర్ఎస్ పాకెట్స్ తీసుకొని ఇంటికి వచ్చి చూసే సారికి అందులో ఒక ఒఆర్ఎస్ పాకెట్ గడువు ఆగస్టు నెలలో ముగి సి ఉండడంతో కంగుతిన్న యువకుడు అపో లో ఫార్మసీకి వెళ్లి ప్రశ్నించగా సదరు ఫార్మసీ సిబ్బంది మొదట ఆ ఒఆర్ఎస్ పాకెట్ వారి ఫార్మసీ లోనిది కాదని, యువకుడు అమౌంట్ ఫోన్ పే చేసినది చూపించగా చూసుకోకుండా ఇచ్చామని, కానీ సిస్టమ్‌లో గడువు ఉందని ఒఆర్ఎస్ పాకెట్‌పై గడువు ఎలా ముగిసిందని చెప్పి చేతులు దులుపుకున్నారని సదరు యువకుడు తెలిపాడు. జగిత్యాల అపోలో ఫార్మసీల సిస్టమ్స్‌లలో ఒక తేది ఒఆర్ఎస్ పాకెట్‌పై, మందుల మీద ఒకతేది ఉండడంతో అపోలో ఫార్మసీలో రెగ్యులర్ మందులు తీసుకొనే వారు అదోళన చెందుతున్నారు.

ఇంత దారుణంగా గడువు చూడకుండా అపోలో ఫార్మసీలో మం దులు కూడా ఇదే విధంగా ఇస్తారా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అపోలో ఫార్మసీలలో మందులు తీసుకుంటే బిల్ కూడా ఫార్మసీ సిబ్బంది అడిగేవరకు ఇవ్వరని స్థానికు లు చెప్తున్నారు. ఇకనైనా జగిత్యాల డ్రగ్ ఇన్స్పెక్ట ర్ జగిత్యాల అపోలో ఫార్మసీ, కార్పొరేట్‌కు సంబధించిన ఫార్మసీలలో తనిఖీలు నిర్వహిం చి గడువు ముగిసిన మందులు అమ్ముతున్నా కార్పొరేట్ ఫార్మసీలను సీజ్ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం ఆవిష్కరణకు

# మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి రాక

**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ప్రచురించిన నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం గంధ్రాన్ని ఈనెల 16వ తేదీ శనివారం ఉదయం నల్లగొండ పట్టణంలోని నాగార్జున (ఎన్‌జి)డిగ్రీ కళాశాలలో ఆవిష్కరించనున్నారు.తెలంగాణ 33 జిల్లాల చరిత్ర, సాహిత్యం, పర్యాటక ప్రదేశాలు, జాతరలు, పండుగలు, వైద్య ఆరోగ్య వ్యవసాయ పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి మొదలైన అంశాలపై తెలంగాణ సారస్వత పరిషత్తు వెలువరిస్తున్న దాదాపు 435 పేజీలకు పైగా ఉన్న సమగ్ర స్వరూప గంధ్రాన్ని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి గ్రంథాన్ని ఆవిష్కరించనున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం వైఎస్ ఛాన్సలర్ ఆచార్య సూర్య ధనుంజయ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ, సమాచార, పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు కన్నెకంటి వెంకటరమణ, నాగార్జున డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డా. వెల్దండి శ్రీధర్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శ్రీరంగాచార్యడాక్టర్ తండు కృష్ణ చైతన్య, డాక్టర్ బండారు సుజాత శేఖర్, పున్న అంజయ్య, డా. భిన్నూరి మనోహరి, డా.సాగర్ల సత్తయ్య లు అతిథులుగా హాజరవుతారు.

## రైతు బిడ్డకు గ్రూప్ 4 ఉద్యోగం



**ప్రజాపక్షం / ఊట్కూర్ :** మండల పరిధి లోని మొగ్దంపూర్ గ్రామానికి చెందిన వ్యవసాయ రైతు నర్సిములు శంకరమ్మల కూతురు శ్వేత గ్రూప్ 4 ఫలితాల్లో ఉద్యోగం సాధించడంతో శుక్రవారం గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నర్సింహ, అశోక్ , రాజు మాట్లాడుతూ ఇటీవలే తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 4 పరీక్షల్లో ముగ్దంపూర్ గ్రామానికి చెందిన శ్వేత , గ్రూప్ 4 పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగం సాధించడం చాలా సంతో,ంగా ఉందని వారు అన్నారు. రైతు బిడ్డకు గ్రూప్ 4 ఉద్యోగం రావడం ఆమెకు మహిళా అభివృద్ధి శిశు సంక్షేమలో స్టోర్ కిపర్ ఉద్యోగం సాధించినందుకు గ్రామస్తులు అభినందించారు. శ్వేత కోటి ఉమెన్స్ కాలేజ్‌లో బిఏ, ఉస్మానియా యూనివర్శిటీలో పీజీలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన శ్వేత సొంత జిల్లా అయిన నారాయణపేట జిల్లాలో ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు నారాయణ ఆంజనేయులుతో పాటు జలసాధన సమితి జిల్లా కో కన్వీనర్ నర్సింహ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



## రోడ్డు భద్రత పాటించాలి

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజ్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదని , సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందని , జాగ్రత్తగా వచ్చే వారి వాహనాలకు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగి అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్ వారికి సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు ఆంజనేయులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.



## కోటిలింగాల ప్రతిష్ఠతో పులకరించి పోయిన భక్తులు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజీ దగ్గర గల సుప్రసిద్దమైన శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్తదేవస్థానం దగ్గర నూతనంగా నిర్మించిన ధాన్యమందిరంలో కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా కోటిలింగాల ప్రతిష్టలో భక్తులు పులకరించి పోయారు. ఆదోనికి చెందిన వీరశైవ ఆగమ పాఠశాల విద్యార్థులచే రుద్రపఠనంతో భక్తులు భక్తి శ్రద్దలతో రుద్రహోమం చేయగా అర్చకులు వేదమంత్రాలతో పదకొండు వేల శివలింగాలు కలిగిన శివకోటి యంత్రాలకు రుద్రపఠనంతో సంకల్ప పూజలు చేయించి భక్తుల స్వహస్తాలతో పదకొండు వేల శివలింగాలు ప్రతిష్టింపజేశారు. ఈ సందర్భంగా వీరశైవ ఆగమ పాఠశాల అధ్యాపకులు మాట్లాడుతూ ఎన్నో జన్మల పుణ్యఫలం వలన మీకు ఈ లింగ ప్రతిష్ట చేసే భాగ్యం దక్కిందని దీని వల్ల మీ తరతరాల మీ వంశీకులందరు పుణితులౌతారని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ అన్నప్రసాద వితరణ చేశారు.

## బాక్సింగ్ పోటీలకు ఎంపిక



**ప్రజాపక్షం / కొత్తకోట :** మహబూబ్‌నగర్ జిల్లా అండర్ 14 అండర్ 17 బాక్సింగ్ ఎస్‌జిఎఫ్ఐ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలు మహబూబ్‌నగర్‌లోని మిని స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలకు గాడ్స్ ఆన్ బాక్సింగ్ అకాడమీకి చెందిన విద్యార్థి అండర్ 17 సంవత్సరాల 58 కేజీల విభాగంలో ఎస్కే బాబా ఆజ్మీర్ పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎస్‌జిఎఫ్ఐ ఉమ్మడి జిల్లా సెక్రెటరీ శారదాబాయి , సీనియర్ కోచ్ నర్సిములు, కరాటే మాస్టర్ అబ్దుల్ నబీ జాఫర్ సాదిక్ జి. హరీష్ యాదవ్ , ఇంతియాజ్ , అంజి , మంజునాథలు , కురుమూర్తి యాదవ్ , జి. పరమేష్ , అరవిందచారి, వడ్డే శివరాజ్ , సుమ , జహంగీర్ , అభినందించారు.



## దత్తాత్రేయను దర్శించుకున్న సివిల్ జడ్జి

**ప్రజాపక్షం / మక్తల్ :** మక్తల్ మండలం పసుపుల గ్రామం వల్లభాపురం శ్రీశ్రీశ్రీ దత్తాత్రేయ టెంపుల్‌ను నారాయణపేట జిల్లా సివిల్ జడ్జి దర్శించుకున్నారు. సీనియర్ టీఆర్ఎస్ నాయకులు , మాజీ ఎంపీపీని కలవడం జరిగింది. నారాయణపేట సివిల్ జడ్జిని , వనపర్తి సివిల్ జడ్జిని మాజీ టీఆర్ఎస్ ఎంపీపీ దత్తప్ప, శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 18న బిసి కమిషన్ చైర్మన్ పర్యటన

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** వెనకబడిన తరగతుల కులాల అభివృద్ధి, సామాజిక రాజకీయ,ఆర్థిక విశ్లేషణ చేసేందుకు రాష్ట్ర బిసి కమీషన్‌చైర్మన్ బి.నిరంజన్ నేతృత్వంలో ఈనెల18న మహబూబ్‌నగర్ కలెక్టరేట్లు సమావేశం కానున్నట్లు జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాప్రజలు బిసి కమీషన్‌చైర్మన్ నిరంజన్‌బృందం సభ్యులకు తమతమ అభిప్రాయాలను తెలియజేసేందుకు ఈనెల 18న సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి ఉదయం 10గంటలకు చేరుకోవాలని తెలిపారు. బిసి కమీషన్ సభ్యులు జిల్లాలోని వెనకబడిన తరగతులకులాలవారు అనగా ఎస్‌సి, ఎస్‌టి,బిసి,మైనార్టీ సంచారజాతులవారి సామాజిక, రాజకీయ, ఆర్థిక విశ్లేషణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

# ఘనంగా బిర్సా ముండా జయంతి వేడుకలు



**ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి :** స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనులు ఎంతో కీలక పాత్ర పోషించారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. శుక్రవారం ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బీహార్ లోని జముయి లో ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ఆయనకు నివాళుల ర్పించి, ఆయన పేరిట పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక కార్యక్రమం ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక్ష ప్రసారం ద్వారా వీక్షించిన రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు , జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి చత్రు నాయక్, ప్రత్యేక అధికారి గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఈ ఈఈ భాషా, జిల్లా పంచా యతీ అధికారి, జిల్లా అధికారులు జిల్లా వ్యాప్తం గా వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన ఆదివాసి నాయకులు మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌ల్లో..**

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం భగవాన్‌బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం దర్తీఅబాభగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా బీహార్‌లోని జాముయ్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోడి ఆయనకు నివాళులర్పించి ఆయనపేరిటపోస్టల్ స్టాంపును విడుదల చేశారు. ఈకార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం ద్వారా నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రత్యక్షప్రసారంద్వారా వీక్షించిన జిల్లా కలెక్టర్‌బదావత్ సంతోష్, జిల్లాగిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి రాంమోహన్‌రావు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సీతారాంనాయక్ జిల్లా వ్యాప్తంగా వివిధప్రాంతాలకు చెందిన గిరిజన ఆదివాసి నాయకులు, మహిళలు , విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ఆదివాసిల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు నిర్వహించి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్వహిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధిచెందాలని సూచించారు. వివిధ గిరిజన పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన నృత్యాలు ప్రతి ఒక్కరిని ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ, ఐటిడిఎ అధికారులు, సిబ్బంది, గిరిజనులు, ఆయా గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.



# మాలల సింహగర్జన కరపత్రాలు ఆవిష్కరణ



**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** డిసెంబర్ 1 జరిగే మాలల సింహ గర్జనను విజయవంతం చేయండి. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో చైర్మన్ మంత్రి నర్సింహ్మయ్య మహబూబ్ నగర్ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కోఆర్డినేటర్ కానుగడ్డ యాదయ్య అధ్యక్షతన స్థానిక అంబేద్కర్ కళాభవన్లో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో చైర్మన్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి నర్సింహ్మయ్య డిసెంబర్ 1 జరిగే మాలల సింహ గర్జన కరపత్రాలను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట రాష్ట్ర కో చైర్మన్ మంత్రి నర్సింహ్మయ్య మాట్లాడుతూ భారత దేశ అత్యున్నత న్యాయ స్థానమైన సుప్రీంకోర్టు ఆగస్టు 1 న ఇచ్చిన తీర్పును నిరసిస్తూ డిసెంబర్ 1 న పెరేడ్ గ్రౌండ్లో 10 లక్షల మందితో మాలల సింహ గర్జన చేపట్టామన్నారు. మాలల యొకక ఆత్మ గౌరవం కోసం తెలంగాణ రాష్ట్రంలో మాలలు లేరని తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టడం కోసం మాలల శక్తి ప్రదర్శిన చేయబోతున్నామన్నారు. మాలల సింహగర్జనను ఉద్యోగులు, విద్యార్థులు, కర్షకులు, కార్మికులు, మహిళలు , మేధావులు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజనీర్లు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు లక్షలాదిగా తరలివచ్చి మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో చైర్మన్ ఎత్తపు కేశవులు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ కానుగడ్డ యాదయ్య, జెఎమ్ఐ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాదం బాలరాజ్, టిఎంఎం రాష్ట్ర కోఆర్డినేటర్ ఏనుపోతుల కర్ణ, జెఎమ్ఐ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బండి రమాకాంత్, ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ ఎడ్ల కృష్ణయ్య, టిఎమ్ఎమ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మంత్రి చెన్నకేశవులు, ఎమ్ఎమ్ఎన్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ డబ్బా రాములు, టిఎమ్ఎమ్ ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాదం రాఘవేందర్, మహబూబ్నగర్ జిల్లా కన్వీనర్ కావలి రమేష్, వనపర్తి జిల్లా కన్వీనర్ కావలి రమేష్, వనపర్తి జిల్లా కన్వీనర్ మొలకలపల్లి మద్దిలేటి, వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ మాదారి భోజరాజు, నారాయణపేట కోఆర్డినేటర్ బైరంపల్లి నారాయణ, గోకం చెన్నయ్య, తోళ్ల మాసయ్య, సాతర్ల శివకుమార్, విద్యా సహదేవ్, రెంట్ల గోవిందు, మంత్రి బాలరాజ్, మంత్రి పవన్ పాల్గొన్నారు.



## సొంతగూటికి చేరిన రాజు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** శ్రీ సత్యేశ్వర సేవా ఆశ్రయం జడ్చర్లలో శుక్రవారం రోజున ఆశ్రయంలో కోలుకున్న ఒక మానసిక దివ్యాంగున్ని వనపర్తి వాస్తవ్యులైన వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పడం జరిగింది. రాజు అనే ఒక వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి అయిస్తాపూర్ గ్రామంలో రోడ్లపై సంచరిస్తున్న స్థితిలో ఆశ్రయ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్, వారి సిబ్బంది ఆశ్రమానికి గత రెండు సంవత్సరాల క్రితం చేర్చారు. ఇప్పుడు అతను పూర్తిగా కోలుకున్న నేపథ్యంలో వారి కటుంబ సభ్యులైన అన్నా వదిన బాలయ్య శివమ్మ, అక్క బావ అయిన రాణి శ్రీను జడ్చర్ల పోలీస్ సమక్షంలో అప్పజెప్పడం జరిగింది. తల్లిదండ్రి లేని రాజును వారి అన్న, అక్కలే ఎంతో గారాబంగా పెంచే వాళ్లమని ఇప్పుడు మళ్ళీ మా ఇంటికి మహారాజు వచ్చాడని వారు ఎంతో ఆనందం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి చిత్తనూరి రామకృష్ణ రాములు, రవి, హెడ్ కానిస్టేబుల్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనిక ఉద్యోగి అవయవదానం

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** తాను చనిపోయిన మరికొందరి జీవితాలలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో మృత్యుతో పోరాడుతున్న మాజీ సైనిక ఉద్యోగి తాను మరణించిన తర్వాత మరికొందరు జీవితాలలో వెలుగు నింపాలనే ఉద్దేశంతో అవయవ దానం చేసి మరికొందరికి ఆయుష్ పోసారు. వివరాల్లోకి వెళ్తే వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం పోలికపాడు గ్రామానికి చెందిన అంజయ్య ఆర్మీలో పని చేస్తూ దేశానికి సేవ చేస్తూ 2017లో రిటైర్మెంట్ అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రిటైర్మెంట్ తర్వాత వనపర్తిలో కుటుంబంతో నివాసం ఉంటూ స్వగ్రామమైన పొలికపాడులో వ్యవసాయ పనులు చేసుకుంటే జీవనం సాగించేవాడని తెలిపారు. ఈ నెల 6వ తేదీన ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలు కావడంతో సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఫలితం లేకపోవడంతో డాక్టర్లు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## దేవాలయానికి రూ. 51వేలు విరాళం

**ప్రజాపక్షం/ధన్వాడ :** జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి , నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి సహకారంతో ధన్వాడ మండల కేంద్రంలోని ధరంబాయ్ మఠం దగ్గర గల ఆంజనేయ స్వామి దేవాలయానికి ధ్వజస్తంభం కొరకు చిట్టెం మాధవరెడ్డి రూ. 51వేలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు , దేవాలయం కమిటీ సభ్యులు , వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గ్రూప్–3 పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకోవాలి

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** జిల్లాలో 4200 మంది విద్యార్థులు గ్రూప్ 3 పరీక్షలు సజావుగా రాసేందుకు 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షలోల 4 ఫ్లయింగ్ స్క్వాడ్ , 45 మంది ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, 4 రూట్ ఆఫీసర్లు , 13 మంది చీఫ్ సూపరింటెండెంట్ , 15 మంది పిడబ్ల్యూడి క్యాండిడేట్స్ ఉంటారని తెలిపారు. ప్రజావాణి కలెక్టరేట్ హాల్ స్ట్రాంగ్ రూం లోకేషన్ అని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులంతా నిర్ధేశించిన సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ నెల 17న పేపర్ 1 పరీక్ష ఉదయం 10 గంటల నుండి ప్రారంభం కానుండగా అభ్యర్థులు 8.30 వరకే లోపలికి అనుమతించనున్నట్లు తెలిపారు. పేపర్ 2 పరీక్ష మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానుండగా 1.30 లోపే కేంద్రంలోకి అనుమతించనున్నట్లు తెలిపారు. నవంబర్ 18న పేపర్ 3 పరీక్ష ఉదయం 10 గంటల నుండి ప్రారంభం కానుండగా అభ్యర్థులను 8.30 వరకే లోపలికి అనుమతించనున్నట్లు తెలిపారు.



## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


ప్రజాపక్షం / శ్రీరంగాపురం : శ్రీరంగాపూర్ మండల పరిధిలోని వెంకటాపూర్ , జానంపేట గ్రామాలలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నేరుగా లబ్దిదారులు సందీప్ , వెంకటేష్ , ఆంజనేయులు ఇండ్లకు వెళ్లి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వీరం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల కోసం లబ్దిదారుల అధికారులు చుట్టూ తిరగకుండా నేరుగా ప్రజల వద్దకే అధికారులు వెళ్లి ఇవ్వడం జరుగుతుందన్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల లబ్దిదారులకు సహకరించిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ నాయుడు, మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు ఈరపాగ కురుమన్న, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి జె. ఆశన్న తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

**ప్రజాపక్షం / పెబ్బేరు :** కరీంనగర్ జిల్లా దుర్శెడు గ్రామం నుంచి అలంపూర్ ఆలయానికి వెళ్తుండగా ఓల్వో బస్సు పెబ్బేరు పట్టణ కేంద్రానికి సమీపాన 44వ జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన సంగతి తెలుసుకున్న పెబ్బేరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ , పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ , పెబ్బేరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న బాధితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తోమాలపల్లి కృపాకర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎల్లస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కల్వకుర్తిలో ఎమ్మెల్యే పర్యటన

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలపరిధిలోని జీడిపల్లిపేట గ్రామాలలో శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్‌పార్టీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పిఎసిఎస్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు అఖిలభారత సహకార సంఘం వారోత్సవాలలో భాగంగా వ్యాపారవేత్తలు, ఉపాధి నైపుణ్యాలకు సంబంధించిన సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అదేవిధంగా 12.30నిమిషాలకు రఘుపతిపేట, 2.30నిమిషాలకు జీడిపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన వడ్లకొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమాలకు పార్టీశ్రేణులు సకాలంలో హాజరుకావాలని కోరారు.



## అభివృద్ధిలో గిరిజనులు ముందుండాలి

**ప్రజాపక్షం / నర్వ :** మండల పరిధిలోని జంగంరెడ్డి పల్లి గ్రామ తండాలో శుక్రవారం బిర్సాముండా జయంతిని గిరిజన ఆత్మగౌరవ దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా నర్వ ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విప్లవ వీరుడు స్వతంత్ర సమరయోధుడు బిర్సా ముండా జయంతిని ప్రతి ఏటా జరుపుకోవడం శుభ పరిమాణం , ఆయన చేసిన సేవలు త్యాగాల గురించి వివరించారు. ప్రతి పిఈఎస్ఏ, పిఆర్ఏ గ్రామాల్లో అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు డా. కేశవులు ఎప్పుడు అందుబాటులో ఉంటారని సూచించారు. విద్య వైద్యం , గిరిజనులు ఆర్థికంగా ఎదుగాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి స్కీంను వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం పెద్దలు గోపినాయక్ , మణిక్యమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాఘవేందర్ , పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, డా. కేశవులు, ఏబిపి కో ఆర్డీనేటర్ బాలాజీ, ఏఎన్ఎం , అంగన్‌వాడీ , ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కార్తీకపౌర్ణమి వేడుకలు

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలకేంద్రంతోపాటు మండలపరిధిలోని అన్ని గ్రామాలలో శుక్రవారం మహిళలు కార్తీకపౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో కార్తీకదీపాలు వెలిగించి తమతమ మొక్కులను తీర్చుకున్నారు. డిండి చింతపల్లి గ్రామ శివాలయంలో శివపార్వతి కల్యాణోత్సవాన్ని ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం సిఇవో విష్ణుమూర్తి దంపతులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి భాగ్యలక్ష్మి , శ్రీనివాస్, గ్రామస్తులు భీమయ్య, పరమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## చెట్లపొదలను తొలగించాలి



**ప్రజాపక్షం/వంగూర్ :** మండల పరిధిలోని తిప్పారెడ్డిపల్లి గ్రామం నుండి శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారికివెళ్లే బిటిరోడ్డు ఇరువైపుల చెట్లపొదలతో కమ్ముకొని మూల మలుపులు ప్రమాద భరితంగా ఉన్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో వెళుతున్న ద్విచక్రవాహనాలు తరుచూ ప్రమాదాల బారినపడుతూ ఎదురెదురుగా వాహనాలు ఢీకొట్టుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లపొదలను తొలగించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.



## బాధిత కుటుంబాలకు పరామర్శ

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలకేంద్రానికి చెందిన కొండపల్లి రమేష్, వారణాసి రమేష్‌లు గతరెండురోజులక్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక యెన్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈవిషయం తెలుసుకున్న సింగిల్‌విండో డైరెక్టర్ మట్టవెంకటయ్యగౌడ్ వారి కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్ హరికాంత్‌రెడ్డిని కోరారు. ఆయనవెంట కాంగ్రెస్‌పార్టీ సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, మైనార్టీ నాయకులు ఎండి.రషీద్, చిమ్ములతిరుపతిరెడ్డి, కిష్టాల్, మట్టభరత్‌గౌడ్ ఉన్నారు.





## ఘనంగా బిర్సాముండా జయంతి

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని గుండాల ఏకలవ్యమోడల్ రెసిడెన్షియల్ స్కూల్లో గిరిజనుల ఆరాధ్యదైవం భగవాన్‌బిర్సాముండా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులతో గుండాల గ్రామంలో ప్రభాతపేరి(ఊరేగింపు) నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పర్దీప్‌కుమార్ మాట్లాడుతూ బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా గిరిజన ప్రజలతో కలిసి సైనికవిప్లవం సృష్టించిన గొప్పవీరుడు, స్వతంత్ర్య సమరయోధుడు బిర్సాముండాగారని కొనియాడారు. ఆయన జన్మదినం నవంబర్ 15న దేశవ్యాప్తంగా జనజాతీయ గౌరవదివాస్ జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గుండాల గ్రామపెద్దలు పర్వత్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి,సుమన్, భాస్కర్, రీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లికి గ్రూప్-4 ఉద్యోగాలు





**ప్రజాపక్షం/వెల్దండ :** ఇటీవల విడుదలైన టిజిపిఎస్సి గ్రూప్4 ఫలితాల్లో రాచూర్ గ్రామానికిచెందిన ఒకే కుటుంబంలో అన్నాచెల్లెలు ఉద్యోగాలు సాధించారు. రాచూర్ గ్రామానికిచెందిన గంగదారివెంకటేష్(బైక్‌మెకానిక్) స్వరూప దంపతుల సంతానమైన గంగధారి శ్రీకాంత్, గంగధారి లలితలు చిన్నప్పటినుండి చదువులో చురుకుగా ఉండేవారు. తాజాగా రాష్ట్రప్రభుత్వం విడుదలచేసిన గ్రూప్4 ఫలితాల్లో ఉద్యోగాలు సాధించారు. గంగధారి శ్రీకాంత్ నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని భూపరిపాలన విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా , కుమార్తె గంగధారి లలిత ఉస్మానియా యూనివర్సిటిలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిసింది. కుమారుడు, కుమార్తె ప్రభుత్వ ఉద్యోగాలు సాధించ దంపట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## బిసి వసతిగృహ విద్యార్థులకు క్రీడలు

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : రాష్ట్ర కమీషనర్ బిసివెల్ఫేర్ ఆదేశానుసారం జిల్లా బిసి డెవలప్‌మెంట్ అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంనందు నాగర్‌కర్నూల్ జిల్లాలోని 28వసతిగృహాల విద్యార్థులకు క్రీడలను నిర్వహించారు. సహాయ వసతిగృహ సంక్షేమ అధికారిశ్రీరామ్ పర్యవేక్షణలో క్రీడాపోటిలు జరిగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వందమీటర్ల పరుగుపందాల పోటిలను నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ క్రీడలు ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయని, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ కార్యదర్శి పాండు, వసతిగృహాల అధికారులు, సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అందరినీ ఆకట్టుకుంటున్న మారుతి కొత్త డిజైర్

సూర్యాపేట డిఎస్‌పి జి.రవి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఇటీవల మార్కెట్‌లో విడుదలైన మారుతి కొత్త డిజైర్ డాజ్లింగ్ అ ందరిని ఆకట్టుకుంటుందని సూర్యాపేట డిఎస్‌పి జి.రవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని విజయవాడ జాతీయ రహదారి సమీపంలో పవన్ మోటార్స్ షోరూంలో నూతనంగా విడుదలైన మారుతి కొత్త డిజైర్ డాజ్లింగ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సామాన్యమైన ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో మారుతి డిజైర్‌ను మార్కెట్‌లో రావడం అభినం దనీయమన్నారు. తక్కువ ధరకే విలాసవంతమైన ఫ్యూచర్స్‌తో విడుదలైందన్నారు. కారులో ఆరు ఎయిర్ బ్యాగ్స్‌తో పాటు 12 హెడ్ ల్యాంప్ లైట్లతో అద్భుతమైన లైటింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం సిఐ రఘువీర్ రెడ్డి, బ్రాంచి మేనేజర్ భూపతి నారాయణ గౌడ్, ఆర్‌ఎంలు ఎస్‌కె నజీర్, జి సందీప్, కె నరేష్, ఎస్‌కె మౌలాన, సపావట్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గీతకార్మికుల ఆత్మరక్షణకు కాటమయ్య కిట్లు

కోదాడ ఎంఎల్‌ఎ పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ:** గీత కార్మికులందరు వృత్తిలో క్షేమంగా ఉండటం కోసం సురక్షితమైన జీవితాన్ని గడపాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సేఫ్టిమోకులను పంపిణీకి శ్రీకారం చుట్టారని కోదాడ ఎంఎల్‌ఎ పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాటమయ్య కిట్లను శిక్షణ పొందిన గీత కార్మికులకు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వృత్తిలో ఉన్న గీత కార్మి కులందరికి ఎలాంటి ప్రమాదం జరగకూడదనే సేఫ్టిమోకులు అందించి ప్రాణనష్టం జరగ కుండా చూడాలని ప్రభుత్వం చొరవ తీసుకుందన్నారు.సేఫ్టిమోకులు వాడే విధానాన్ని వాటి వల్ల జరిగే లాభాలను రాష్ట్ర స్థాయి శిక్షణ ఇస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు గీత కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ జిల్లా అధికారి జి.అన సూర్య, ఎక్సైజ్ సూపరిడెంట్ లక్ష్మ ణ్‌నాయక్, మిసి వేల్ఫేర్ అసిస్టెంట్‌అధికారి గామయ్య, అక్బర్‌పాషా, కోదాడ,సూర్యాపేట ఎక్సైజ్ సిఐలు, గీత కార్మిక సంఘం నాయకులు మద్ది అం జిబాబు, బట్టిపల్లి నాగమల్లయ్య, సోమగాని మల్లయ్య, మామిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పేదల డబ్బాకొట్లకు నోటీసులు ఇవ్వడం అన్యాయం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ బషీర్



**ప్రజాపక్షం/కోదాడ:** రోడ్డు పక్కన చిన్న చిన్న డబ్బాకొట్లు పెట్టుకుని జీవనోపాధి పొందు తున్న చిరు వ్యాపారులకు ఖాళీ చేయాలంటూ మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ బషీర్ అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చిరు వ్యాపారులతో, పండ్ల వ్యాపారస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. బడా బాబులు అక్రమించుకుంటే పట్టించుకుని వారు జీవనోపాధి కోసం చిన్న చిన్న డబ్బాకొట్లను వేసుకున్న వారిని వేధించడం సరైంది కాదన్నారు. సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ కౌన్సిలర్ షేక్ షమ్మి, మజహర్, జానిమియా, వెన్నెల శ్రీను, రామకృష్ణ, ఖలీల్, జాని, గంధం రామకృష్ణ, మహిమూద్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా పింఛన్లను పెంచాలని ధర్నా




**ప్రజాపక్షం/వడ్డేపల్లి :** వడ్డేపల్లి మండలం రాజోలి శ్రీ మన్య శ్రీమందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం ఆసరా పింఛన్లను పెంచాలని విహెచ్‌పిహెచ్ ఆధ్వర్యంలో ధర్నా కార్య క్ర మం చేపట్టారు. శాంతినగర్ గ్రామంలో అంబేద్కర్‌కు పూలమాల వేసి వికలాంగులకు 4000 పింఛన్ నుంచి 6000 పింఛన్ పెంచేవరకు వికలాంగులపోరాటం అగదని విక లాంగుల అధ్యక్షులు వడ్డేపల్లికృష్ణ పైపాడు చక్రవర్తి జులకల్ కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర, రామకృష్ణ, ఆంజనేయులు, రాజు, పరుశురాముడు, కొంకలభీమన్న,వడ్డేపల్లి తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/మానవపాడు** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని మానవపాడు మం డల కేంద్రానికి చెందిన సింగిల్ విండో వైస్ చైర్మన్ అయ్యన్నకి ఎమ్మెల్యే విజయుడు సిఎంఆర్‌ఎఫ్ ద్వా రా మంజూరైన రూ.15వేల చెక్కును అందించారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్యేతో పాటు నాగేశ్వర్ రెడ్డి, శేషరెడ్డి, కిషోర్, పుల్లూర్, రఘురెడ్డి బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## శ్రీనివాస్ మృతి తీరనిలోటు

– యరగాని నాగన్న గౌడ్

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ఐఎన్‌టియుసి కార్మికుడు చింతా శ్రీనివాస్ మృతి ఐఎన్‌టి యుసికి తీరనిలోటని ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన రైస్‌మిల్ డ్రైవర్ చింతా శ్రీనివాస్ ఇటీవలె రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. శ్రీనివాస మృతదేహంపై ఐఎన్‌టియుసి జెండాను కప్పి, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. నాగన్నగౌడ్ మాట్లాడుతూ నిబద్ధత యూనియన్ సభ్యుడని, ఆయన కుటుంబానికి ఐఎన్‌టియూసి అండగా నిలుస్తుందన్నారు. మృతుని కుటుంభానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సలిగంటి జానయ్య, మేకపోతుల వీరబాబు గౌడ్, యరగాని భిక్షం గౌడ్ పాల్గొన్నారు.

# సాఫీగా ధాన్యం కొనుగోళ్లు

జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్:** రైతులు పండించిన ధాన్యాన్ని ఏ యొక్క గింజ కూడా వదల కుండా ధాన్యం కొనుగోలు సాఫీగా జరగాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హను మంతరావు అన్నారు. శుక్రవారం భువనగిరి మండలంలోని నందనం గ్రామంలో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో 372 కొనుగోలు కేంద్రాల ద్వారా శుక్రవారం వరకు 9302 మంది రైతుల దగ్గర నుండి 97,812 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు. దానిలో 88845 టన్నుల ధాన్యాన్ని జిల్లా మిల్లర్లకు అందజేసినట్లు, జిల్లాలో మొత్తం 226 కోట్ల విలువైన ధాన్యం సేకరణ జరిగిందన్నారు. ఇప్పటివరకు రూ.76 కోట్లను 3046మంది రైతులకు వారి ఖాతాల్లో జమ చేయడం జరిగింది. రైతులు కొనుగోలు కేం ద్రాలకు తెచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు అన్లోడ్ చేసి రైతుల యొక్క వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. తూకంలో ఎలాంటి జాప్యం జరగకుండా ఉండాలని, రైతు లకు ఏ ఇబ్బంది కలగకుండా దాన్యం కొను గోలు చేసి, కాంటా వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లు ఆకస్మిక తనిఖీ

### రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ :** రైతులను ఎలాంటి ఇబ్బందులు గురి చేయకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. శుక్రవారం వలిగొండ మండలంలోని నాగారం గ్రామంలో ఉన్న వాసవి రైస్ మిల్లును అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. వచ్చిన ధాన్యాన్ని త్వరగా అన్లోడ్ చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. రైస్ మిల్లులో ధాన్యం దిగుమతులలో జాప్యం లేకుండా చూడాలని రైస్ మిలర్లకు ఆదేశించారు. ఏమైనా సమస్యలు వస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వలిగొండ తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలి : కాంతయ్య




**ప్రజాపక్షం/నల్లగొండ :** రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ ఏ ఒక్క పేద వారికి రేషన్ కార్డు మంజూరు చేయలేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకండ కాంతయ్య విమర్శించారు. ఆసంఘం నల్లగొండ జిల్లా సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై కాంతయ్య మాట్లాడుతూ రేషన్ కార్డు లేకపోవడం మూలంగా రుణ మాఫీ ,గ్యాస్ మాఫీ, ఇందిరమ్మ ఇండ్లకు లింకు పెట్టి పేదలు ఆ పథకాలకు నోచుకోకుండా ప్రభుత్వమే చేస్తుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చేసిన ఆరు గ్యారెంటీల అమలుకు పూనుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎల్ శ్రవణ్ కుమార్,జిల్లా కార్యదర్శి బొలుగురి నరసింహ మాట్లాడుతూ పేద ప్రజలకు సంబంధించిన పెన్షన్లు, వేతనాలు, వ్యవసాయ కూలీలకు ఇచ్చే 12 వేల రూపాయలు , కొత్తగా ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించడంలోపైన రాష్ట్ర క్యాబినెట్లో చర్చ జరగకపోవడం సూచనీయమని పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికుల పట్ల చిన్నచూపుతో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఉద్యమాలు చేపట్టగలమని వారు పేర్కొన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేముల బుచ్చయ్య, సిహెచ్ ఊశయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు జి.యాదయ్య, బి.రామకోటి పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలలోనే నిర్వాహకులు



**ప్రజాపక్షం/(నల్లగొండ)నకిరేకల్ :** ధాన్యాన్ని పూర్తి నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ కోరారు. శుక్రవారం ఆమెనకిరేకల్ మండలం, గోరింకలపల్లి, మంగళపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికం గా తనిఖీ చేసి ఆయా కేంద్రాలకు వచ్చిన దాన్యం, తేమ శాతాలను పరిశీలించారు.రైతులు సరైన తేమ శాతం, అదే విధంగా తాలు,తరుగు, మట్టి పెల్లల వంటివి లేకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినట్లయితే తక్షణమే ధాన్యాన్ని అమ్ముకోవచ్చని చెప్పారు. కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ఏరోజు ధాన్యాన్ని అదే రోజు కొనుగోలు చేయాలని, ముఖ్యంగా 17 తేమతో వచ్చిన దాన్యం ఆపవద్దని, 6గంటల్లో ధాన్యంకొని మిల్లులకు పంపించాలన్నారు. ఒకవేళ తేమ శాతం కోసం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఉంచవలసి వస్తే వర్షం వచ్చినా తడవకుండా ముందు జాగ్రత్తగా టార్పాలిన్లు కప్పాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి ధ్రువీకరించిన తర్వాతే ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలని అన్నా రు. రైతులు సరైన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని ముందుగా అమ్ముకోవాలని, చివరి వరకు ఆగవద్దని చెప్పారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ప్రతిరోజు తేమశాతాన్ని నమోదు చేయాలన్నారు. కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాలలోనే ఉండాలని, ఒకవేళ లేనట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ వెంట ఆర్‌డిఓ అశోక్ రెడ్డి, డిసిఓ పత్యా నాయక్ ఉన్నారు .

## సమస్య పరిష్కరించాని వినతి

### బాకీ చెల్లించాలని బోరెల్లి సత్యారెడ్డిపై సీతారాంరెడ్డి ఆగ్రహం



**ప్రజాపక్షం/మానవపాడు :** మండల జోగులాంబ గ ద్వాల జిల్లా అల్లంపూర్ ని యోజకవర్గం లోని టోల్గేట్ దగ్గర గత 25 సంవత్సరా ల క్రితం బోరెల్లి సత్యారెడ్డి అనే వ్యక్తి ప్రభుత్వ భూమి ని లీజుకు తీసుకుని పెట్రోల్ బంకును ఏర్పాటు చేశారు. ఆ పెట్రోల్ బం కును ఏర్పాటు చేసే ముందు ప్రభుత్వం భూమికి రుసుము చెల్లించే విధ ంగా ఖరారు చేసుకున్నారని, బంక్ ఏర్పాటు అనంతరం ప్రభుత్వానికి నెల నెల రుసుము చెల్లించే విధ ంగా ఖరారు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి ఎలాంటి రుసుము చెల్లించకుండగా నేటికి నాలుగు కోట్ల రూపాయల బాకి పడ్డట్టు కాంగ్రెస్ నాయకులు తనగల సీతారాం రెడ్డి తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని సమస్యను పరిష్కరించాల్సిందిగా వినతిపత్రం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, అల్లంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డప్ప, కాంగ్రెస్ నాయకులు ఐజ షేక్షావలి చారి, మద్దిలేటి, వెంకట్ రాములు ఉన్నారు.

## కాటమయ్య కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి





**ప్రజాపక్షం/మునుగోడు :** మండల కేంద్రంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కల్లుగీత కార్మికులకు ప్రొహిబిషన్,ఎక్సైజ్ శాఖ, బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్ష కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మొదట విడతగా 200 కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రమాదవశాత్తు తాడిచెట్టు నుండి కింద పడిపోకుండా కల్లుగీత కార్మికులకు రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ కిట్లను పంపిణీ చేస్తుందని తెలిపారు. ఇప్పటికే ఈ కిట్లను ఎలా ఉపయోగించాలి అనే దానికి సంబంధించి గీత కార్మికులకు శిక్షణ కూడా కల్పించామన్నారు. నా సొంత గ్రామంలో నాస్నేహితుడు అంజయ్య గౌడ్ ప్రమాదవశాస్తూ తాటి చెట్టుపై నుండి పడి తీవ్ర ప్రమాదానికి గురయ్యారు అలాంటి పరిస్థితి ఏ కల్లుగీత కార్మికునికి రావద్దని మునుగోడు అన్నారు. బెల్ట్ షాపుల నిర్మూలన తర్వాత కల్లుగీత కార్మికులకు ఉపాధి పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ ఏఈ ఎస్ చాణిక్య,నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు,ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** శ్రీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఏడాది కార్తీక పౌర్ణమి సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లాపురంలో శ్రీ రామలింగేశ్వర స్వామి జాతరను నిర్వహిస్తారు. జాతర సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి శుక్రవారం గుట్ట పైకి నడుచుకుంటూ వెళ్లి రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు.స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అంతకుముందు జనగాం గ్రామంలో అంబేద్కర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా అంబేద్కర్ భవనం చుట్టూ ఆధునీకరణ పనులు కూ డా చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్, మండలపార్టీ అధ్యక్షుడు కరంటోతూ శ్రీను నాయక్, నాయకులు మందుగుల బాలకృష్ణ, గుత్త ఉమా ప్రేమ్చందర్ రెడ్డి, కరెంటోతూ బిక్షపతి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఫిట్‌నెస్ లేని బస్సులతో పరేషాన్



**ప్రజాపక్షం/గద్వాల :** ఫిట్‌నెస్ లేని, కాలం చెల్లిన బస్సులను అర్‌టిసి అధికారులు రోడ్లపైకి తీసుకొస్తున్నారు. బస్సులు ఊరు దాటకముందే ఆగిపోతుండంతో ప్రయాణికులు పరేషాన్ అవుతున్నారు. శుక్రవారం ఆర్‌టిసి బస్టాండ్ నుంచి అయిజకు బయలుదేరిన బస్సు మేళ్ళ చెరువు చౌరస్తా దాటక ముందే ఆగిపోయింది. అందులో దాదాపు 60 నుండి 70 మంది ప్రయాణికులఉన్నారు. అకస్మికంగా ఆగిపోవడంతో ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారు. ఆర్‌టిసి డిఎం కు ప్రయాణికులు ఫోన్ చేసిన ప్రయాణికులను పట్టించుకున్న పాపాన పోలేదని, అగినచోట అయిజ రూట్‌లో టైంకు బస్సులు రాక ఇబ్బందులు ఎదుర్కొ కున్నట్లు పలువురు ప్రయాణికులు తెలిపారు.ఆర్‌టిసి అధికారులకు ధనార్జన మీద ఉన్న ప్రేమ ప్రయాణికులపై ఉండకపోవడం దురదృష్టకరం, ప్రజలను చేర్చే విషయంలో విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌టిసి ఉన్నత అధికా రులు నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకొని ప్రజలకు సరియైన సమయానికి గమ్యం చేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## దొంగతనాలతో వాహనదారులు బెంబేలు



**ప్రజాపక్షం/అయిజ :** మున్సిపాలిటీ కేంద్రంలో కేవలం 20 రోజుల్లో రెండు బైక్‌లు చోరీకి గురవుతున్నట్లు పలువురు స్థానికులు తెలిపారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎంపిహెచ్‌ఇఒగా పనిచేస్తున్న ఓబులేశ్వరయ్య ఎంపిహెచ్‌ఈఓగా పనిచేస్తున్నాడు. ఈయన టీచర్స్ కాలనీలో ఇంటి ముందు నిలిపియున్న ఏ.పి 02 బిడి 1813 నెంబర్ గల యూనికాన్ బైకును రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారని, అలాగే గురువారం రాత్రి న్యూ బస్టాండ్ పక్కన అక్షర హైస్కూల్ సందులో గుర్తు తెలియని దొంగలు హూండా ఎస్ప్రీశైన్ ఏ.పి 39 ఏ 9572బైక్‌నుఎత్తుకెళ్లడంతో వాహనదారులు ఇంటి ముందు బైక్‌లను పెట్టాలంటేనే బెంబేలె త్తిపోతున్నారు. రాత్రి వేళల్లో నిఘా కరువైయిందని పలువురు స్థానిక వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు వరుస దొంగతనాలకు అడ్డుకట్టవేయాలని ప్రజలు కోరుతున్నారు.

# క్రీడల్లో గెలుపు..ఓటములు సహజం

జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ:** క్రీడల్లో ఓటమి గెలుపు అనేది సహజంమని, ఓటమిని పాజిటివ్‌గా తీసుకొని ముందుకు వెళ్ళాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్రపవార్ అన్నారు.జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం నందు 9 నెలల పాటు శిక్షణ పొందుతున్నట్రైనీ కానిస్టేబుళ్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన స్పోర్ట్స్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ పాల్గొని ఆటలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌పి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా పోలీసు శిక్షణా కేందర్రం నందు 9 నెలల శిక్షణా కాలంలో ఎంతో క్రమశిక్షణతో శిక్షాకులు నేర్పిన శిక్షణా నేర్చుకొని 21వ తేదీన పూర్తి కానున్న సందర్భంగా ఈ యొక్క స్పోర్ట్స్ గేమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నా రు. ఈ క్రీడలు వల్ల టీమ్ స్పిరిట్ ,లీడర్షిప్ క్వాలటీస్ పెరుగుతాయి. విధినిర్వహణలో క్రీడలు ఎంతో అవసరమైనవని మనం అందరం క్రీడలు అనేవి జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని,విధి నిర్వహణలో భాగంగా మనం ఎంతో కఠినమైన పరిస్థితి ఎదుర్కొన వలసి వస్తుందని శారీరకంగా దృఢంగా ఉండటానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిటీసీ అడిషనల్ ఎస్‌పి రమేష్, డిటీసి డిఎస్‌పి విఠల్ రెడ్డి, నల్లగొండ డిఎస్‌పి శివ రాం రెడ్డి,సిఐ లు రాజశేఖర్ రెడ్డి,రాజు ఆర్ ఐ హరిబాబు,యస్ ఐలు ప్రవీణ్, భరత్,శ్రీను, ఆర్.యస్.ఐ అఖిల్, వ్యాయామ ఉపాధ్యాయులు, ట్రైనీ కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

## గంథ్రాలయాలను సద్వినియోగం చేసుకోవాలి : అదనపు కలెక్టర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** నిరుద్యోగ యువత ఈ గంథ్రాలయాన్ని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని అదునపు కలెక్టర్,జిల్లా గంథ్రాలయ సంస్థ ఇంచార్జ్ జె.శ్రీనివాస్ సూచించారు.57వ జాతీ య గంథ్రాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలను అందించడం అభినందనీయమని అన్నారు. ఈ గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని పుస్తక ప్రియులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఫౌండేషన్ సిఈవో గోన రెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గాదే వినోద్ రెడ్డి, గంథ్రాలయ కార్యదర్శి బి బాలమ్మ,సహాయ పాలకులు కట్ట నాగయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

# చెర్వుగట్టుకు పోటెత్తిన భక్తులు

### ఆలయంలో భక్తు సామూహిక వ్రతాలు



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మండలంలో ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న చెర్వుగట్టు శ్రీ పార్వతి జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానం శుక్రవారం భక్తులతో కిట కిట లాడింది. కార్తీక మాసంలో ప్రముఖ్యత గల పౌర్ణమి తిథి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో చెర్వుగట్టుదేవస్థానంకు చేరుకున్నారు. కార్తీక మాస ప్రియుడైన పరమేశ్వరుని సన్నిధిలో కార్తీక దీపాలను వెలిగించి బాధలు వైదొలిగి పోయి మనసులోని కోరికలను నెరవేర్చాలని కోరుకుంటూ శుక్రవారం తెల్లవారుజామున దీపాలు వెలిగించారు. అనంతరం ఆలయంలో భక్తులు సామూహిక వ్రతాలు చేపట్టారు. భక్తుల తాకిడి పెరుగుతున్న కొద్ది స్వామి దర్శనం మూడు గంటల సమయంపడుతున్న, దర్శన క్యూలైన్లో గంటల కొద్ది వేసి స్వామివారి దర్శనం చేసుకొని భక్తులు మంత్రముగ్ధలైనారు.

స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు మొదలగు కార్యక్రమాలు చేసుకొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు పొందారు. ఆలయ అధికారులు గుట్టకు వచ్చిన భక్తులకుఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ అధికారులు తగు జాగ్రత్తలు,సౌకర్యాలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా భారీ భద్రత ఏర్పాట్లను సీఐ నాగరాజు సమక్షంలో ఎస్ఐ క్రాంతికుమార్,కట్టు దిట్టమైన చర్యలు చేపట్టారు.

## యువత స్వయం ఉపాధితో రాణించాలి



ప్రజాపక్షం/సరూర్ నగర్ : యువత స్వయం ఉపాధితో రాణించాలని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌కె పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలో నూతన మహాదేవ్ స్టోర్స్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అరుణ, సర్వేశర్, అర్జున్ మహాదేవ్, ప్రశాంత్, సంతోష్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి

## మహిళలు ఆర్థికాభివృద్ధితోనే ప్రగతి

ప్రజాపక్షం/షాద్‌నగర్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తేనే ప్రగతి సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ఎఫ్‌సిఎన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద మహిళలకు కుట్ట మిషన్లు పంపిణీ చేసిన పౌండేషన్ నిర్వాహకులు గీతా థామస్‌లను అభినంధించారు. మహిళలకు ఆర్థికంగా అభివృద్ది సాధించేందుకు కృషి చేయాలన్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్‌లతోపాటు మహిళలు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు



ప్రజాపక్షం/ చంపాపేట : కార్తీక పౌర్ణమి సందర్భంగా చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానంజనేయ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. భక్తులు వేకువజాము నుంచే కార్తీక దీపాలను వెలిగించి స్వామి వారికి పూజలు చేశారు. అభిషేకాలు కుంకుమార్చనలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో విశేష పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పూజా కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. వేద పండితులు అర్చకులు, ఆలయ ఇఒ, సిబ్బంది మంత్రికి స్వాగతం పలికారు. స్వామి వారిని మంత్రి పొన్నం ప్రభాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రిని అర్చకులు అశీర్వదించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో వెలిగించే దీపాలు, ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ధ్యానంజనేయ స్వామి వారిని దర్శించుంచుకోవడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జడ్జి నాగశ్రావ్య, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, ఇఒ లావణ్య, నాయకులు సందీప్‌రెడ్డి, దశరథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శివారు కాలనీల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే దేవిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీల సమస్యలు పరిష్కారం చేస్తామని ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఎల్‌బి నగర్ జోన్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ యాదవ్, టౌన్ ప్లానింగ్ ఏసిపి శ్యామ్సాన్‌లతో కాలనీల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సాగర్ కాంప్లెక్స్ నుండి వచ్చే వరద నీటిని కాప్రాయ్ చెరువులోకి రాకుండా గుర్రంగూడ ఫారెస్ట్ నుండి విపశ్యన ధ్యాన కేంద్రం మీదుగా దిగువన ఉన్న శ్రీగాయత్రి నగర్, పాపిరెడ్డి కాలనీ, క్రిస్టల్ విల్లాస్ మీదుగా తీసుకెళ్లి మునగనూర్ మీదుగా అంబర్ పేట్ శివారులో కలిపి బిఎన్‌రెడ్డి నగర్ శివారు 21 కాలనీలలోనెలకొన్న వరద, భూగర్భ డ్రైనేజీ సమస్యలు తీర్చడానికి ఒక ప్రణాళిక చేయడం జరుగుతందని ఆయన పేర్కొన్నారు. ఇందుల్లో బాగంగా ట్రంక్ లైన్ పనులు క్రిస్టల్ విల్లాస్ ఎదురుగా ఉన్న రైతుల పొలాల వరకు వచ్చి ట్రంక్ లైన్ పనులు ఆగిపోవడం జరిగిందని, రైతులకు తగునష్టపరిహారం ఏవిధంగా ఇస్తే బాగుంటుందని అధికారులను ఆడిగి రైతులకు వివరించడం జరిగిందన్నారు. అధికారులు మాట్లాడుతూ రైతులకు లాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం నుండి తగు నష్టపరిహారం ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. రైతులు సహకరిస్తే త్వరలోనే ఈట్రంక్ లైన్ సమస్య ఒక కొలిక్కి వస్తుందని రైతులకు విజ్ఞప్తి చేశారు. దీనికి రైతులు సానుకులంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో భారస డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, రైతులు జక్కిడి మోహన్‌రెడ్డి, జక్కిడి సుధాకర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలతో నేర నియంత్రణ

### వనస్థలిపురం ఎసిపి కాశిరెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: సిసి కెమెరాలతో నేరాలను నియంత్రించడంలో సాధ్యమవుతుందని వనస్థలిపురం ఎసిపి కాశిరెడ్డి, బిఎన్‌రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీ ఫేస్2లో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొత్త శివ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నిత్యం కాలనీల్లో నిఘా ఉంటదని, 20 మంది పోలీసులకు ఒక సిసి కెమెరాల నియంత్రించే అవకాశం ఉంటదన్నారు. కాలనీల్లో దొంగలకు, చైన్‌స్నాచింగ్‌లు చేసే వారికి సిసి కెమెరా అంటే దొంగల గుండెలో గుబులు పుట్టుతుందన్నారు. సిసి కెమెరాలు ప్రతి కాలనీల్లో ఉండాలని, సీసీ కెమెరాలు ఉండడం వలన మహిళలు, ప్రజల రక్షణ కల్పించడానికి దోహద పడుతుందన్నారు. వనస్థలిపురం డివిజన్‌లోని సాగర్ కాంప్లెక్స్ వద్ద ట్రార్ట్ జండర్ ద్వారా కొత్త మేరకు ప్రజలకు ఇబ్బంది ఉంటుందని, వారిని కూడా నివారిస్తామని తెలిపారు. వింజాపూర్ కమాన్, గుర్రంగూడ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేడానికి కృషి చేస్తామని, ఆ ప్రాంతాల్లో సిసి కెమెరాలు వస్తే పూర్తి స్థాయిలో నేరాలు అదుపులో వస్తాయని పేర్కొన్నారు. టీచర్స్ కాలనీ సీసీ కెమెరాలకు స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సొంత నిధుల్లో నుంచి 50వేల రూపాయలను కాలనీ సంక్షేమానికి అందచేశారు. కార్యక్రమంలో వనస్థలిపురం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్. శ్రీనివాస్, మీర్‌పేట్ సీఐ కీసర నాగరాజు, ఎస్ఐ వెంకట్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరెడ్డి, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు నర్సింహ్మారెడ్డి, చైతన్య నగర్ కాలనీ అధ్యక్షులు జలంధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, కాలనీ వాసులు నరసింహారెడ్డి, సంజీవ యాదవ్, పార్టీ నాయకులు పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 6,94,281 కుటుంబాల సర్వే పూర్తి




ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను జిహెచ్‌ఎంసి పరిధిలో కొనసాగుతుంది. ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లకు వెళ్లి సర్వే జరుపుతున్నారు. కుటుంబ సభ్యులు తక్కువ ఉన్న సందర్భంలో సర్వే అతి తక్కువ సమయంలో పూర్తి చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఎక్కువ మంది ఉన్న పక్షంలో ఎక్కువ సమయం పడుతున్నది. కుటుంబ సభ్యులు ఎన్యూమరేటర్లకు సమాచార సేకరణ సందర్భంగా పూర్తి సహకారం అందిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సమాచారాన్ని నమోదు చేస్తూ సంబంధించిన కోడింగ్‌ను సూపర్ వైజర్‌లు పరిశీలిస్తున్నారని జిహెచ్‌ఎంసి అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కుటుంబ సర్వే నమోదులో ఎన్యూమరేటర్లు ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కోడింగ్‌ను ర్యాండమ్‌గా చెక్ చేయాలని నోడల్ అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తి చేసిన ఫారాలను సంబంధిత సర్కిల్ కార్యాలయాలలో అందజేసిన వెంటనే బ్లాక్ వారీగా ట్రంక్ బాక్స్‌లో భద్రపర్చాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తప్పులకు ఆస్కారం లేకుండా ఇబి సూపర్‌వైజర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సర్వే చేసిన ఫారాలను తప్పనిసరిగా పరిశీలన చేయాలన్నారు. ఈ నేపథ్యంలో జిహెచ్‌ఎంసి వ్యాప్తంగా ఇప్పటి వరకు 27.74 శాతం సర్వే పూర్తి చేశారు. శుక్రవారం 1,04,110 కుటుంబాలు సర్వే పూర్తయిందని, ఇప్పటివరకు 6, 94,281 కుటుంబాల సమాచారం సేకరించారని అధికారులు చెప్పారు.

## ఒటిఎస్‌పై విస్తృతంగా ప్రచారం

### జలమండలి ఎండి అశోక్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఒటిఎస్‌పై వినియోగదారులు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జలమండలి అమలు చేస్తున్న వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం(ఒటిఎస్ 2024)పై జలమండలి ఎండి అశోక్ రెడ్డి శుక్రవారం ఇడి మయాంక్ మిట్టల్‌తో కలిసి డైరెక్టర్లు, సిజిఎం, జిఎంలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ ఒటిఎస్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి డివిజన్‌లోని టాప్10 వినియోగదారులు, ప్రభుత్వ కార్యాలయలు అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేయాలని జనరల్ మేనేజర్లకు సూచించారు. అలాంటి వినియోగదారుల వివరాలను ఇప్పటికే ఆయా జిఎంలకు అందించామన్నారు. ప్రతి మేనేజర్ ఇంటింటికి వెళ్లి ఒటిఎస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జలమండలి రెగ్యూలర్ మీటర్ రీడర్లకు, కలెక్షన్ బృందాలతో కలిసి బిల్లులు వసూలులో అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్ష సమావేశంలో ఇడి మాట్లాడుతూ సిజిఎంలు న్యాయపరమైన సమస్యలతో దీర్ఘకాలికంగా బిల్లు చెల్లించకుండా ఉన్న వినియోగదారులను గుర్తించి, వారి సమస్యను పరిష్కరించడానికి చొరవ చూపాలన్నారు. సిజిఎంలు, జిఎంలు సెక్షన్‌కు ప్రత్యేక కలెక్షన్‌ల బృందాలను ఏర్పాటు చేసి, నూతన వ్యూహాలు అనుసరించి, ఒటిఎస్‌లో రెవెన్యూ పెరిగేలా చొరవచూపాలన్నారు. ఇప్పటీ వరకు అసలు చెల్లించని క్యాన్ నెంబర్లు ఈనెల చివరి నాటికి గుర్తించి వారికి నోటీసులు అందించి, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటిఎస్ పథకంపై ఏవైనా సందేహాలు ఉంటే జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313 కు ఫోన్ చేసి వాటిని నివృతి చేసుకోవచ్చు అన్నారు. సమావేశంలో జలమండలి ఇఎన్‌సి, రెవిన్యూ డైరెక్టర్ విఎల్ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్స్2 డైరెక్ట్ స్వామి, సిజిఎంలు, జిఎంలు పాల్గొన్నారు.

## పాఠశాల భవనం నిలిపేయడం సిగ్గుచేటు

### తక్షణమే నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి

### సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్



ప్రజాపక్షం/హైదరాబాద్ : నిధుల కొరతతో పాఠశాల భవన నిర్మాణం అపేయడం సిగ్గుచేటని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. సీతాఫల్‌మండిలో నిర్మాణ దశలో నిలిచిపోయిన పాఠశాల భవనాన్ని శుక్రవారం కాంపల్లి శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిధుల కొరతతో నిలిచిపోయిన స్కూల్ నిర్మాణానికి కేటాయించిన రూ.30 కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో చదువుతున్న వందలాది మంది విద్యార్థులను వేర్వేరు ప్రాంతాల పాఠశాలల్లో చేర్చడం ద్వారా అక్కడ విద్యాసంస్థల్లో సరైన సౌకర్యాలు లేక షిఫ్టులవారీగా తరగతులను నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేకసార్లు ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని, అందుకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తామని చెబుతున్నారు కానీ, ఆ మేరకు నిధులు కేటాయించడం లేదన్నారు. వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సీతాఫల్‌మండి పాఠశాల భవన నిర్మాణానికి నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆయన కోరారు. యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొమురెల్లి బాబు, సోమయ్య, ఎఐఎస్ఎఫ్ ఒయు అధ్యక్షులు చైతన్య యాదవ్, లెనిన్, గువ్వల మల్లేష్, నాగరాజు, శ్రీహరి, యాకయ్య, రమేష్, రవి, రవికాంత్, యాదగిరి, కుమార్ స్థానిక కాంగ్రెస్ నాయకురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : కుటుంబ కలహాలతోనే వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం మంతర్యా తండాకు చెందిన రమావత్ గోపినాయక్, ఉమాదేవి(26) దంపతులు వారి బతుకుదెరువు కోస ఇంజాపూర్‌లో నివాసం ఉంటున్నారు. కాగా దంపతుల మద్య కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు చేసి వారి ఒక్కటి చేశారు. కానీ గొడవలు పెరిగిపోతుండడంతో గురువారం పంచాయితీ చేశారు. సాయంత్రం ఇంట్లోకి వెళ్లి ఉమాదేవి ఉరి వేసుకుని ఆత్యహత్య చేసుకుంది. దీంతో ఆమె బంధువులు భర్త, అత్తమామాలపై తీవ్ర ఆందోళన చేశారు. భర్త, అత్తమామల కారణంగానే ఉమాదేవి మృతి చెందిందని వారి బంధువులు ఆరోపిస్తున్నారు. భర్త ఇంటి వద్ద ఉమాదేవి కుటుంబ సభ్యులు అందోళన దిగారు. దీంతో వనస్థలిపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్నవారికి నచ్చచెప్పి ఆందోళన విరమించారు. ఉమాదేవికి ఇద్దరూ కుమారులు ఉన్నారు. మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వనస్థలిపురం సిఐ శ్రీనివాస్ తెలిపారు.

## లగచర్ల ఘటనలో అరెస్టు చేసిన రైతులకు విడుదల చేయాలి

### ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ డిమాండ్



ప్రజాపక్షం/షాద్‌నగర్: లగచర్ల ఘటనలో అక్రమంగా అరెస్టు చేసిన గిరిజన అమాయక రైతులను తక్షణమే విడుదల చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబల్‌నాయక్ మాట్లాడుతూ ఫార్మ పరిశ్రమ కోసం భూసేకర చేసే సమయంలో రైతులు అధికారులకు అడ్డుకున్నారని, అప్పట్లోను దాడులు సైతం చోటు చేసుకున్నాయని..అప్పుడు భయటకు రాని ఘటనలు ఇప్పుడేందుకు ఇంతపెద్దగా సృష్టించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఘటన తరువాత ఆరు గిరిజన తండాలు, నాలుగు గ్రామాల్లో ఇప్పటికి భయానక వాతావరణాన్ని ప్రభుత్వం సృష్టించిందన్నారు. తండాలతోపాటు గ్రామాలకు బయటి వారిని రానివ్వకుండా పోలీసులతో పికెటింగ్ ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర కార్యదర్శి చందు నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ఇచ్చిన భూములను మళ్లీ తీసుకొని రైతులకు రోడ్డు పాలు చేయడం సరికాదని సూచించారు. గిరిజనులు స్వయంగా భూములు ఇస్తే తీసుకోవాలే తప్పా దౌర్జన్యం చేసి తీసుకొవద్దని సూచించారు. ప్రజల ఓట్లతో గెలిచి వారిపైనే కన్నెర్ర చేస్తే ఉద్యమాలు చేయడం ఖామమని హెచ్చరించారు. సమావేశంలో ఎల్‌హెచ్‌పిఎస్ నేతలు చందర్‌నాయక్, మల్లిఖార్జున్‌లు ఉన్నారు.

## భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు



ప్రజాపక్షం/ చంపాపేట: కార్తీక పౌర్ణమి సందర్భంగా చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానంజనేయ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. భక్తులు వేకువజాము నుంచే కార్తీక దీపాలను వెలిగించి స్వామి వారికి పూజలు చేశారు. అభిషేకాలు కుంకుమార్చనలు నిర్వహించారు. వేద పందితుల మంత్రోచ్చారణలతో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పవిత్రమైన కార్తీక మాసంలో వెలిగించే దీపాలు, ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇఒ లావణ్య, నాయకులు సందీప్‌రెడ్డి, దశరథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫరూఖ్‌నగర్: కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా నిర్వహించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉత్తర రామలింగేశ్వర స్వామిగా పేరుగాంచిన రామేశ్వరంలో భక్తులు పెద్ద ఎత్తును కార్తీక దీపాలను వెలిగించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు తెల్లవారు జాము నుండే సమీపంలో ఉన్న శివాలయాలకు కుటుంబ సమేతంగా చేరుకొని పారతీపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, దీపారాధన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉసిరి చెట్టు కింద ప్రత్యేకంగా తయారు చేసిన దీపాలను భక్తులు వెలిగించారు. దేవాలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శివాలయాల్లో కార్తీక దీపాలు వెలిగించడంతో కొత్త శోభ సంతరించుకుందని చెప్పవచ్చు. అదే విధంగా షాద్ నగర్ మున్సిపల్ పరిధిలోని కన్యకా పరమేశ్వరీ దేవాలయం, శివమారుతి గీతా అయ్యప్ప మందిరం, చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంతోపాటు కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరి గూడ మండల కేంద్రాలతోపాటు గ్రామీల్లోని దేవాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.







## సాంకేతికతో నాణ్యమైన విద్య అందించమే లక్ష్యం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అంధించేందుకు నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాలను నిర్మిస్తున్నట్లు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శుక్రవారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి కొత్తూరు మండలం ఎస్‌బిపల్లి మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ రూ.5లక్షలు, ఆగీరు శేఖర్ గుప్తా రూ.1.11లక్షల చెక్కులను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థుల శ్రేయస్సు కోసం నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవనానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే స్పూర్తితో కళాశాల భవనం నిర్మించడం, అందుల తమను భాగస్వాములను చేయడం సంతోషంగా ఉందని దాతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ యాదయ్య యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మెన్ విశ్వం, పట్టణ అధ్యక్షుటు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ జడ్పిటిసి విశాల శ్రావణ్‌రెడ్డి, నేతలు మహ్మద్ ఇబ్రహీం, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, రఘుమారెడ్డి, నర్సింలు, లింగారెడ్డిగూడ అశోక్‌లు ఉన్నారు






### రైతులు దళారులతో జాగ్రత్తగా ఉండాలి

కేశంపేట : రైతులు తాము పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొత్తపేట, కేశంపేట, తొమ్మిదిరేకులలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే అమ్ముకోవాలని సూచించారు. దళారులు ఎక్కువ మొత్తంలో ధరలు ఇస్తామని చెప్పి తూకాల్లో మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సరైన మద్దతు ధరతో పాటు సకాలంలో డబ్బులు చెల్లిస్తుందని, రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మాత్ర మే పంటను అమ్ముకోవాలని సూచించారు. లింగంధనలో భక్తులు నిర్వహించిన రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మెన్ జగదీశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ అంజిరెడ్డి, సిఇఒ అనిల్, మాజీ మార్కెట్ చైర్మెన్ యాదయ్యయాదవ్, మాజీ జడ్పిటిసి విశాలశ్రావణ్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడ వీరేష్, జగదీశ్వర్, భాస్కర్‌గౌడ్, అనసూయమ్మ, గిరియాదవ్, సురేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రూప్లా నాయక్, రాంరెడ్డి, కృష్ణయ్యగౌడ్, రమేష్, ప్రకాష్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, పర్వతాలు, సుందరయ్య, రాములు, లక్ష్మయ్య, రఘుపతి, పాండు పాల్గొన్నారు.

# మహానగరి

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాపక్షం/కాప్రా : 11 కెవి నోమా ఫీడర్, గాయత్రి నగర్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా వీటి పరిధి ప్రాంతాల్లో బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని మల్లాపూర్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కె.నాగరాజు తెలిపారు.

చాణిక్యనగర్, సూర్యానగర్, గోకుల్‌నగర్, మోడి వెంచర్స్, చాందియా నగర్, బాబా నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

## మరకత శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు



ప్రజాపక్షం/అల్వాల్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మరకత శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం భక్తులతో నిండిపోయింది. శుక్రవారం కార్తిక శుద్ధ పూర్ణిమ సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించిన ఆలయ వ్యవస్థాపక కార్యనిర్వాకులు డాక్టర్ మోత్కూరి సత్యనారాయణ శాస్త్రి వెల్లడించారు. మహిమాన్విత్వమైన పర్వదినం కార్తీక పౌర్ణమిరోజున దైవ దర్శనం దీపారాధన దీప సాలగ్రామ దానాలు దీపోత్సవం చేస్తే విశేష శుభ ఫలితాలు అనుగ్రహిస్తాయని తెలిపారు.

## ఘనంగా బాల హక్కుల వారోత్సవాలు

ప్రజాపక్షం/దుండిగల్ :బాల హక్కుల వారోత్సవాలు రెండో రోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆరాధన ఫౌండేషన్ చైర్మన్ కనుకటి బాలరాజు, న్యాయవాది కనుకటి భరత్ కుమార్ పాల్గొని బాలలకు బిస్కె ట్లు, చాక్లెట్లు పంపిని చేసి, సత్ప్రవర్తనతో మెదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రొబేటిన్ అధికారి వై.కాశీ విశ్వనాథ్, సీనియర్ హౌస్ మాస్టర్ ఉమేష్, విష్ణు మూర్తి, రమేష్, రఘుపతి, మహేశ్వర్ రెడ్డి ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వీధి దీపాలకు రూ.34లక్షలు మంజూరు

### ధన్యవాదాలు తెలిపిన కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం/ఉప్పల్ :భగాయత్ లే అవుట్ లో వీధి దీపాల కోసం రూ.34లక్షల నిధులు మంజూరు చేసి జోనల్ కమిషనర్ కు ధన్యవాదాలు తెలిపిన కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ భగాయత్ హెచ్ ఎండీఏ లే అవుట్ లో వీధి దీపాల మరమ్మతులకు రూ.34 లక్షల నిధులు మంజూరు చేయించినట్లుగా కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. భగాయత్ హెచ్ఎండిఏ లే అవుట్ లో వీధి దీపాల నిర్వహణ వ్యవస్థ సక్రమంగా లేదు. గతంలో హెచ్ఎండిఏ అధికారులు సైతం వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించలేదు. కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి ఇదే విషయాన్ని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కుమార్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి న జోనల్ కమిషనర్ హేమంత్ కుమార్ తక్షణమే రూ.34 లక్షల నిధుల ను మంజూరు చేశారు. దీంతో రజితాపరమేశ్వర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.





## దేవాలయంలో నూతన హాలు ప్రారంభించిన కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

ప్రజాపక్షం/మల్కాజిగిరి : కార్తిక పౌర్ణమి సందర్భంగా లల్వాని నగర్ ప్రాంతంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో వినాయకనగర్ కార్పొరేటర్ నూతనంగా నిర్మించిన హాలును శుక్రవారం ప్రారంభించారు. నిత్యం పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఆలయంలోని నూతన హాలు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆలయ చైర్మన్ గోపాల్ మధులేటి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసిన కార్పొరేటర్ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు. నరేష్, ఉమాకాంత్, కృష్ణ, కృష్ణమూర్తి, నాగార్జున తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జనవరి 5న దళిత హక్కుల మహాసభలు ప్రారంభం : కె.ఏసురత్నం

ప్రజాపక్షం/దుండిగల్:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గండిమైసమ్మ చౌరస్తాలో దళిత హక్కుల పోరాట సమితి జాతీయ మహాసభలు జనవరి 5వ తేదీన మోక్షగుండం విశ్వే శ్వ రయ్య భవన్ లో జరగనున్నాయి. ఈ దళిత హక్కుల మహా సభలను జయప్రదం చేయాలనీ దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె.యేసురత్నం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు బిక్షపతి, ఎల్లయ్య, యాదయ్య, మల్లయ్య, పుల్లయ్య, వెంకన్న, సురేష్, తదితరులు పాల్గొన్నారు.




## బాలకృష్ణకు విశ్వకర్మ సంఘం జాతీయ ఉత్తమ లీడర్ అవార్డు



ప్రజాపక్షం/శామీర్‌పేట : విశ్వకర్మ సమాజానికి ఉత్తమ సేవలందించిన మూడుచింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన వర్ణోజి బాలకృష్ణ విశ్వకర్మ సంఘం జాతీయ స్థాయి ఉత్తమ లీడర్ అవార్డు అందుకున్నారు. విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని అంబేద్కర్ భవన్‌లో భారత దేశంలోని 12 రాష్ట్రా ల్లో విశ్వకర్మ సమాజానికి సేవ చేసిన వారిని విశ్వకర్మ లీడర్స్‌గా గుర్తించి అవార్డుల ను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు, నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారీ, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ న్యూఢిల్లీ చీఫ్ ఫౌండర్ నీలందుల పుష్పగిరి, తెలంగాణ బిసి సంఘాల అద్యక్షుడు గణేష్‌చారీ, సెంట్రల్ మాజీ బిసి కమిషన్ సభ్యుడు ఆచారీ, చేతుల మీదుగా బాలకృష్ణకు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ విశ్వకర్మ సంఘం కార్యదర్శి ముత్యాల లక్ష్మన్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌చారీ, వీరబ్రహేంద్ర స్వామి ఆలయ కమిటి చైర్మన్ మహాంకాళీ అంజనేయులు, వర్ణోజి రాములు చారీలు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు : కూన శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/ నిజాంపేట్ : లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కూన శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గాజుల రామారంలోని శ్రీ నల్లగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో కార్తిక పౌర్ణమి వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూన శ్రీనివాస్ గౌడ్ విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అముర ఇంద్రసేనా గుప్త, నాయకులు కూన రవిందర్ గౌడ్, బాలరాజు, పెంటారెడ్డి, శ్రీరాములు, నర్సింహారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి పాల్గొన్నా రు.

## యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ కట్టడాలు



ప్రజాపక్షం/మల్కాజిగిరి : చెరువు ప్రాంతాలే కాకుండా ఎక్కడ అక్రమ కట్టడాలున్నా నిర్దాక్షిణ్యంగా బుల్డోజర్లు ఉపయోగిస్తూ కూల్చి వేస్తున్న హైడ్రా హెచ్చరికలను అక్రమార్కులు ఏ మాత్రం లెక్క చేయకుండా భయం లేకుండా తమ పనిని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రాజధాని నగరానికి ఆనుకొని ఉన్న మల్కాజిగిరి నియోజకవర్గంలో గజం భూమి లక్ష రూపాయలకు పైగా సైతం పలుకుతుండటం ప్రధాన కారణమవుతోంది. అక్రమ కట్టడాలను ప్రారంభం నుండి అరికట్టాల్సిన సంబంధిత అధికారులు లాలూచి పడి నిర్మాణాలకు అనుమతులు కోరినప్పటి నుండి పూర్తయ్యే వరకు చూసీ చూడనట్లు వ్యవహరించటమే కాక తప్పించుకొనేందుకు అవసరమైన సలహాలిస్తూ పరోక్ష సహకారం ఇస్తుండటమే దీనికి కారణమవుతోంది. నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను అక్రమించి నిర్మాణాలు కొనసాగించటం అలవాటుగా మారి ముదిరి పోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, బిల్డర్లు ఇప్పటికీ ఈ అడ్డగోలు చర్యలు యథేచ్ఛగా చేస్తూనే ఉన్నారు. రెండు, మూడు అంతస్తులకే (G+2) నిర్మాణాలకు మాత్రమే అనుమతులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా వాటిపై అక్రమంగా మరో రెండు, మూడు అంతస్తులు నిర్మించటమే కాకుండా వాటిపై మరో పెంట్ హౌజ్ నిర్మాణాలు పరదా చాటున అధికార్ల పరోక్ష సహకారంతో వేగంగా నిర్మాణాలు పూర్తి కానిస్తున్నారు. నియోజక వర్గంలోని జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు పక్కనే ఉన్నా అక్కడ నిర్మాణాలకు సంబంధించి పర్యవేక్షించి నిబంధనలను అతిక్రమించకుండా చూడాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. నేరేడ్‌మెట్,వినాయకనగర్, మౌలాలి, గౌతంనగర్, మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్, సైనిక్‌పురి, ఆల్వాల్, కౌకూర్, వినాయకనగర్, డిఫెన్స్ కాలనీ, శివసాయినగర్, వాయుపరి, ఇలా అన్ని ప్రాంతాల్లో ఎక్కడ చూసినా వందలాది బహుళ అంతస్తు నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. తమకు చెందిన స్థలాలే కాకుండా పక్కనే ఉండే ప్రభుత్వ భూము లు, రహదార్లను సైతం లెక్క చేయకుండా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతోంది.

## ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్ చేస్తున్న వారిపై చర్యలు

### సిపిఐ నాయకుల డిమాండ్



ప్రజాపక్షం/పరిగి రూరల్: పరిగి మండలం రంగపూర్ గ్రామపరిదిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మైనింగ్ చేస్తున్న వారిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుల డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పరిగి డివిజన్ కార్యదర్శి పీర్ మహ్మద్ వ్యవసాయ కార్మిక సంగం (బికెఎంయు) జిల్లా కార్యదర్శి ఎం. వెంకటేష్‌లు మాట్లాడుతూ రంగపూర్ గ్రామ పరిధిలో గల ప్రభుత్వ భూమి సర్వే నం.50 లో కొందరు ప్రవేట్ వ్యక్తులు అక్రమంగా రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ ఖనిజ సంపదను దోచుకుపోతున్నారు. ప్రభుత్వ నుండి ఎలాంటి అనుమతులు లెకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. అక్రమ దారులు రోజు రోజుకు అదుపు లేకుండా పోయింది. ప్రభుత్వ భూముల పైన కన్నేసి కబ్జాలు చేయడం మైనింగ్ చేయడం వ్యాపారం చేస్తున్నారు. కాబట్టి ప్రభుత్వ భూమి లో అక్రమంగా మైనింగ్ చేస్తున్న అక్రమ దారుల పైన చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని యెడల సీపీఐ, వ్యవసాయ కార్మిక సంగం ఆధ్వర్యంలో ఉద్యమలు చేపడతాం. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్షా కేంద్రాలవద్ద పటిష్ట బందోబస్తు



ప్రజాపక్షం/పరిగి రూరల్ : గ్రూప్ 3 పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పరిగి ఎస్ఐ సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ఈనెల 17, 18వ తేదీలో జరుగుతున్న గ్రూప్3 పరీక్ష కేంద్రాలు పరిగి పట్టణంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్, పల్లవి డిగ్రీ కళాశాల, న్యూ బ్రిలియంట్ హై స్కూల్, విజ్ఞాన్ జూనియర్ కళాశాల, విద్య అరణ్యపురి లోని ఒగా బిఈడి కళాశాలలో సెంటర్లు ఉన్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పరిగి పట్టణంలో144 సెక్షన్ అమలులో ఉంటుందని, గుంపు లు గుంపులుగా ఉండకూడదని, జిరాక్స్ సెంటర్ల ను మూసి వేయాలన్నారు. పరీక్ష కేంద్రాలలో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి ఉండదని తెలిపా రు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయపాలన పాటించాలని తెలిపారు.

## లక్మాపూర్ ప్రాజెక్ట్‌లో చేప పిల్లలను వదిలిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/పరిగి రూరల్ : పరిగి శాసన సభ్యులు గౌరవ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారి ఆదేశం మేరకు మొదటి విడతగా 74 వేల చేప పిల్లలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరిగి మండలంలోని లక్నాపూర్ ప్రాజెక్ట్ యందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విడిచి పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి తెలంగాణ ముదిరాజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమంతు ముదిరాజ్, పరిగి పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, ఫిషరీస్ ఏడి (అసిస్టెంట్ డైరెక్టర్ వెంకయ్య, కాంగ్రెస్ నాయకులు అభిరామ్ పంతులు, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షులు ఆనెం ఆంజనేయులు, చిన్న నరసింహులు, లక్మాపూర్ ఎక్స్ సర్పంచ్ వెంకటయ్య,పార్వత్ రెడ్డి, సుల్తాన్పూర్ రామ్ రెడ్డి, శౌర్య నాయక్, ఘనెమొని శ్రీనివాస్, కౌన్సిలర్ మల్లేష్ యాదవ్, ఫిషరీస్ డిపార్ట్మెంట్ సంజీవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి జగన్, తదితరులు పాల్గొన్నారు.



## కార్తీక పౌర్ణమి పూజల్లో ఎమ్మెల్యే బండారి

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : కార్తీక పౌర్ణమి సందర్భంగా మల్లాపూర్ శ్రీ నందీశ్వరాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కల్సి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శివుడి అనుగ్రహంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సత్తా ఇవ్వాలని కోరుకొన్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, వాన్పరి శ్రీనివాస్, కృష్ణవేణి, జోగు వీరేష్, విజయ లక్ష్మి, వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీ హరిగౌడ్, సుదర్శన్, పిఆర్ నాగరాజు, శ్రీశైలం, పద్మరెడ్డి, సోమిరెడ్డి, సాయి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కార్తీకపౌర్ణమి ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/శామీర్‌పేట : ఉమ్మడి శామీర్‌పేట మండలంలో శుక్రవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా శివ, విష్ణు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు తెల్లవారుజామున గంగ స్నానాలు ముగించుకుని చెరువుల వద్ద దీపారాధన చేశారు. గంగకు హరతులు ఇచ్చి ప్రజలందరిని చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం శివ, వైష్ణవ ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకుని ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటి నిర్వాహకులు విద్యుత్ దీప కాంతులతో ఆలయాలను అలంకరించారు. మహిళలు, యువతులు ధీపారాధన చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. తూంకుంట మున్సిపాలిటీలోని గాయత్రీ మహాక్షేత్రంలో మాజీ ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్ శివుడికి మహాన్యాస రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## పాత్రికేయుడు లక్ష్మారెడ్డి వైద్యానికి ఆర్థిక సాయం



ప్రజాపక్షం/మల్కాజిగిరి : గాయాలకు గురై చికిత్స పొందుతున్న పాత్రికేయుడు లక్ష్మారెడ్డి ని బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, శ్రీనివాసరావులు శుక్రవారం పరామర్శించారు. తమ వంతుగా రూ. 15 వేలు ఆర్థిక సాయాన్ని వైద్యం కోసం అందించి త్వరలో కోలుకోవాలని ఆంకాక్షిస్తూ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

### ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి

ప్రజాపక్షం/తాండూరు:విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణ శివారులోని గౌతమి మాడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న అండ్ 17బాలుర ఖోఖో స్టేట్ మీట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హజరైన ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి క్రీడా జ్యోతి వెలగించి క్రీడాలను ప్రారంభించారు. అంతకు ముందు క్రీడాకారుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఈ లాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలకితీసే వాళ్ళమవుతామన్నారు. త్వరలో తాండూరులో క్రీడా టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసేవిధంగా వ్యాయమ ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అందుకు గాను తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని ఎంఎల్ఎ పేర్కో న్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, గౌతమి మాడల్ స్కూల్ కరస్పాండెంట్ మహిపాల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, ధారాసింగ్, ఎంఈఎ సుధాకర్‌రెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యా ర్థులు పాల్గోన్నారు.





## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్రజాపక్షం/ నిజాంపేట్ : విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని నిజాంపేట్ విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నిజాంపేట్, శ్రీనివాస కాలనీ, నిజాంపేట్‌ల 11కెవి ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా బాలాజీ వెస్ట్ కౌంటీ, కెఎఫ్‌సి బిల్డింగ్, శ్రీనివాస్ హౌసింగ్ సొసైటీ, చాకలి బస్తీ, బాలాజీ కాలనీ, పోలామ్ పల్లి విల్లాస్, సిఎంఆర్ షాపింగ్ మాల్, రాసి విల్లాస్, ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 3, శివాలయం, కెటిఆర్ కాలనీ, బాలాజీ మెడోస్, అకఖిల విల్లాస్, శ్రీనివాస సొసైటీ తదితర కాలనీలలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 16:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని రాజు కోరారు.

**శామీర్‌పేటలో..** అలియాబాద్ సబ్ స్టేషన్ పరిధిలోని జగ్గంగూడ ఫీడర్‌లో నేడు(శనివారం) విధ్యుత్ అంతరాయం ఉంటుందని అలియాబాద్ ఎఇ వెంకటనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాల్‌గడిమలక్‌పేట, గుబ్బా కోల్డ్ స్టోరేజ్ తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఉందని తెలిపారు. విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను నరికివేస్తున్న క్రమంలో విధ్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుందని చెప్పారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

**తాండూరు పట్టణంలో..**శనివారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం విధిస్తున్నట్లు తాండూరు డివిజన్ డిఈ భానుప్రసాద్, తాండూరు పట్టణ విద్యుత్ ఎఈ రఘువీర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.అంతారం 11కేవి ఫీడర్‌పై మరమ్మతులు చేపడుతునందున తాండూరు మున్సిపల్‌లో గుండు పీర్లు, ఎన్ఆర్‌టిఆర్ కాలని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతారయం ఉంటుందని పేర్కొన్నారు. విధ్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.



## వచ్చేనెల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాపక్షం/అల్వాల్ : అతి పురాతనమైన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీవారి బ్రహ్మోత్సవాల గోడ పత్రికను ఆలయ వంశం పరంపర్య ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా సంజయ్ గోపాల్ సెంచర్ ఆలయ అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 6 నుండి 15 వరకు బ్రహ్మోత్సవాలు జరుపుకొనుటకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వెంకట్ రెడ్డి, ఆలయ మాజీ ధర్మకర్తలు వెంకట్రాం రెడ్డి, సురేందర్ రెడ్డి, శివ రామకృష్ణ, రామచందర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## రూ.26 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాపక్షం/ఉప్పల్ : ఏఎస్ రావు నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 55 మంది లబ్ధిదారులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా 26 లక్షల 08 వేల 500 రూపాయల చెక్కులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిఎంఆర్ ఎఫ్ నీ అందరూ సద్వినియోగ పరుచుకోవాలని ఆయన అన్నారు. సిఎంఆర్ఎఫ్, పేదలకు వరం అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చెక్కులను తొందరగా వచ్చేలా ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, చిలుక నగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, మహేష్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాండూరులో ఆర్ఎంపి వైద్యుల ఇష్టారాజ్యం

### క్లినిక్‌ను సీజ్ చేసిన జిల్లా వైద్యాధికారులు

ప్రజాపక్షం/తాండూరు: తాండూరులో ఆర్ఎంపి వైద్యులు రెచ్చిపోయ్యారు. వచ్చి రాని వైద్యంతో పేదల జీవితాలతో ఆటలాడుతున్నారు. మూడు సంవత్సరాలు ఎ డాక్టర్ వద్దనో ప్రాక్టీస్ ఎలాంటి అనుమతులు లేకుండా క్లీనిక్‌లను పుట్టగొడుగులా పట్టుకొస్తున్నారు.తాండూరు పట్టణంతో పాటు తాండూరు నియోజకవర్గంలో ఆర్ఎంపి వైద్యులు తమ ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అచ్చి రాని వైద్యంతో నిరుపేదల ప్రాణాలతో చెలగాటం మాడుతున్నారు. వీరి ఆగడాలను అరికట్టాల్సిన జిల్లా వైద్యాధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. వారికి తోడు తాండూరు పట్టణంలోని ప్రముఖ వైద్యులు వారిని ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఎంపి వైద్యుల వద్దకు వైద్యం కోసం వచ్చే వారిని తమకు నర్సింగ్, ఆసుపత్రులకు అనుకూలంగా ఉన్న వైద్యులకు వద్ద రెఫర్ చేస్తున్నారు. గత సంవత్సరం తాండూరు పట్టణంలో ఓ ఆర్ఎంపి వైద్యుడి రాసలీలా ఘటన మరువక ముందు రెండు రోజుల క్రితం తాండూరు పట్టణంలో మరో ఆర్ఎంపి వైద్య వైద్య వికటించి ఏకంగా నిరుపేద మహిళ కాలు చచ్చబడి పోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. యాలాల మండల పరిధి దౌలాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మిబాయి కొన్నాళ్ళుగా మోకాళ్ళ నోప్పులతో బాధపడుతుంది. దీంతో వైద్యానికి తాండూరు పట్టణంలోని పాత కూరగాయాల మార్కెట్‌లోని ఆర్ఎంపి వైద్యుడు ముఖీద్‌ను సంప్రదించారు. నాలుగుఐదు రోజులు ఆమే పరిక్షించిన వైద్యుడు ఆమే మోకాళ్ళలో చీమునిండిందని, చెప్పి మొకాళ్ళకు సూదులు ఇచ్చారు. దీంతో మోకాళ్ళ నొప్పుల సంగతి దేవుదేరుగా ఉన్న కాళు చ్చబడి పోయింది. ఇది గమనించిన కుటుంబికులు ఆర్ఎంపి వైద్యుడిని నిలదీయగ చెతులెత్తేశాడు. మరో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్ళానికి రిఫర్ చేశాడు. తమకు తీవ్ర అన్యాయం చేసిన ఆర్ఎంపి వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాండూరు పోలీసులకు, జిల్లా వైద్యాధికారులకు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును అందుకున్న జిల్లా వైద్యాధికారులు గురువారం ముఖీద్ నిడిపిస్తున్న ఆసుపత్రిని విచారణ చేపట్టి సీజ్ చేశారు.

# క్రీడ

# పాక్ వక్రబుద్ధికి ఐసిసి చెక్..

## పిఒకెలో ఛాంపియన్స్ ట్రోఫీ టూర్ రద్దు

ఛాంపియన్స్ ట్రోఫీ టూర్ విషయంలో పాక్ కుటిల యత్నాలకు ఐసిసి చెక్ పెట్టింది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లో ఆ దేశ క్రికెట్ బోర్డు నిర్వహించ తలపెట్టిన ఛాంపియన్స్ ట్రోఫీ టూర్‌ను రద్దు చేసింది. ఈ విషయంలో ఐసిసిని బిసిసిఐ సంప్రదించడంతో వెంటనే ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది జరగాల్సిన ఛాంపియన్స్ ట్రోఫీకి అధికారిక షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) ఇంకా ప్రకటించనప్పటికీ.. ట్రోఫీ టూర్‌ను మాత్రం మొదలుపెట్టింది. ఇందులో భాగంగా కప్పును తొలుత పాకిస్థాన్‌కు పంపింది. దీంతో పాక్ క్రికెట్ బోర్డు టూర్ షెడ్యూల్‌ను తాజాగా ప్రకటించింది. నవంబరు 16న ఇస్లామాబాద్ నుంచి ఈ ట్రోఫీ టూర్ ప్రారంభం కానుంది. అయితే, షెడ్యూల్‌లో పిఒకెలో ఉన్న స్కర్దు, హుంజా, ముజఫరాబాద్ ప్రాంతాలను కూడా పాక్ చేర్చింది. భారత్‌ను కవ్వించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దాయాది దేశంలో టీమ్ఇండియా పర్యటించేది లేదని బిసిసిఐ స్పష్టం చేసిన నేపథ్యంలో పాక్ ఈ రూపంలో తన వక్ర బుద్ధిని బయటపెట్టింది. ఈ కుటిల యత్నాలకు చెక్ పెట్టేందుకు భారత్ సత్వరమే స్పందించింది. ఐసిసి ముందు తన అభ్యంతరాలను లేవనెత్తింది. దీనిపై స్పందించిన ఐసిసి పిఒకె టూర్‌ను రద్దు చేసింది. దీంతో మరోసారి అంతర్జాతీయ వేదికలపై తన పరువు తానే తీసుకుంది. మరోవైపు ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లను పాకిస్థాన్‌లోని లాహోర్, రావల్పిండి, కరాచీ వేదికగా నిర్వహించాల్సి ఉంది. అయితే, ఈ టోర్నీ కోసం ఆ దేశానికి వెళ్లేదే లేదని ఐసీసీకి బీసీసీఐ తేల్చిచెప్పింది. హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహించాలని భారత్ కోరుతోంది. దీనికి అంగీకరించేది లేదని పీసీబీ పట్టుదలగా ఉంది. దీంతో షెడ్యూల్ ప్రకటన ఆలస్యమవుతోంది.




## శతక్కొట్టిన సంజూ, తిలక్..

### చరిత్ర సృష్టించిన భారత్



సౌతాఫ్రికాతో చివరి టీ20లోనూ భారత బ్యాటర్లు దుమ్మురేపారు. వికెట్ కీపర్ కమ్ ఓపెనర్ సంజూ శాంసన్(56 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్స్‌లతో 109 నాటౌట్), తెలుగు తేజం తిలక్ వర్మ(47 బంతుల్లో 9 ఫోర్లు, 10 సిక్స్‌లతో 120 నాటౌట్) విధ్వంసకర శతకాలతో చెలరేగారు. దాంతో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవరల్లో వికెట్ నష్టానికి 283 పరు గుల భారీ స్కోర్ చేసింది. అభిషేక్ శర్మ(18 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 36) దూకుడుగా ఆడాడు. భారత బ్యాటర్ల ధాటికి సౌతాఫ్రికా బౌలర్లు పోటా పోటీగా పరుగులిచ్చుకున్నారు. లుతో సిపమ్లా ఒక్క వికెట్ తీయగా.. మిగతా బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. విదేశీ గడ్డపై టీమిండియాకు ఇదే అత్యధిక టీ20 స్కోర్. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెన ర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఇద్దరూ భారీ సిక్సర్లతో విరుచుకుపడటంతో వేగంగా పరుగులు వచ్చాయి. పవర్ ప్లేలో చివరి బంతికి అభిషేక్ శర్మ కీపర్ క్యాచ్‌గా వెనుదిరగడంతో తొలి వికెట్‌కు నమోదైన 73 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. సంజూ శాంసన్ తన జోరును కొనసాగించాడు. ట్రిస్టన్ స్టబ్స్ వేసిన 10వ ఓవర్‌లో వరుసగా రెండు సిక్స్‌లు బాది 28 బంతుల్లో సంజూ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇందులో సంజూ కొట్టిన ఓ సిక్సర్‌కు లేడీ ఫ్యాన్ దవడ పగలడం విశేషం. సంజూకు తగ్గట్లుగానే తిలక్ వర్మ కూడా వరుస బౌండరీలతో చెలరేగాడు. మార్క్‌రమ్ వేసిన 14వ ఓవర్‌లో బౌండరీ బాది 21 బంతుల్లోనే తిలక్ వర్మ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇద్దరి విధ్వంసంతో టీమిండియా 14.1 ఓవర్లలోనే 200 పరుగుల మార్క్‌ను చేరుకుంది. గెరాల్డ్ కోయిట్జీ వేసిన 15వ ఓవర్‌లో సంజూ, తిలక్ వర్మ ఇచ్చిన క్యాచ్‌లను సఫారీ ఫీల్డర్లు వదిలేసారు.




## ఐపిఎల్ వేలానికి 1,574 మంది దరఖాస్తు

### 574 మందితో షార్ట్ లిస్టు

ఐపిఎల్ 2025 మెగా వేలంలో పాల్గొనడానికి 1,574 మంది క్రికెటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 574 మందిని షార్ట్ లిస్ట్ చేశారు నిర్వాహకులు. ఈ వివరాలను ఐపిఎల్ తన అధికార సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. మెగా వేలాన్ని నవంబర్ 24, 25వ తేదీల్లో జెడ్డా (సౌదీ అరేబియా) వేదికగా నిర్వహించనున్నారు. నవంబర్ 24న భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మెగా వేలం ప్రారంభం కానుంది. గతంలో వేలం నిర్వాహకురాలిగా మల్లికా సాగర్ వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఈ సారి కూడా ఆమెనే నిర్వహించే అవకాశముందని తెలుస్తోంది. భారత క్యాప్‌డ్ ప్లేయర్లు 48 మంది ఉండగా, విదేశీ క్యాప్‌డ్ ప్లేయర్లు 193 ఉన్నారు. అన్‌క్యాప్‌డ్ ఇండియన్ ప్లేయర్స్ 318, ఫారెన్ అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు 12, అసోసియేట్ దేశాలకు చెందిన ముగ్గురు ప్లేయర్లు వేలంలో పాల్గొననున్నారు. కనీస ధర రూ.2 కోట్లు ఉన్న ప్లేయర్స్ 81 మంది ఉన్నారు. బేస్ ధర రూ.1.50 కోట్లు ఉన్న ఆటగాళ్లు 27 మంది ఉన్నారు. అత్యధికంగా 320 మంది ప్లేయర్స్ కనీస ధర రూ.30 లక్షలతో వేలంలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నారు. తొలి సెట్‌లో శ్రేయస్ అయ్యర్, జోస్ బట్లర్, రిషభ్ పంత్, అర్ష్‌దీప్ సింగ్, కగిసో రబాడ, మిచెల్ స్టార్క్ ఉన్నారు. సెట్ 2లో లివింగ్‌స్టోన్, యుజ్వేంద్ర చాహల్, కేఎల్ రాహుల్, డేవిడ్ మిల్లర్, షమి, మహ్మద్ సిరాజ్‌లు చోటు సంపాదించుకున్నారు. సెట్ 3లో డేవాన్ కాన్వే, హ్యారీ బ్రూక్, మార్‌క్రమ్, జేక్ ఫ్రేజర్, రాహుల్ త్రిపాఠి, దేవదత్ పడిక్కల్, డేవిడ్ వార్నర్ ఉన్నారు.

# రీల్

## 'బాలయ్య 109' టైటిల్ డాకు మహారాజ్



ఈ ఏడాదిలో ఆల్రెడీ నందమూరి అభిమానులకి కావాల్సిన హై ని మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ నటించిన దేవర తో దక్కింది. అయితే ఇది కాకుండా మరో అవైటెడ్ సినిమా కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. అదే నందమూరి నటసింహం బాలయ్య నటిస్తున్న తన కెరీర్ 109వ సినిమా. దర్శకుడు కొల్లి బాబీ తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై నెక్స్ట లెవెల్ హైప్ ఉంది. బహుశా బాలయ్య ఈ మధ్య కాలంలో వచ్చిన అన్ని సినిమాల కంటే దీనిపైనే ఎక్కువ హైప్ ఉందని చెప్పొచ్చు. అలా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న టైటిల్ టీజర్ ని అయితే మేకర్స్ ఎట్టకేలకి రిలీజ్ చేశారు. దీనితో ఈ టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేసేసారు. మరి బాలయ్యపై నెక్స్ట లెవెల్ ఎలివేషన్స్ డైలాగ్స్ తో అదిరిపోయే లెవెల్లో ఉందని చెప్పాలి. అలాగే తనపై చూపించిన పలు గ్రాండ్ షాట్స్ కానీ అంచనాలు పెంచే విధంగా ఉన్నాయి. ఇంకా లాస్ట్ లో అయితే తన ముఖాన్ని రివీల్ చేసే సన్నివేశం గూస్ బంప్స్ ఇచ్చే లెవెల్లో ఉందని చెప్పాలి. అలాగే బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ మంచి స్టైలిష్ అండ్ డైనమిక్ గా కూడా కనిపిస్తున్నాడు. మరి ఈ చిత్రంలో బాలయ్య డాకు మహారాజ్ గా కనిపించనుండగా అదే టైటిల్ తో విధ్వంసం సృష్టించేందుకు తాను రాబోతున్నా డు, అలాగే వచ్చే ఏడాది జనవరి 12న సినిమాని వరల్డ్ వైడ్ గా తీసుకొస్తున్నట్టుగా మేకర్స్ అనౌన్స్ చేసేసారు.



## సూపర్ ఎంటర్‌టైన్‌మెంట్ తో రాబోతున్న రానా దగ్గుబాటి..

మన టాలీవుడ్ టాలెంటెడ్ అండ్ వెర్సటైల్ హీరోస్ లో రానా దగ్గుబాటి కూడా ఒకరు. మరి రానా ఒక్క తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా లెవెల్లో సినిమాలు పలు షోస్ కూడా చేసిన సంగతి తెలిసిందే. రీసెంట్ గానే సూపర్ స్టార్ రజినీకాంత్ సినిమా వేట్టయన్ లో తాను విలన్ రోల్ లో కూడా కనిపించి మెప్పించాడు. అయితే దీని తర్వాత ఓ సాలిడ్ టాక్ షోతో రాబోతున్నట్టుగా అనౌన్స్ చేసాడు. ప్రముఖ స్ట్రీమింగ్ యాప్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ది రానా దగ్గుబాటి షో అంటూ అనౌన్స్ చేసిన ఈ షో నుంచి ఇపుడు మేకర్స్ ప్రోమోని వదిలారు. మరి ఇది మాత్రం మంచి ప్రామిసింగ్ గా ఉందని చెప్పాలి. దర్శక దిగ్గజం ఎస్ ఎస్ రాజమౌళి, నాని, నాగ చైతన్య, సిద్ధూ జొన్నలగడ్డ, శ్రీలీల ఇంకా ఎంతోమంది స్టార్స్ ఈ షోలో పాల్గొన్నట్టుగా ఇందులో కనిపిస్తుంది. అలాగే ఇతర టాక్ షోస్ కి భిన్నంగా ఇది ఇన్ డోర్ లోనూ అలాగే అవుట్ డోర్ లోనూ కనిపిస్తుంది. అందరికీ ఎంతో ఫన్ గా ఎంటర్టైనింగ్ గా ఈ ప్రోమో అయితే ప్రామిసింగ్ గా ఉందని చెప్పాలి. ఇక ఈ టాక్ షోని ప్రైమ్ వీడియో వారు ఈ నవంబర్ 23 నుంచి ఎపిసోడ్స్ వారీగా అందుబాటులోకి తీసుకొస్తున్నారు. మరి చూడాలి ఈ షో ఎలా ఉండబోతుంది అనేది.




## వీరమల్లు ఫస్ట్ సింగిల్ పై లేటెస్ట్ టాక్..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్ గా దర్శకుడు జ్యోతి కృష్ణ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం హరిహర వీరమల్లు కోసం అందరికీ తెలిసిందే. అయితే ఎప్పుడు నుంచో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం ఇపుడు అంతిమ దశలో ఉంది. ఇంకా పవన్ కొన్ని రోజులు కేటాయించాల్సి ఉండగా ఇటీవల సినిమా ఫస్ట్ సింగిల్ ని విడుదల చేస్తామని చెప్పిన మేకర్స్ ఆ తర్వాత దాని ఊసే వదిలేశారు. ఇక లేటెస్ట్ గా అయితే దీనిపై మరో టాక్ వినిపిస్తుంది. దీని ప్రకారం ఈ సాంగ్ రానున్న డిసెంబర్ రెండో వారానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ భారీ సినిమాకు కీరవాణి సంగీతం అందిస్తున్నారు అలాగే ఏ ఎం రత్నం నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.



## దగా చేయకండి

(మొదటి పేజీ తరువాయి)

బోనసును పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. కేంద్రాల రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని జాప్యం లేకుండా మిల్లర్లు కొనుగోలు చేయాలనీ, గొనె సంచుల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులకు సకల సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, డిసిఏంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు, ఎంపీడీవో చంద్రశేఖర్, డిటి, ఎంపీవో రాకేష్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మాజీ జెడ్‌పిటిసి ఎరంశెట్టి ముత్తయ్య, సిపిఐ నాయకులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, డీ సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీనివాసరావు, చెన్నయ్య, రంజిత్, చందులాల్, మాజీ ఎంపీటీసీ మోహన్‌రావు, మాజీ సర్పంచ్ భూక్య విజయ్, వైఎస్ గిరి, ఎస్‌కే లాల్ పాషా, ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు కొండ వెంకన్న, చింతా నాగరాజు, పంచాయితీ రాజ్ ఏఈ, మిషన్ భగీరథ, ఏఈ భార్గవి, మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్, ఆర్ఐ అచ్చ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**ఆర్‌టిసి ప్రయాణ సేవలు మరింత మెరుగుపడాలి**

ఆర్‌టిసి ప్రయాణ సేవలు మరింత మెరుగుపడేలా ఆర్‌టిసి యాజమాన్యం కృషి చేయాలని, ప్రతి పల్లెకు బస్సు సౌకర్యం కల్పించి ప్రజల ప్రయాణం కష్టాలని తీర్చాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం డిపో నుంచి హైదరాబాద్ మియాపూర్‌కు నూతనంగా ఏర్పాటు చేసిన ఇంద్రా ఏసి బస్సులు శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ చాలా ఏజెన్సీ గ్రామాలకు ఆర్‌టిసి ప్రయాణ సేవలను అందించే పరిస్థితి లేదని, ఆదాయాని పరిగణనలోకి తీసుకొని బస్సులను రద్దు చేస్తే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

**తండాలను అభివృద్ధి పథంలో నడుపుతాం**

గిరిజన తండాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు కావాల్సిన మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



అన్నారు. లక్ష్మీ దేవిపల్లి మండలం లాలుతండా గ్రామపంచాయతీకి చెందిన 20 కుటుంబాలు శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కూనంనేని సమక్షంలో సిపిఐలో చరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, త్రాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న గిరిజన గ్రామాలకు గుర్తించి సత్వర కల్పనకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే వివిధ పథకాల్లో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, మిగిలి పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు.

## ఈ నెల 19న సిఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌లో పర్యటన

### ఏర్పాట్లపైన మంత్రి కొండా సురేఖ సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్:'ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల్లో' భాగంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ నెల 19న వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. ముఖ్యమంత్రి వరంగల్ పర్యటన నేపథ్యంలో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూట్ మ్యాప్, వేదిక ఏర్పాట్లు, పార్కింగ్ తదితర లాజిస్టిక్ అంశాలపై అధికారులతో వారు చర్చించారు. ఎటువంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి కొండా సురేఖ అధికారులను సూచించారు. అధికారులంతా సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్‌రాజు, ఆర్అండ్‌బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీశ్, వరంగల్ జిల్లా పరిధిలోని కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రక్షణ వ్యవస్థ వెర్షన్ 4.0ను ద.మ. రైల్వే వ్యాప్తంగా 1465 రూట్ కి.మీ.లలో ఏర్పాటు

ప్రజాపక్షం /హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే లో కవాచ్ 4.0 వెర్షన్ ను సనత్‌నగర్ వికారాబాద్ సెక్షన్‌లో 63 రూట్ కిలోమీటర్ల మేర విజయవంతంగా ప్రారంభించారు. కవచ్ వ్యవస్థ అనేది రీసెర్చ్ డిజైన్స్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ ద్వారా భారతీయ రైల్వే దేశీయంగా అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ కావడంతో అప్‌గ్రేడ్ చేసిన వెర్షన్ దేశంలోని విస్తారమైన రైల్వే నెట్‌వర్క్‌లో రైలు కార్యకలాపాల భద్రతను మరింత మెరుగుపరుస్తుంది. ఈ వ్యవస్థ రాబోయే కొన్ని సంవత్సరాలలో మొత్తం రైల్ నెట్ వర్క్ లో ప్రధాన రక్షణ వ్యవస్థ గా ఏర్పడి పూర్తి రక్షణకు సహాయపడుతుంది. స్వదేశీంగా అభివృద్ధి చేసిన ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ కవచ్ దక్షిణ మధ్య రైల్వేలో 1,465 రూట్ కిమీ (ఆర్.కె.ఎమ్ ) మేర అమలు చేస్తున్నారు. కవచ్ రక్షణ వ్యవస్థను ప్రధాన మంత్రి 'ఆత్మనిర్భర్ భారత్ ' చొరవను ముందుకు తీసుకెళ్లడంలో భారతీయ రైల్వేలు తీసుకున్న ప్రధాన చొరవలలో ఇదొకటి కావడం గమనార్హం. ఈ కవాచ్ వ్యవస్థను రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్.డి.ఎస్.ఓ)ఇండియన్ ఇండస్ట్రీ సహకారంతో అభివృద్ధి చేశారు. దక్షిణ మధ్య రైల్వేకు దీని అభివృద్ధి దశ నుండి మొదలు కొని అమలు చేసే వరకు చాలా చొరవను చూపిస్తోంది. కవచ్ వెర్షన్ 4.0 రైల్వే చరిత్రలో ఒక ప్రధాన మైలురాయిగా నిలువనుంది. దక్షిణ మధ్య రైల్వేలో నేటి వరకు కవాచ్ 1,465 రూట్ కిమీలు, 144 లోకోమోటివ్‌లలో ఏర్పాటు చేశారు. తాజా వెర్షన్ కవాచ్ 4.0ను సనత్‌నగర్ వికారాబాద్ సెక్షన్‌లో 63 రూట్ కిలోమీటర్ల మేర విజయవంతంగా ప్రారంభించారు. అలాగే కవాచ్ వెర్షన్ 3.2 ను నాగర్‌సోల్ ముద్ఖేడ్ ధర్మాబాద్ నిజామాబాద్ సికింద్రాబాద్ కర్నూలు సిటీ ధోన్‌గుంతకల్ విభాగంలో 959 రూట్ కిలోమీటర్ల మేర, అలాగే వికారాబాద్ బీదర్ సెక్షన్ 90 రూట్ కిలోమీటర్లు , వికారాబాద్ వాడి సెక్షన్లు 112 రూట్ కిలోమీటర్ల మేర కూడా విజయవంతంగా ప్రవేశ పెట్టారు. ఇంకా కవాచ్ 3.2ను బీదర్ పర్లి వైజ్‌నాథ్ పర్భానీ సెక్షన్లో 241 రూట్ కిలోమీటర్ల మేర కూడా విస్తరించారు.



**కవచ్ ముఖ్యమైన లక్షణాలు ఇవీ**

లోకో పైలట్ విధి నిర్వహణలో విఫలమైతే బ్రేక్‌ల స్వయంచాలక అప్లికేషన్ ద్వారా రైలును నిలుపుదల చేయవచ్చు. తద్వారా లోకో నుండి లోకో కు ప్రత్యక్ష సమాచార మార్పిడి ద్వారా ఎదురు ఎదురుగా రైళ్లు ఢీకొనకుండా నివారించచవచ్చు.

**కవచ్ కాలక్రమేనా అభివృద్ధి**

చెందుతూ వస్తోంది. 201415లో దక్షిణ మధ్య రైల్వేలో 250 కి.మీ సెక్షన్ కోసం పైలట్ ప్రాజెక్టుగా దీనిని రూపొందించారు. 201516 లో ప్యాసింజర్ రైళ్లలో మొదటి ఫీల్డ్ ట్రయల్స్ చేపట్టి, 201718లో కవచ్ స్పెసిఫికేషన్ వెర్షన్ 3.2ను తీసుకువచ్చారు. జూలై 2024లో ఇది మునుపటి అనుభవం ఆధారంగా కవచ్ నూతన వెర్షన్ 4.0 స్పెసిఫికేషన్ విడుదల చేశారు.

## పేదలను పణంగా పెట్టి బిలియనీర్లకు లబ్ధి

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ రెడ్‌బుక్‌ను ప్రదర్శిస్తున్నారని మోదీ మాట్లాడుతున్నారని, అయితే అందులో ఉన్న విషయాలు ముఖ్యం కానీ, రంగు కాదని హితవు పలికారు. మోదీ ఎప్పుడైనా రాజ్యాంగం చదివారా అని ప్రశ్నించారు. ద్వేషాన్ని వ్యాప్తి చేయవద్దని, సమాజాన్ని విడగొట్టవద్దని సూచించారు. ఇండియా కూటమి, బిజెపి—ఆర్ఎస్ఎస్ భావజాలాల మధ్య పోరు జరుగుతోందన్నారు. దేశంలో హింసను వ్యాపి చేస్తూ కులాలు, మతాలు, ప్రాంతాల వారీగా సమాజాన్ని చీల్చేందుకు ప్రయత్నిస్తున్నారని రాహుల్ మండిపడ్డారు. మోదీకో లేక ఆయనకు ఉన్న 56 అంగులాల ఛాతిని చూసో భయపడేది లేదన్నారు. బిలియనీర్ల చేతిలో మోదీ కీలుబొమ్మ అని ఘాటు విమర్శించారు. పగులంతా ప్రజలకు పాఠాలు బోధిస్తారని, రాత్రుళ్లు మాత్రం పారిశ్రామికవేత్తల వివాహాల్లో పాల్గొని విందులుతో మజా చేస్తున్నారని ఆరోపించారు. భూమి లాక్కునేందుకే ఉత్తరప్రదేశ్‌లో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వాన్ని పడగొట్టారని మండిపడ్డారు. ముంబయిలోని ధారావిలో రూ. లక్షల కోట్ల విలువైన భూమిని పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేసేందుకు మోదీ తీవ్రంగా యత్నిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన చేయాల్సిన అవసరాన్ని రాహుల్ సమర్థిస్తూ, దాని వల్ల దేశ ముఖచిత్రమే మారిపోతుందన్నారు. కుల గణన వల్ల వివిధ సంస్థల్లో గిరిజనులు, దళితులు, ఒబిసిల ప్రాతినిధ్యం బయటపడుతుందన్నారు. అందుకే కులగణన జరగాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. తాము అధికారంలోకి వస్తే 50 శాతం ఉన్న రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తామని, ఆ పనిని ప్రస్తుతం అధికారంలో ఉన్న మోదీ చేయగలరా అని సవాల్ విసిరారు. మోదీ పేదల పట్లకు తనకు అపార గౌరవం ఉందని చెప్పుకుంటున్నారని కానీ, రైతు రుణాలు మాత్రం మాఫీ చేయడం లేదని మండిపడ్డారు. అదే విధంగా జెంఎంఎం నేత హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేయడంపై బిజెపిని లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతూ 'మీరు గిరిజన సిఎంను ఎన్నుకుంటే, అతన్ని జైలులో పెట్టారు' అని రాహుల్‌గాంధీ ప్రజలకు గుర్తుచేశారు. బిజెపి వ్యాప్తి చేస్తున్న ద్వేషం, హింసను ప్రేమతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

## ప్రసూతి సెలవులా?

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జస్టిస్ జెబి.పార్థివాలా, జస్టిస్ పంకజ్ మితల్ ధర్మాసనం మాట్లాడుతూ ఈ నిబంధన సాంఘిక సంక్షేమ చట్టమని, శిశువు వయస్సును 3నెలల వరకు పరిమితం చేసినప్పుడు సహేతుకమైన వర్గీకరణ లేదని, ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ప్రాథమికంగా పిటిషనర్ పెట్టిన కేసు అని ధర్మాసనం పేర్కొంది. అయితే ఇతర మాటల్లో చెప్పాలంటే ఒకవేళ మహిళ మూడు మాసాల కంటే ఎక్కువ ఉన్నటువంటి శిశువును దత్తత తీసుకున్నట్లయితే, సవరించిన చట్టం ప్రకారం ఆమెకు ఎలాంటి ప్రసూతి సెలవు ప్రయోజనాన్ని కలిగి ఉండదు అని ద్విసభ్య ధర్మాసనం సర్వోన్నత న్యాయస్థానం నవంబరు 12న ఇచ్చిన ఆదేశాన్ని పేర్కొంది.ఈ కేసు విచారణ సమయంలో మూడు నెలల వయస్సుకు సంబంధించిన ఉత్తర్వుకు న్యాయం చేసే విషయమై కేంద్రం తన తిరుగు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని ధర్మాసనం వివరించింది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో శుక్రవారం నాడు చర్చించిన దానిపై కేంద్ర ప్రభుత్వం తన సమాధానాన్ని కోర్టులో దాఖలు చేయాల్సిన అవసరం ఉందని తెలియజేసింది. తిరుగు సమాధానం మూడు వారాల వ్యవథిలో దాఖలు చేయాలని డివిజన్ బెంచ్ కోరింది. ప్రభుత్వం దాఖలు చేసిన తిరుగు సమాధానం కాపీ అందజేసిన వెంటనే దానిని పిటిషనర్ తరపు న్యాయవాదికి కూడా ముందుగా పంపించాలని, రీజాయిండర్ ఏమైనా ఉంటే కాపీ అందిన ఒక వారం రోజుల్లో దాఖలు చేయాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ వివరించింది. కాగా, ఈ విషయమై డిసెంబరు 17న తుది పరిష్కారం ఉంటుందని ధర్మాసనం పోస్ట్ చేసింది. అక్టోబరు 2021న సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌పై కేంద్రం స్పందనను కోరింది. ప్రసూతి ప్రయోజన చట్టం 1961లోని 5 (4) వివక్షతపూరితం, అనారిగకం ద్విసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది.

## ఘనంగా రెసోనెన్స్ కళాశాల 'రెసోఫెస్ట్'

### ✻ హాజరైన వెయిట్‌లిఫ్టర్ కరణం మల్లీశ్వరి, సినీ నటుడు మురళీ శర్మ




ప్రజాపక్షం / హైదరాబాద్ శేరిలింగంపల్లి: రెసోనెన్స్ కళాశాల వార్షిక ఉత్సవం ' రెసోఫెస్ట్' గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. ఈ ఉత్సవానికి వెయిట్‌లిఫ్టర్ కరణం మల్లీశ్వరి, సినీ నటులు మురళీ శర్మ, సత్యదేవ్, రాహుల్ రామకృష్ణ , రిటైర్డ్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కాంత రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ రెసోఫెస్ట్ ఒక అవకాశమన్నారు. రోజువారీ చదువుల నుంచి అవసరమైన విశ్రాంతిని అందిస్తుందన్నారు. విద్యార్థులు అత్యంత కీలకమైన పరీక్షకు సిద్ధమవుతున్నప్పుడు మరింత ఉత్సాహంతో ముందడుగు వేసేందుకు ఒక అవకాశమని తెలిపారు.ఈ రెసోఫెస్ట్ మొదటి రోజు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సాగింది. రెసోనెన్స్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, వైద్య కళాశాలల టాపర్‌లకు రెసోఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందజేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com